సాహిత్య

# ప్రస్థానం

మే - 2007

వెల: రు.10



సాహితీ స్రవంతి

# దైవాలకు అవమానమంటు దైత్యుల దౌర్జన్యం - కళా స్వేచ్ఛ కాలరాయ కరాళ శక్తుల నృత్యం



చిత్రం: అన్ని మతాల విశ్వాసాలనూ, వేల్పులనూ ప్రతిబింబిస్తూ ఎంఎఫ్‌హుస్సేన్ గీసిన చిత్రం

సాహిత్య ప్రస్థానం
సంపుటి : 5 మే, 2007 సంచిక : 19

# ఆహ్వానం... అభ్యర్థన...

సాహిత్య ప్రస్థానం మాసపత్రికగా వెలువడినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పాఠకులు, సాహితీ మిత్రులు లేఖలు రాసినందుకు కృతజ్ఞతలు. గత సంచికలోనే తెలియజేసినట్లు ఇది పూర్తి స్థాయిలో వెలువడిన సంచిక కాదు. ఎందుకంటే పత్రిక ఎలా వుండాలన్న దానిపై అభిప్రాయాలు కోరుతూ సూచనలు, సమస్యలు ప్రచురించాము. దానిపై కొందరు పెద్దలు, మిత్రులు అభిప్రాయాలు రాశారు. ఇంకా అందవలసినవి కూడా చేరాక జూన్ సంచికలో ప్రచురించగలము. వాటిని సంపాదకవర్గంలో చర్చించి మాసపత్రిక రూపురేఖలు, విషయాలు నిర్ణయించగలము. కనక ప్రస్థానం పాఠకులూ, ఇందులో రచనలు చేసిన ప్రతివారూ తమ భావాలను పంచుకోవలసిందిగా మరీ మరీ ఆహ్వానిస్తున్నాము. అభ్యర్థిస్తున్నాము. అభిప్రాయాలు పంపిన వారి పేరూ, వాటి సారాంశం తప్పక ప్రచురిస్తాము. ఇప్పటి వరకూ ప్రస్థానం తీరు తెన్నులపై మీ అభిప్రాయాలు, రచనల ప్రచురణలో గాని, చందాదారులగా గాని మీకు కలిగిన అనుభవాలు రాస్తే భవిష్యత్తులో మరింత జాగ్రత్తగా సమర్థంగా వ్యవహరించే వీలుంటుంది. ఏమైనా ఫిర్యాదులుంటే తప్పని సరిగా రాయండి. ఇకపై వచ్చే ప్రతి లేఖకు సమాధానం రాయడం జరుగుతుంది. అలాటి యంత్రాంగం ఏర్పాటవుతున్నది. ఒకవేళ మేము సకాలంలో సవ్యంగా స్పందించడంలో విఫలమైతే తప్పక పోట్లాడండి.

మాస పత్రికగా ప్రస్థానంలో మరిన్ని రచనలకు అవకాశముంటుంది. వెంటవెంటనే అందే అవకాశమూ వుంటుంది. ఈ రీత్యా మీరు ఏ అంశాలలోనైనా రాయదల్చుకుంటే వాటిని ముందే సంపాదకులకు తెలియపరిస్తే నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుంది. సమీక్షల విషయంలో కొత్త విధానం తీసుకోవలసి వున్నందున ఇతర అంశాలకు సంబంధించి మీ ఆసక్తి తెలియజేయగలరు. మీ దృష్టిలో ప్రస్థానంలో ప్రచురణార్హమైన అంశాలు వుంటే సూచించవచ్చు. అలాగే ప్రసంగాలు, పరిశోధనా పత్రాలు వంటివి మీవైనా మీకు నచ్చినవైనా పంపించవచ్చు. విశాల ప్రయోజనాలకు దోహదపడే వాటన్నిటికీ ప్రచురణావకాశం వుంటుంది. అలాగే మీకు తెలిసిన ఔత్సాహిక చిత్రకారులూ, ఫోటోగ్రాఫర్లు ఇతర కళాకారుల చిత్రాలు, అరుదైన అలనాటి ఫోటోల వంటివి కూడా పత్రికకు పంపితే ప్రచురించవచ్చు.

వీటన్నిటితో పాటే ప్రధానంగా జరగవలసింది - ప్రస్థానం చందాలు చేర్పించడం. ప్రతి సంచికా సాధ్యమైనంత ఎక్కువ మందికి చేరితేనే రచనల ప్రయోజనం నెరవేరుతుంది. విశాల సాహిత్య వేదికా విస్తరిస్తుంది. అందుకే ప్రతి పాఠకుడూ, ప్రతి రచయితా కనీసం పదిమందితోనైనా చందాలు కట్టించాలి. తాము పనిచేసే సంస్థలలో ప్రస్థానం చేరేలా చూడాలి. ప్రస్థానం పరిచయ సభలు నిర్వహించాలి. చర్చలు ఏర్పాటు చేయాలి. ప్రస్థానం పాఠక బృందాలు ఏర్పడాలి. అలా వివిధ చోట్ల ఏర్పడే బృందాల నుంచి అందే రచనలూ, అభిప్రాయాలు పత్రికలో ప్రత్యేకంగా ప్రచురించే ప్రయత్నం జరుగుతుంది.

ఇలాటి వివిధ కోణాల నుంచి అందరి సమిష్టి భాగస్వామ్యంతో సాహిత్య ప్రస్థానం సర్వతోముఖ వికాసానికి కృషి కొనసాగిద్దాం.

**ముఖచిత్రం : యం. గణేష్**
**లోపలి చిత్రాలు : శేఖర్, ప్రభాకర్**

## ఈ సంచికలో...

భయం (కథ) ---------- 2
అందని చందమామ (దీర్ఘ కవిత) ---------- 6
సామాజిక చైతన్యానికి ప్రేరణలు
"రష్యన్‌సీత" కథలు ---------- 7
విజ్ఞాన శాస్త్రం - సాహిత్యం ---------- 8
తెలుగు కథానిక - ఎయిడ్స్ అవగాహన ---------- 10
విశ్వనాథ కథలు - సౌందర్యము ---------- 13
పరాన్నజీవి (కథ) ---------- 17
భాషా సమస్యా? సాంస్కృతిక సమస్యా? ---------- 21
వెంటనే చేరండి! (కథ) ---------- 23
కమ్యూనిస్టులపై దొంగ దాడి
మహాకవిపై మలిన ప్రచారం ---------- 27
కవితలు ---------- 30
అరుణకుమారి కథలలో స్త్రీ ---------- 31
ప్రకటనలు ---------- 34
రచయిత-రాజ్యం ---------- 35
అనువాద కవిత ---------- 36
వాసిరెడ్డి సీతాదేవి జీవితం-సాహిత్యం ---------- 37
నివేదిక ---------- 45
డైరీ ---------- 46

సంపాదకుడు
**తెలకపల్లిరవి**
ముద్రాపకులు, ప్రచురణకర్త
**వి. కృష్ణయ్య**
మేనేజర్
**కె. లక్ష్మయ్య**

ఎడిటోరియల్ బోర్డ్ అడ్రస్ :
సాహిత్య ప్రస్థానం
1-1-187/1/2,
వివేక్‌నగర్, చిక్కడపల్లి,
హైదరాబాద్-500 020
ఫోన్లు : 27660013, 27635136

# భయం



ఏ దుస్సంఘటనకో సాక్ష్యం చెప్పాల్సొస్తుందన్న భయమేదో తరుముతున్నట్టుగా దక్షిణ దిశ నుండి ఉత్తర దిశకు గుంపులు, గుంపులుగా నల్లని మేఘాలు పరుగులు తీస్తున్నాయి.

**శిరంశెట్టి కాంతారావు**

గాలి కూడా ఎందుకో స్తంభించి అడవికి ఉక్కపోత పోయిస్తున్నట్లుగా ఉంది.

నాలుగు రోజుల సెలవు తరువాత జింకలగూడెం స్టేజీలో బస్సు దిగిన నేను సమయానికి బడికి చేరుకోవాలన్న ఆలోచనతో వడి వడిగా నాలుగు కిలోమీటర్లు నడిచి రాళ్ళ వాగు చేరేసరికి బట్టలు ఉతుక్కుంటూనో, స్నానాలు చేస్తూనో కనిపించే వెదుళ్ళపాడు ఆడవాళ్ళు కానీ, పిల్లలు కానీ ఎప్పటి మాదిరిగా కన్పించడం లేదు!;

వెదుళ్ళపాడు వస్తున్న నాలుగేళ్ళలో ఇలాంటి అనుభవం ఎప్పుడూ ఎదురుకాలేదు. ఇదే మొదటి అనుభవం కావడంతో 'ఏంటబ్బా!?' అనుకుంటూ వాగు నీళ్ళల్లో కాళ్ళు పెట్టాను.

ఐతే! ఆఁ వాగు నీళ్ళు కూడా ఎందుకో భయపడి వళ్ళంతా చల్లబడిపోయిన అబలలా చల్లగా నా కాళ్ళను తాకుతూ ఎన్నడూ ఎరుగని ఓ కొత్త అనుభూతిని స్పర్శింప చేయసాగాయి! ;ఆఁ నీళ్ళ చల్లదనానికి వళ్ళు ఝల్లుమంటుంటే ఓర్చుకుంటూ చేతిలోని చెప్పులు జారిపోకుండా జాగ్రత్తపడుతూ నడుస్తున్న నేను ఎందుకో అప్రయత్నంగా తలతిప్పి ఎడమవైపు వాగు ఒడ్డు మీది తిప్ప పొదల వైపు చూసేసరికి ఒళ్ళు గగుర్పొడిచింది.

అక్కడ!

కప్పను మింగుతున్న ఓ మహత్వ కాంక్షతో దోసెడు వెడల్పున పడగ విప్పిన పాము్కటి తీవ్రంగా నాలుకలు కోరుతూ... ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయేలా బుసలు కొడుతూ కప్పతో చెలగాటమాడుతుంది.

ఆశ్చర్యంగా!

ప్రాణభయంతో గొంతు చిరిగిపోయేలా అరవాల్సిన కప్ప మాత్రం ఎందుకో!? ఏమాత్రం నోరు విప్పి అరిచే ధైర్యం చేయకుండానే ఆ పాము పడగ నుండి తప్పించుకోవడానికి చివరి యత్నం చేస్తుంది.

ఆఁ దృశ్యాన్ని చూసిన నా వెన్నెముకలో ఏదో జర, జర పాకినట్లై అరచేతులకు పట్టిన చెమటను జేబు రుమాలుకు ఒత్తుకుంటూ గబ గబ ఒడ్డెక్కాను.

మామూలుగా అయితే ఆ సమయానికి ఏ ఎలక్కాయో, తునిక్కాయో తినుకుంటూ పశుల కాపర్లతో పోతురాజు గుండు దగ్గర కన్పించే పిచ్చి కన్నప్ప గాని, పశువులు, పశువుల కాపర్లు గానీ కన్పించడం లేదు. నా చుట్టూ వలయాలు, వలయాలుగా ఏదో నిగూఢ నిశ్శబ్దం!

నేను నడుస్తున్న డొంకకు రెండు వైపులా గడీ గోడల్లా పెరిగిన దట్టమైన అడవి చెట్ల వెనుక నుండి ఎవరో అపరిచిత అగంతకులు రహస్యంగా నన్ను వెంటాడుతున్న భావన.

అలాగే మరికొంత ముందుకు వెళ్ళిన తరువాత డొంకకు కుడిపక్క కొండగోగు పొదల్లో యమ మహిషాల్లాంటి రెండు నెంబర్‌లేని కమాండర్లు, అయితే వాటిల్లో గాని ఆ చుట్టుపక్కల గానీ మనిషన్నవాడి జాడే లేదు.

సునామీ తరువాత భూమాత గుండె పొరలను చీల్చుకుని వస్తున్న ఊటనీరులా నా మెదడు పొరలను చీల్చుకుని ఎన్నో సందేహాలు.

– – –

ఊరికీ, నాకూ మధ్య మరో రెండు ఫర్లాంగుల దూరం.

సాధారణంగా ఆ సమయానికి ఊరి కంతాన్ని చుట్టి ఉండే వంట పొయ్యిల వెండి ధూమపు కండె ఎక్కడా కన్పించడం లేదు.

"అంటే దానర్థం?! ఏ గుడిసెలోనూ పొయ్యలో పిల్లి లేవలేదా? ఎందుకు?" కొరకంచులా నాలో మళ్ళీ ప్రశ్నలు.

"సారూ! దేహా చెట్టు చాటు నుండి సడీ, సవ్వడీ లేకుండా ఊడిపడ్డ ఊరిపెద్ద భోజరాజు దగ్గరకొస్తూ గుసగుసగా పిలిచాడు.



చెట్టు చాటు నుండి వడిశల్లో రాయిలా వచ్చి పడ్డంతో కలిగిన ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ "ఏంటి?" అన్నట్టు చూశాను.

"మీరొచ్చే డొంకెమ్మటి గాని, జింకలగూడెంల గాని బండేసుకొని మా వోడేమన్నా తగిలిండా?" ఏదో కంగారు, అంతకుమించి భయం, దుఃఖంతో కొట్టొచ్చినట్టు కన్పిస్తుంటే అదే గుస, గుస స్వరంతో అడిగాడు భోజరాజు.

అతని వాలకం నాలో ఏదో అనుమానాన్ని కలగజేస్తుంటే "ఎందుకంత భయం, భయంగా మాట్లాడుతున్నావే?" తెలుసుకోవాలన్న మానవ సహజమైన ఉత్సాహం తొంగి చూస్తున్న స్వరంతో అడిగాను.

"డొంక పొంటి ఇంకేమన్న కన్పించిందా?" తనకు సంబంధించిన సమాచారం ఏదో రాబట్టాలన్న తహ తహ తన మాటల్లో కన్పిస్తుంటే అడిగాడు భోజరాజు.

"ఆఁ ఆఁ కొండగోగు పొదల్లో ఏవో రెండు కమాండర్లు నిలబెట్టి ఉన్నాయ్" గుర్తుకు తెచ్చుకుంటూ చెప్పాను.

"ఇంకా అక్కడ్నే ఉన్నాయా?" అన్న ప్రశ్న కళ్ళతోనే వేస్తూ మౌనంగా ఆకాశంకేసి చూస్తూ నిల్చున్నాడు భోజరాజు.

"అవెవరివో నీకు తెలుసా?" – నేను

"తెలవది" తెలిసీ ఆ నిజాన్ని ఏ భయం వల్లనో తనలోనే సమాధి చేస్తున్నట్లుగా వచ్చింది సమాధానం.

ఆ తర్వాతి ఇక ఎక్కువ సేపు అక్కడ ఉండటం మంచిది కానట్టు చూస్తుండగానే దేవరచెట్టు వెనుక మాయమయ్యాడు భోజరాజు.

నాకే తెలియని ఏదో ఉద్విగ్నతకు లోనవుతూ సెల్‌లో 'టైమ్' చూసుకున్నాను. ఫస్ట్ బెల్ కొట్టాల్సిన టైమ్ అవుతుంది. కానీ, బెల్లు మోగడం లేదెందుకో? ఊళ్ళోనే ఉంటే పారా టీచర్ పార్వతి ఎందుచేతో బెల్ కొట్టించడం లేదు. ఏమైందామెకు?

దేవర చెట్టు దాకా గాలిలో తేలివచ్చే పిల్లల అరుపులు కూడా విన్పించడం లేదెందుకో!! ఏం జరిగిందో అర్థంకాక నా బుర్ర వేడెక్కిపోతుంది.

ఆలోచిస్తూనే మరికొంచెం ముందుకు సాగిన నాకేదో, సమాచారాన్ని అందించడానికే మిగిలిన ఉన్న చివరి సాక్షిలా నా కుడి కాలి కింద ఏదో వస్తువు గట్టిగా తగిలినట్టు అనిపిస్తే.. వంగి చేతిలోకి తీసుకున్నాను.

అది తెల్ల ఉసిరి చెక్క!

నాలుగేళ్ళుగా ఈ ఊళ్ళో పని చేస్తున్న నాకు ఏ వేళ్ళు, ఏ దుంపలు, ఏ తీగలు, ఏ ఆకులు, ఏ పసర్లు దేనికి పనిచేస్తాయో వ్యక్తిగత అభిరుచి ద్వారా గ్రామస్తుల నుండి తెలుసుకున్నవాణ్ణి.

అప్పుడు ఇంకా పరీక్షగా చుట్టుపక్కల పరికించి చూశాను.

చాలా గుర్తులు కన్పించాయి.

అంటే! ఈ రెండు, మూడు రోజుల్లో ఎవరినో – అదే అయితే మరి అందులో దాయాల్సిందేముంది? ఊరెందుకు నిశ్శబ్దమైంది?! గొడ్డూ – గోదా అన్నీ కట్టుగొయ్యల మీదనే ఉన్నట్టున్నాయెందుకు? అంతా ఏదో కనిపించని ముసుగు, సమాధానాలు దొరకని సవాలక్ష సందేహాలు.

ప్రకృతి ఒడిలో పుట్టి పెరిగిన ఈ అడవి బిడ్డల కెందుకు భయం. అంత అఘాయిత్యమేమొచ్చింది? అంత భయపెడుతున్న అంశమేమిటి? ఏ భయానికి బందీలయ్యారు? అసలు జరిగిందేమిటో తెలుసుకోవాలి. నాలో అంతకంతకూ పెరిగిపోతున్న జిజ్ఞాస.

– – –

బడిలో అడుగుపెట్టాను.

రోజూ నవ్వుతూ స్వాగతం పలికే నందివర్ధనాలు, మందారాలు, బిళ్ళ గన్నేరు, నూరువరహాలు అన్నీ విచారంగా తలలు వాల్చి ఏ మృతవీరుని మరణానికో మౌనం పాటిస్తున్నట్లుగా అన్పిస్తుంటే మెల్లగా లోపలికి నడిచాను.

అటెండర్, ఆయా, స్వీపర్, వంటమనిషి అన్నీ తానై చేసుకుపోయే చెంచమ్మ బడికి రానట్టుంది. ఆవరణంతా ఆకుల్తో, చెత్తా చెదారంతో దిబ్బలా ఉంది.

"నమస్తే సార్!"

అప్పుడే నన్ను చూసి వచ్చినట్టుగా ఉంది పార్వతి వాలకం. నిన్నటి దాకా నేనెరిగిన పార్వతి వేరు, ఇపుడు కన్పిస్తున్న పార్వతి వేరు! నిన్నటి చూపుల్లో మంచులాంటి నిర్మలత్వం – ఇప్పటి చూపుల్లో నిస్సహాయత. నిన్నటి నవ్వులో ఆహ్లాదం – ఇప్పటి నవ్వులో నిస్పృహ. నిన్న చిరుగాలికే తుళ్ళిపడే కొండమల్లి – నేడు ఏదో భయం ఉచ్చులో చిక్కి గిలగిల్లాడుతున్న పూరేడు పిట్ట. నాకంతా తెలుస్తూనే వుంది. కానీ, నిజంగా ఏదీ తెలియట్లేదు.

ఇప్పటి నా స్థితి ఒక సుప్త చేతనావస్థ
ఒక డోలాయమాన అవస్థ
ఎప్పటికీ అర్థం కానిదీ వ్యవస్థ

తన శారీరక భాష నాకేదో చెప్పాలని పడుతున్న, సంవేదనా శీలత స్పష్టాతి స్పష్టంగా తెలుస్తూనే వుంది. అయినా ఎందుకో నోరు విప్పడం లేదు. ఎందుకు? ప్రశ్నలు శరాలై నన్ను వెన్నాడుతూనే ఉన్నాయి.

"ఇయ్యాలేన్ను బడికి రాట్లేన్సార్! మా అమ్మమ్మకు వంట్ల బాగా లేదంట. చిలకలగొంది పోతున్న" తాళంచెవుల గుత్తి నా చేతుల్లో జారవిడుస్తూ... నా అనుమతి కోసం కూడా చూడకుండా వెళ్ళిపోతూనే ఉంది పార్వతి.

"పార్వతీ! ఒక్కమాట. నా సెల్‌కి సిగ్నల్ లేదు గాని, మీ టాటా ల్యాండ్ సెట్ నుండి మా ఇంటికోమారు ఫోన్ చేసి మా పాపనీరోజు హాస్పిటల్‌కి తీసుకెళ్ళేదుందని మేడంకి చెబుతావా. దగ్గరకొచ్చిన పార్వతితో అన్నాను.

"మా ల్యాండ్ సెట్ మొన్ననే సరెండర్ చేసినం సార్?" మరో మాటకు అవకాశం కూడా ఇవ్వకుండా చకచకా తలవంచుకు వెళ్ళిపోయింది.

ఊళ్ళో మంచికీ, చెడుకూ ఉపయోగపడుతున్న ఒకే ఒక ఫోన్‌ను సరెండర్ చేసిందా?! నేను రాని ఈ నాలుగు రోజుల్లో ఊళ్ళో ఖచ్చితంగా ఏదో జరిగింది. లేకుంటో దార్లో ఆ౦ జీపులేంటి? భోజరాజు కొడుకు తన బండితో సహా మాయమవ్వడమేంటి? తెల్ల ఉసిరి చెక్కతో పాటు అక్కడ కన్పించిన ఆనవాళ్ళేంటి? ఇప్పుడీ ఫోనేంటి? వీటన్నిటికీ ఏదైనా అంతః సంబంధం ఉందా? కలిపి చూస్తే ఉందనే అనిపిస్తుంది.

ఔను తప్పకుండా ఉంది. నా మెదడు కంప్యూటర్లో ఏదో ఒక అస్పష్ట రూపం వస్తుంది. ఓ నేరస్తుని ఊహా చిత్రాన్ని వందల కోణాల్లో చిత్రించి అసలు రూపాన్ని బైటకి తీసినట్లు నా మెదడు కంప్యూటర్ కూడా ఊళ్ళో ఏం జరిగి ఉంటుందో తెలుసుకోడానికి నా ప్రమేయం లేకుండానే రకరకాల ఊహా చిత్రాలను గీయడం మొదలు పెట్టింది.



నిశ్శబ్దంగా వెనుదిరిగిన నేను బడికి ఎదురుగా దక్షిణం పక్క ఉండే పిచ్చి కన్నప్ప మొండిగోడల గుడిసె వైపు అప్రయత్నంగా చూసేసరికి నా వళ్ళంతా కరెంట్ షాక్ కొట్టినట్టు జలదరించింది.

చెదలు పట్టి శిథిలమైన గుడిసె నడి గుమ్మంలో కూర్చున్న కన్నప్పను చూస్తుంటే... ఎండు తుంగ దుబ్బల్లో ఈనిన అడవి పంది, మనిషి వాసన పసిగట్టి ఘూంకరించినట్టు 'గుర, గుర' మని నోటితో ఏదో వింత ధ్వనులు చేస్తూ... మాటలతో చెప్పలేని ఒక అసహనంతో మనిషంతా నిలువెల్లా కంపిస్తూ... చింత నిప్పుల్లాంటి కళ్ళను చక్రాల్లా తిప్పుతూ దీర్ఘ శ్వాసలు తీస్తున్నాడు.

కన్నప్ప ఎందుకంత అసహనానికి గురవుతున్నాడు? ఏ సంఘటన అతని మెదడు నరాలను అంతగా కదిలించింది. నడిగుమ్మంలో నరసింహునిలా ఎందుకంత తీవ్రంగా చలిస్తూ అక్కడే కూర్చుంటున్నాడు?!

తానెంత పిచ్చివాడైనా నన్ను చూస్తే చాలు మౌనంగా తప్పుకుంటూ ఓ అలవాటుగా దండం పెట్టే తను నన్ను చూసి కూడా ఏమాత్రం లెక్క చెయ్యకుండా బిర్రు చూపులు చూస్తున్నాడెందుకు? నా తలలో ప్రశ్నల విస్ఫోటనం.

– – –

బడి వరండాలోకొచ్చాను. అక్కడ కన్పించిన దృశ్యం నన్ను మరింత ఆలోచనా అగాధాల్లోకి నెట్టింది. ఆ రాత్రో, అంతకుముందు రోజో అక్కడెవరో భోజనాలు చేసి వెళ్ళిన ఆనవాళ్ళు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

కిందంతా నూనె మరకలు, గోడల మీద చిందిన సాంబారు చినుకులు. కిందపడి ఎండిపోయిన ఎంగిలి మెతుకుల మీద పుట్ల కొద్దీ పట్టిన ఎర్ర చీమలు బారులు కట్టి ఎక్కడికో తీసుకుపోతున్నాయి.

ఇక్కడ అన్నాలు తిన్నదెవ్వరు?! నా చిన్న మెదడులో ఏదో మెరుపు. జరిగిందేమిటో అసందిగ్ధంగా అర్ధమవుతుంది. కానీ, నిఖరంగా జరిగిందేమిటో చెప్పేదెవరు?

తాళాలు తీసిన నేను చెంచమ్మ కూడా రాకపోవడంతో గత్యంతరం లేక గంట కొట్టాను.

రోజూ చెంచమ్మను కూడా కొట్టనివ్వకుండా గంట కొట్టడానికి పోటీలు పడే పిల్లలు కూడా బడికి రాకపోవడం అన్నింటికన్నా నన్ను కదిలించిన అంశం.

పాలకు విడిచిన లేగదూడల్లా గెంతులేస్తూ... బడికొచ్చే పిల్లలు గంట చప్పుడు విన్న పది నిమిషాల తరువాత ఇష్టం లేకపోయినా ఇక తప్పదన్నట్టు పలకలు, పుస్తకాలూ పట్టుకొని జంగుపిల్లిని చూసిన కోడిపిల్లల్లా భయం, భయంగా బెదురు చూపుల్తో వచ్చి మౌనంగా ఎవరి తరగతిలో వాళ్ళు పలకలు, పుస్తకాలు పెట్టి వచ్చి ప్రార్ధన కోసం తరగతుల వారీగా వరుసల్లో నిల్చున్నారు.

"భారతదేశం నా మాతృభూమి. భారతీయు లంతా నా సహోదరులే –" ప్రతిజ్ఞ చేయించాను.

బడికి కొద్దిమందే రావడంతో అందరినీ వచ్చి ఒకచోట కూర్చోమన్నాను.

'కీ' ఇచ్చిన మరబొమ్మల్లా ఎవరికి వాళ్ళు మౌనంగా వచ్చి వరండాలోనే కూర్చున్నారు. వాళ్ళెందుకో భయపడుతున్న స్థితి వాళ్ళ ముఖాల్లోనూ, కళ్ళల్లోనూ అద్దంలో కన్పించినంత స్పష్టంగా కన్పిస్తుంటే – వాళ్ళనా భయం ఊబిలో నుండి బయటకు తీసుకొచ్చే ప్రయత్నానికి అంకురార్పణ చేసస్తూ "ఈ రోజు చెంచమ్మ బడికెందుకు రాలేదురా!" అంటూ ప్రశ్నించాను.

"వారం రోజులదాకా బడికి రానని చెప్పి నిన్ననే ఊరికి పోయింది సార్!" – చెప్పారంతా.

నాకు తెలిసి ఈ నాలుగేళ్ళల్లో చెంచమ్మ బడి మానేసి ఊరి పొలిమేర దాటి వెళ్ళిన సందర్భం లేదు. తనకు 'నా' అనే వాళ్ళెవరూ లేరని, ఈ ఊరే తన ఇల్లని, ఈ బడి పిల్లలే తన బిడ్డలని ఎన్నోసార్లామె నాతో చెప్పింది. అలాంటిది వారం రోజులు బడికి రానని ఊరికి వెళ్ళిందా? ఏ ఊరేం? ఎందుకు?" – నాలో నేనే.

"మరివాళ మధ్యాహ్న భోజనమెలారా? పార్వతి అలా పోయింది. చెంచమ్మ ఇలా పోయింది" రెండో బాణం వదిలాను.

కాయ రాలుతుందో – బాణం వృధా అవుతుందో చూడాలి మరి.

"మద్దేనం బువ్వలేకపోతే మాన్లే సారూ!" ఇంత చిన్న వయసు నుండే రాజీపడ్డం. సర్దుకుపోవడం వీళ్ళ బ్రతుకుల్లో ఓ తప్పనిసరి అంశమైపోయింది. ఆ౦ రాజీపడ్డానికి ఆ సర్దుబాటును బద్దలు కొట్టి ప్రశ్నించడం, ఎదిరించడం ఎప్పుడు నేర్చుకుంటారో మరి!

మరికొంతసేపు వాళ్ళను మాటల్లో మభ్యపెట్టి "ఊళ్ళో ఏదో జరిగిందట కదా!?" కావాలని అడుగుతున్నట్టుగా అడగకుండా అడిగాను.

వెంటనే ఏదో చెప్పాలని తయారైన వాళ్ళు అంతలోనే ఏదో గుర్తుకొచ్చినట్టు ఒకరికొకరు కళ్ళతోనే హెచ్చరించుకుంటూ నిశ్శబ్దంగా కూర్చున్నారు తప్ప నోరు విప్పి ఎవ్వరూ ఒక్క మాట మాట్లాడలేదు.

పేరు, పేరునా నిలబెట్టి అడిగినా లాభం లేకపోయింది. అయితే జరిగిందేమిటో వాళ్ళందరికీ తెలుసుననేది నాకు తెలిసిందని, వాళ్ళకు తెలిసీ తెలియనట్టే నటిస్తున్నారని తెలుస్తూనే వుంది. ఇదో దొంగాట.

– – –

మరో వారం రోజులు అలాగే గడిచిపోయాయి.

ఈ వారం రోజులూ ఉన్న దగ్గరే ఉన్న కమాండర్లు ఈ రోజు పొద్దున్నే వచ్చేసరికి కన్పించలేదు! ఎవరు తీసుకెళ్ళారు? అసలిన్ని రోజులు వాటినక్కడెందుకుంచారు? ఎవరుంచారు?

ఎవరికి తెలుసు?

తెలిసినా చెప్పేదెవరు?

మనుషుల మనసులు భయం తెరలలో కప్పబడిపోయిన తరువాత యధార్థ దృశ్యం ఏదీ కన్పించదు.

ఈ వారం రోజులుగా భోజరాజు కనిపించకుండా పోయిన తన కొడుకు కోసం, వాడి బండి కోసం బయటకు పొక్కకుండా మనిషి మనిషినీ ఆరా తీస్తూనే ఉన్నాడు.

అయినా, అణువంత ప్రయోజనం కూడా లభించలేదు. ఊళ్ళో వాళ్ళకు నిజంగా అతని గురించి గాని, అతని బండి గురించి గానీ తెలియదా? తెలిసీ చెప్పడానికి భయపడుతున్నారా? ఎవరేం తేల్చాలి?

పిల్లి మెడలో గంటెవరు కట్టాలి?

వారం రోజుల కిందట తెల్ల ఉసిరి చెక్కతో వైద్యం జరిగిందెవరికి? వాళ్ళకెలా ఉంది? అసలు దాన్ని ఊళ్ళో అనుకున్న వాళ్ళే లేరెందుకు?

"ఏదో ఊరికని వెళ్ళిని చెంచమ్మ ఇంతవరకు జాడే లేదెందుకు?" గణ, గణ, గణ బడి గంట గాలి తరంగాల్లో అలలు, అలలుగా తేలి వచ్చి నా కర్ణపుటాలను కదిలించడంతో ఒక్కసారిగా ఆలోచనా ముద్ర నుండి బయటకొచ్చిన నేను చుట్టూ చూసుకునే సరికి దేవచెట్టు దరిదాపుల్లోకి వచ్చాను.



" గంట మోగుతుందంటే – ఈ రోజు పార్వతి బడికొచ్చిందేమో? అందుకే గంట మోగుతుంది" అనుకుంటూ గబ, గబ స్కూలు కేసి నడిచాను.

– – –

పార్వతి వారం తరువాత బడికైతే వచ్చింది గాని మనిషి మాత్రం మునుపటిలా లేదు. ఎందుకో ముడుచుకునే ఉంది. తన ప్రతి కదలికలోనూ అంతర్లీనంగా ప్రవహిస్తున్న భయం స్పష్టాస్పష్టంగా కన్పిస్తూనే ఉంది.

ఉదయం బడికొచ్చిన దగ్గర్నుండి నాతో అంటీముట్టనట్టే ఉన్న తనను లంచ్ బ్రేక్‌లో స్టాఫ్ రూంలో కూర్చున్నపుడు "ఏంటి పార్వతి! ఊళ్ళో ఏం జరిగిందసలు? ఊళ్ళో వాళ్ళంతా ఎందుకలా ప్రవర్తిస్తున్నారు? ఇంత భయపడాల్సిన సంఘటనలేం జరిగాయి?" ఇంక ఆగలేక ప్రశ్నల వర్షం కురిపించాను.

చాలాసేపటి వరకు తలవంచుకు కూర్చున్న తను "ఏం లేద్సార్! ఏముంది?" అప్పటికీ నోరు విప్పటానికి ఇష్టం లేని తను ముక్తసరిగా సమాధానం ఇస్తూ దాటవేసింది.

"ఏం లేదంటావేంటి? మీ అమ్మమ్మను చూసి వస్తానని వెళ్ళినదానివి వారం రోజులకొచ్చావే. చెంచమ్మ ఆసలింతవరకు రానేలేదు. పిల్లలకు మధ్యాహ్న భోజనాలు పెట్టక పది రోజులు అవుతుంది తెలుసా? రేప్పొద్దున ఈ విషయం ఎవరో ఒకరు పడో – పడకో పై వాళ్ళకు చెప్పారనుకో నేనేం సమాధానం చెప్పుకోవాలి?" వద్దనుకున్నా నా స్వరంలో తీవ్రత నా పరిధి దాటిందనే చెప్పాలి.

ఔను మరి, నా భయం నాది. మనిషి ప్రతి చర్య వెనుకా సమాధానం చెప్పుకోవాల్సిన జవాబుదారీతనం దాగి ఉంటుంది. ఆ! జవాబుదారీతనాన్ని నడిపించే మూల సూత్రం భయమేనేమో?! సంఘ చలనానికి, సామాజిక వికాసానికి భయమే ప్రధాన కారణమా? ఏమో? దీనిని ఎవరో ఒకరు నిగ్గు తేల్చాల్సిన సమయం వచ్చిందేమో –

నా ప్రశ్నల ఉధృతికి మౌనం తటాకానికి గండి పడిందేమో గాని అప్పుడు నోరు విప్పింది పార్వతి.

"చెంచమ్మ ఇంకేమొస్తుందో సార్!" సందేహమే ఆకృతి దాల్చినట్టు ఆమె.

"అదేంటి?" నిభిడాశ్చర్యంతో నేను.

"ఏం జెప్పాలి సార్! ఊళ్ళో పరిస్థితులు ఈ మధ్య మరీ దారుణంగా తయారయ్యాయి. పొద్దు గుంకితే సాలు ముక్కూ – మొహం తెలియని వాళ్ళెవరెవరో ఊరి మీద పడి ఏదేదో అడుగుతూ నిర్బంధిస్తున్నారు. అడిగిందానికి సమాధానం చెప్పకపోతే రక్తాలు కారేటట్టు కొడుతున్నారు. వాళ్ళెవరో తెలవదు. వీళ్ళెవరో తెలవదు. భోజరాజు కొడుకును ఎత్తుకెళ్ళిందెవరో మాకే తెలియదు.

ఊళ్లో అందరికంటే ఎక్కువ బాధపడుతుంది చెంచమ్మే సార్! ఓ అద్దరేత్రి లేదు, అపరేత్రి లేదు. ఎప్పుడు పడితే అప్పుడు ఎవరు పడితే వాడు రావటం వండి పెట్టమని అడగటం. తన దగ్గర వండి పెట్టడానికి ఏమీ లెవ్వన్నా ఆమెను వదలడం లేదు. పైగా బడిలో వండే మధ్యాహ్న భోజన పథకం బియ్యం, పప్పు తీసి వండి పెట్టమంటూ నిర్బంధిస్తున్నారు. స్టోర్ రూమ్ తాళం చెవులు తన దగ్గర ఉండవని మొత్తుకుంటున్నా నమ్మక ఏడిపిస్తున్నారు. ఇదేంటని ఊళ్ళో వాళ్ళెవరైనా నోరు విప్పితే నాలుగు తంతున్నారు.

సరే, తంతే తన్నారులే ఎల్లిపోయారు గదా! అనుకునేలోగా ఇంకొకళ్ళొచ్చి ఊళ్ళో కెవరొచ్చారు? ఏం జెప్పారు? ఏందిన్నారు? చెప్పండంటు వీళ్ళూ తంతున్నారు.

ఓ పిల్లలని లేదు, పెద్దలని లేదు. ఆడలేదు, మగలేదు ఎవర్ని బడితే వాళ్ళను – ఇంక మాట్లాడలేక తలదించుకుని కూర్చున్న ఆమె గొంతు పూడుకుపోయి దుఃఖం కళ్ళ నుండి ధారలై కారసాగింది.

ఇప్పుడు నేనొక మౌన విపంచిని.

స్టోర్ రూమ్ తాళాల కోసం వాళ్ళు మిమ్మల్నెప్పుడైనా కలవొచ్చు సార్! మీ గురించి, మీ అడ్రస్ గురించి వాళ్ళెన్నోసార్లు నన్నూ, చెంచమ్మనూ వత్తిడి చేశారు.

"ఏ నిమిషంలో ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు సార్! ఎందుకైనా మంచిది. ఈ ఊరు నుంచి ట్రాన్స్‌ఫర్ పెట్టుకుని ఎటైనా పొండి. మీ జాగర్తలో మీరుండకపోతే మీకేం జరుగుద్దో చెప్పలేం." పార్వతి చెబుతున్న ఒక్కో మాటా తూటాలా పేలుతుంటే నిశ్చేష్టుణ్ణై పోయాను!

జీవితంలో మొదటిసారిగా నేనెన్నడూ ఎరుగనంత భయం నన్ను నిలువునా ఊపేస్తూ....

F

## దీర్ఘ కవిత (2)

# అందని చందమామ



డా॥ కాసుల లింగారెడ్డి

**(3)**

విశ్వావిర్భావాన్ని
విశ్వాసం చూపుడు వేలు మీద
విశదీకరించే వాళ్ళు –
అతీత శక్తుల అభూత కల్పనలతో
అహం అగ్గిని రాజేసుకునే వాళ్ళు
శాస్త్రం విప్పిన విచక్షణ వెలుగుల్ని
చూడలేని దివాంధులైన వాళ్ళు
సంపదలకు ప్రామాణికమైన శ్రమని శ్లాఘించని వాళ్ళు
స్థల కాల చక్ర అవిచ్ఛిన్నతని
అర్థం చేసుకోలేని అజ్ఞానులు –
నడి సంద్రంలో కరుగుతున్న మంచు గడ్డ మీద
కాలాన్ని ఈదుతున్న వాళ్ళు –
మీరు వాళ్ళని అమాయకులంటారు –
కొందరు వాళ్ళని మూర్ఖులంటారు –
నేను వాళ్ళని ద్రోహులంటాను –

**(4)**

నడకలో
అమరికలో
అనుసంధానంలో
విశ్వం క్రమత్వంలో వుంది –
విశ్వం క్రమత్వ కిరీటం ధరించింది –
విజ్ఞాన శాస్త్రాలు విశ్వక్రమత్వ విశదీకరణ దర్పణాలు –
మానవ పురోభివృద్ధి మార్గదర్శకాలు –
Road to liberty
Road to equality
Road to fraternity
మరిప్పుడు రోడ్డంటే
పల్లెల మీద పాకుతున్న అనకొండ
ఇళ్ళమీద తైతక్కలాడుతున్న బుల్‌డోజర్
Express high way to evacuate the poor
పేదల నిర్మూలనా కార్యక్రమంలో
దొరలు దొరలు కలిసి ఊళ్ళు పంచుకుంటున్న దృశ్యం
కన్నీళ్ళు తప్ప నీళ్ళు దొరకవు –
మరుగుదొడ్ల జాడుండదు
ఊరు ఊరంతా రైలు పట్టాల పొడుగుతూ
బరిబాతల బారులు దీరడమే
మందుల్లేని మాయరోగాలుంటాయి –
ఏజెంటు నొదిలి
పందులు పద్మామనే మాయల ఫకీర్లుంటారు –
పంపకాల కోసం
రంజైన పథకాలుంటాయి –
తీరాల ఇసుక పలకల మీద రాతలైన
రాజ్యాంగ హక్కులుంటాయి –
ప్రభుత్వ బాధ్యత కాదు
ప్రజారోగ్యం గాలిలో దీపం –
ప్రపంచీకరణ గాలివాన
చేతులడ్డం పెట్టి భజన చెయ్యండ్రా
నమాజ్ కరో భయ్యా
యెహోవాని ప్రార్థించండి బ్రదర్స్ –

**(5)**

కాలపు చిటికెన వేలు పట్టుకొని
బాధల నది దాటుదామనుకున్నప్పటి మాట
పాత దేహాలకు కొత్త పాదాలు తొడిగి
సంకుచిత సొరంగాల్నుంచి
విస్తృత ఆహ్లాద పచ్చిక మైదానాల్లోకి
అడుగిడుదామనుకున్నప్పటి మాట
మూఢత్వాల మోసపు యవనికల్నుంచి
దేహాల్ని కొరుక్కుతింటున్న పోషకాహార లేమి చదల్నుంచి
ఆర్థిక వ్యత్యాసాల అసహజ సామాజిక కట్టడాల్నుంచి
సరికొత్త వ్యవస్థ శిశువుకు పురుడు పోద్దామనుకున్నప్పటి మాట
ఆల్మా ఆటా అందరి నోటి పాటైన నాటి మాట
Health for all by 2000 A.D.
ఒక సుందర స్వప్నం
లేత మెదళ్ళ మీద
విశృంఖల విషక్రిముల వికటాట్టహాసం నృత్యం
బీభత్స తుఫాను హోరుకు ఒరిగిన చిన్ని ప్రాణాలు
సంప్రదింపుల గదిలో
సుదీర్ఘ నిర్నిద్ర రాత్రుల సామూహిక దుఃఖాల ఊరేగింపు –
రెండు వేల మూడు నాటి గాయం మచ్చలు
మళ్ళీ రెచ్చి జడలు విచ్చిన వేళ
Health for all by 2000 A.D.
ఒక వెక్కిరింత
హద్దులు మీరిన జ్వర తీవ్రతలో
యౌవనం ఇప్పుడొక మూడు కాళ్ళ ముసలి
పసిపిల్లలు లేని చోటే కాదు
అంబాడుతున్న చోట కూడా
ముసలి వాళ్ళు పసిపిల్లలైన తీరు
అంతా ఒక రోబోట్ పరేడ్

## నచ్చిన రచన

# సామాజిక చైతన్యానికి ప్రేరణలు "రష్యన్‌సీత" కథలు




ఎల్. గాయత్రి

పుస్తకాలు దీపాలవంటివి ఆ వెలుగులో సునాయాసంగా గమ్యం చేరవచ్చునన్న సత్యాన్ని నిరూపించినది రష్యన్‌సీత కథా సంపుటి. డా॥ పోరంకి దక్షిణామూర్తి గారి ఆ ముఖంతో పాఠకుల సముఖానికి వచ్చిన ఈ కథలు చదువరులను ఆలోచింపచేస్తాయి. సమాజంలో మనకు తెలిసీ తెలియక, అనుభవంలోకి వచ్చీ రాకుండా అంతర్లీనంగా ఉన్న సమస్యలకు చక్కని పరిష్కారాలు ఈ కథలలో దాగి ఉన్నాయి.

ఎదురవుతున్న పలు సమస్యలు ప్రవాస పెళ్ళికొడుకుల నిజస్వరూపం, అవినీతి లంచగొండితనం, రాగింగ్, మనిషిలోని అహంభావం వల్ల కలిగే అనర్థాలు వంటి అంశాలెన్నో పాతిక కథల ద్వారా రచయిత్రి తెలియపరిచారు.

రష్యన్ సీత ద్వారా భారతీయ సంప్రదాయాలను గౌరవించే విదేశీ అమ్మాయిలు, వారిని సునాయాసంగా మోసగించే ప్రవాస భారతీయ పెళ్ళి కొడుకుల మనస్తత్వాలు వెలుగులోకి తేవడంలో రచయిత్రి విజయం సాధించారు. "ఎదురుదెబ్బ" కథలో "పారిస్‌లో ఉన్న ఇంజనీర్ కొడుకుని పెళ్ళిళ్ళ మార్కెట్‌లో పెట్టి కొన్ని వేలకు అమ్మి ఆనందించారు మాధవ్ తల్లీ తండ్రీ, తనేం చేసాడు? అంతకు ముందే ఇంకో అమెరికన్ స్త్రీని పెళ్ళాడి ఓ బిడ్డకు తండ్రి అయ్యాడు. ఆ మోజు తీరకముందే తల్లిదండ్రుల మోజు ముచ్చటకోసం వర్దని మెడలో పుస్తెకట్టాడు" అన్న రచయిత్రి మాటలు ప్రవాస పెళ్ళి కొడుకులలోని స్వార్థానికి పరాకాష్ఠ.

అవినీతి లంచగొండితనం వల్ల కలిగే అనర్థాలను తెలిపే "గురువుకే గురుడు", మనిషికి అహంభావం తగదని తెలిపే "దర్పం కొట్టిన దెబ్బ", తెలిసీ తెలియని టీనేజ్‌లో వయసు తెచ్చే ప్రలోభాలకు లొంగకూడదని తెలిపే "పరువంపు", భౌతిక రూపానికి కాకుండా మానసిక సౌందర్యానికి విలువ నివ్వాలనే "ఎవరు విధించిన శిక్ష" వంటి కథలు అన్ని వర్గాల వారిని ఆలోచింప చేసేవిలా ఉన్నాయి.

మారుతున్న కాలంతో పాటు మనమూ మారాలని చెప్పే "నా బ్రతుకు నీకు వద్దమ్మా", వరకట్న దాహానికి బలైపోయిన ఆడపిల్లల తండ్రుల స్వార్థపూరితమైన ఆలోచనను తెలిపే "మీరేమంటారు?", ఉన్నత విద్యాభ్యాసం తెచ్చిన ధనార్జన మోజు వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఓల్డేజ్ హోమ్ పాలు చేసి వెళ్ళిన సంతానానికి "మాతృదేవోభవ" కథలు కనువిప్పు కాగలవు.

కనిపించని గృహ హింసతో ప్రాణాలు బలిపెడుతున్న ఇల్లాళ్ళ జీవితాలకు దర్పణం "ఇది హత్యకాదా?" వారందరి పక్షాన ధైర్యంగా ప్రశ్నించిన రచయిత్రిని అభినందించక తప్పదు. ఈ కథలోని ఇతివృత్తం ఇంచుమించు చాలా కుటుంబాలలో మనకు కనిపిస్తుంది. ప్రేమ పెళ్ళిళ్ళకు, పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళుకు గల వ్యత్యాసాన్ని తెలియచేస్తూ, అనుభవం లేని వయసులో తెలియపరచిన అభిప్రాయాలు ఎలాంటివో తెలిపే కథ "ఇది ప్రసంగం అది ప్రపంచం", వివాహ వ్యవస్థలోని లొసుగులు ఈ కథలో స్పష్టపడతాయి. ఆడపిల్లల మనస్తత్వానికి ప్రతీకలుగా "ఆడపిల్ల" "తిరిగొచ్చిన బాల్యం" "మనిషి కోరేది కథలు" నిలుస్తాయి. పై కథలన్నీ రచయిత్రి స్త్రీవాద దృక్పధానికి ఆలంబనలు,

రాగింగ్ భూతానికి బలైపోతున్న నేటి తరం విద్యావిధానానికి పరాకాష్ఠగా ఉన్న "అన్యాయమా జిందాబాద్" కథ శాంతారాం వంటి ప్రిన్సిపాళ్లతో పాటు, వినోద్ భువనేశ్వరి వంటి విద్యార్థుల జీవితాలకు నమూనాలని చెప్పక తప్పదు. "ప్రతిఫలం", "దొడ్డమనసు", "రెండు తలల మనిషి" వంటి కథలు స్వార్థగత ప్రాణులను మేల్కొలిపేవిగా ఉన్నాయి.

దేశంలో తమని తాము కించపరచుకునే స్త్రీలున్నంతకాలం మగవారి అహం చావదు. సాటి స్త్రీ సానుభూతితో చూసి, ధైర్యంతో ముందుకి నడిపించినపుడే స్త్రీలలో చైతన్యం కలుగుతుంది అంటూ సూదంటిరాళ్ళ వంటి మాటలతో 'మనం మారేదెప్పుడు?" అని రచయిత్రి సుతిమెత్తగా ప్రశ్నిస్తుంది.

ఈ కథా సంపుటిలోని కథలు అన్ని వర్గాల వారిని ఆలోచింపచేసేవిగా ఉన్నాయి, పలు ప్రాంతాలు పర్యటించిన రచయిత్రి విశేషణా శక్తికి, ఆలోచనా ధోరణికి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా, నమూనాలుగా ఉన్న "రష్యన్ సీత" కథలను చదివి తీరవలసిందే.

పరిశీలన

# విజ్ఞాన శాస్త్రం - సాహిత్యం



**సాహిత్యానికి, విజ్ఞానశాస్త్రానికీ నడుమనున్నది స్నేహమా లేక వైరుధ్యమా అనే అంశంపై శతాబ్దాలుగా చర్చ కొనసాగుతూనే ఉంది. ఈ అంశాన్ని గూర్చి ప్రపంచ పరిధిలో ఆలోచిస్తే కొంత సులభంగా అవగత మవుతుంది. సాహిత్యానికి, విజ్ఞానశాస్త్రానికి నడుమ బలమైన విభజనేమీ కనిపించదు. ఈ రెండు పరస్పర పోషకాలే తప్ప విద్వేషకాలు కావు. మానవ నాగరికత పరిణామంలోను సాంస్కృతిక పురోభివృద్ధిలోను ఈ రెండు అన్యోన్యాశ్రితాలు. మేధావులంతా సాహిత్యం, విజ్ఞానశాస్త్రాల సమైక్యం వైపే మొగ్గు చూపారు.**


**తన్నీరు కల్యాణ్ కుమార్**

**పి.హెచ్.డి. విద్యార్థి**


విశ్వశ్రేయస్సే ఆలంబనగా ఏ రచయిత ఎప్పుడు సాహిత్య రచన ప్రారంభించినా ఆనాటి సాంఘిక, రాజకీయ, ఆధ్యాత్మిక,వైజ్ఞానికాది విషయాల ప్రభావం ఆ రచనలో కనిపిస్తుంది. సిరులివ్వలేని భవిష్యత్తులోను అద్భుత గనులివ్వగల శక్తి వైజ్ఞానిక శాస్త్రానికి, సాహిత్యానికి మాత్రమే ఉంటుంది. ఈ రెండూ మానసిక స్థాయిల్లో ఒకే జిజ్ఞాసకు ఉండే రెండు అన్వేషణ మార్గాలనవచ్చును. జాతి, మత, కులాలకు అతీతంగా మానవాభ్యుదయం వంటి మహోన్నత లక్ష్యంతో సత్యాన్వేషణ జరిపే విశిష్ట రంగాలుగా వైజ్ఞానిక సాధన, కవితా తపస్సులను పేర్కొనవచ్చు.

సాహిత్యం మానవ జీవితంలో ఒక ప్రముఖమైన పాత్రను పోషిస్తుంది. మనస్సుకు హాయిని కలిగిస్తూ వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించడం సాహిత్య పరమావధి. మానవులలో పరివర్తన తీసుకొచ్చి, వారి మనస్సులను ప్రక్షాళన చేయడమే కాకుండా వారి ఆలోచనలను వికసింపజేస్తుంది. సంఘ చైతన్యం అనేది సాహిత్యం ద్వారానే సాధ్యమవుతుంది. సాహిత్య సృష్టికర్త ప్రజాశేయస్సు తన ప్రధాన ధ్యేయంగా కలిగి ఉంటాడు. ప్రజా శ్రేయస్సుకు అవరోధాలుగా ఉన్న శక్తులను తన కలం ద్వారా ఎదిరించడానికి ప్రయత్నిస్తాడు. నాగరికతాభి వృద్ధికి, సంఘ సంస్కారానికి సాహిత్యం అనేది అత్యవసరం.

'సైన్సు' అని ఆంగ్లంలో పిలిచే విజ్ఞానశాస్త్రాన్ని ఒక నిర్వచనంలో బంధించి చెప్పడం అనేది చాలా కష్టంతో కూడుకున్న పనిగా చెప్పవచ్చు. దైనందిక జీవితంలో కనిపించే విద్యుత్, రవాణా సాధనాలు, కంప్యూటర్లు, ఆసుపత్రులలో జరిగే శస్త్ర చికిత్సలే విజ్ఞానశాస్త్ర మనిపిస్తుంది. ఇవికాక భౌతిక, జీవశాస్త్రాలు గణితం మొదలైన వాటిని కూడా విజ్ఞానశాస్త్ర మనుకోవచ్చు. సైన్సు అనేది ఒక ప్రయోగం. ప్రతి విషయాన్ని ప్రయోగాత్మకంగా చూడటవే గాక అవకాశమున్న ప్రతి ప్రత్యామ్నాయాన్ని తెలివిగా ఒక క్రమపద్ధతిలో శోధిస్తూ, సాధనకు అనువుగాని అంశాలకు తిలోదకమిస్తూ, అనువైన వానిని అక్కున చేర్చుకుంటూ తనదైన మార్గంలో పురోగమిస్తూ సాగిపోతుంది. భారతావనిపై ఉద్భవించిన వేద, ఉపనిషత్తు, బ్రాహ్మణ, ఆరణ్యక, మీ మాంసాది గ్రంథాలు పదార్థ జగతి మీద, గ్రహగోళ సంచలనాల మీద, జీవరాశుల చలనం మీద అన్యనమైన సమాచారాన్ని ప్రకటించాయి. 16-17 శతాబ్దాలలో విజ్ఞానానికి సంబంధించిన అనేక ముఖ్య పరిమాణాలు పాశ్చాత్య దేశాలలో చోటు చేసుకున్నాయి. కోపర్నికస్, గెలీలియో, న్యూటన్ అనే ముగ్గురు శాస్త్రవేత్తలను ఈ పరిణామానికి మూల పురుషులుగా చెప్పు కోవచ్చు. ఆనాటి నుండి ఈనాటి వరకు విజ్ఞానశాస్త్ర పరిశోధనలు దినదిన ప్రవర్ధమానమై అనేక దివ్యమైన పరిశోధన ఫలితాలు వెలుగు చూసాయి. విజ్ఞానశాస్త్రానికి రుజువు, ప్రయోగం, ఫలితం ఆధారాలుగా ఉంటాయి.

సాహిత్యానికి, విజ్ఞానశాస్త్రానికీ నడుమనున్నది స్నేహమా లేక వైరుధ్యమా అనే అంశంపై శతాబ్దాలుగా చర్చ కొనసాగుతూనే ఉంది. ఈ అంశాన్ని గూర్చి ప్రపంచ పరిధిలో ఆలోచిస్తే కొంత సులభంగా అవగత మవుతుంది. సాహిత్యానికి, విజ్ఞానశాస్త్రానికి నడుమ బలమైన విభజనేమీ కనిపించదు. ఈ రెండు పరస్పర పోషకాలే తప్ప విద్వేషకాలు కావు. మానవ నాగరికత పరిణామంలోను సాంస్కృతిక పురోభివృద్ధిలోను ఈ రెండు అన్యోన్యాశ్రితాలు. మేధావులంతా సాహిత్యం, విజ్ఞానశాస్త్రాల సమైక్యం వైపే మొగ్గు చూపారు.

సమాజంలో జరిగే వైజ్ఞానికాభివృద్ధి సాహితీస్ఫూర్తిని కలిగిస్తుంది. సాహిత్యానికి, వైజ్ఞానికశాస్త్రానికి గల మూల పదార్థం ఊహాశక్తి. కవి అసంభవాలను సైతం సంభవాలుగా ఊహించి సాహిత్యంలో చూపించగలడు. ఉర్దూ కవిత్వంలోని గజల్ని పరిశీలిస్తే ఒక నిర్మాణ సౌందర్యం స్పష్టమవుతుంది. దీని రెండు పాదాలు గణిత శాస్త్ర పరిధికి పరిపూర్ణంగా లోబడి ఉంటాయి. సమాన వేగాన్ని, ఉచ్ఛారణలో సమాన కాలాన్ని సంతరించుకొని మాత్రాబద్ధ సమతుల్యతను పాటిస్తాయి. బాహ్య వికాస స్వరూపంగా ఆవిష్కృతమైన ఈ కవితాకళ అంతరంగిక పటిష్ఠతను చేకూర్చుకునేందుకు గణితశాస్త్రం సహకరించింది.

వైజ్ఞానికాభినివేశానికి, సాహితీ కృషికి మానసిక స్థాయిలో సామ్యత ఉన్నది.

కాని వీటి మధ్య పరస్పర ప్రభావం కన్పిస్తుంది. కవి యొక్క ఆలోచన విధానాలలోను, కల్పనా విశేషాలలోను వైజ్ఞానిక శాస్త్ర ప్రభావాన్ని ఈనాడు మనం గమనించవచ్చు. అధునాతన శాస్త్రీయ ప్రభావం సాహిత్యంలో నవ్యరీతులకు ప్రేరణ కలిగిస్తున్నది. ఒక విషయాన్ని వివిధ కోణాల నుండి సమగ్రంగా పరిశీలించడం లోను, సూటిగా భావాన్ని వ్యక్తం చేయడానికి సరిగ్గా సరిపోయే మాటలను ప్రయోగించడం లోను వైజ్ఞానిక పద్ధతి నేడు కన్పిస్తుంది.

ఒకానొక కాలంలో విజ్ఞాన శాస్త్రంలో వచ్చే మార్పులు, అభివృద్ధి ఆ కాలంలో వెలువడిన సాహిత్యంలో ఆవిష్కృతమవుతాయి. సాహిత్యంలో ప్రథమ కవిత్వంగా పిలువబడే జానపద సాహిత్యంలో ఆయా కాలాలలోని వైజ్ఞానిక విషయాలకు చిహ్నాలు అయిన నూతి గిలక, పొగ ఓడ, రోడ్డు రోలరు, వంతెన మొదలైనవి చోటు చేసుకున్నాయి. ధూమం, జ్యోతి, సలిలం, మరుత్తుల సమ్మేళనమే మేఘమని మహాకవి కాళిదాసు ఆనాటి శాస్త్ర ప్రమాణంతో చమత్కారంగా చిత్రించాడు. ఈనాడు చంద్రుని గూర్చి జరిపిన పరిశోధనల దృష్ట్యా చంద్రమండలంలో వాతావరణం, భౌతిక పరిస్థితులు ఎలా ఉన్నా, చంద్రుడు మనిషి మనస్సుకి కలిగించే అనుభూతి కవిత్వానికి ప్రధానంగా వుంటుంది.

శాస్త్రవేత్తల పరిశోధనలు స్వార్థపూరితమైన వినాశన మార్గాలలో పయనించకుండా సన్మార్గంలో పురోగమించ డానికి సాహిత్యం సహాయ పడుతుంది. సాహిత్యం శాస్త్ర విజ్ఞానానికి దిశానిర్దేశం చేయడమే గాకుండా సూచనలు, గమ్యాలు, భవిష్యత్ప్రణాళికలను అందిస్తుంది. వైజ్ఞానికాభివృద్ధి బహుళంగా ఉన్న కాలంలోనైనా సాహిత్యం మరుగునపడే ప్రశ్నే లేదు. పరిశోధనలతో అలసిన శాస్త్రలోకానికి సాహిత్యం ప్రశాంతతని, ఆనందాన్ని, ఉత్సాహాన్ని చేకూర్చగలదు. సాహిత్యాన్ని రూపకల్పన చేసి దృశ్యంగా చూపించడానికి, నాటకరంగ నిర్మాణంలో, సంగీత సాధనాలలో వైజ్ఞానికాభివృద్ధి ఎంతో తోడ్పడుతుంది. విజ్ఞానశాస్త్రం, సాహిత్యం వైరం లేనివి. ఒకదానిని బట్టి మరొకటి కాలానికి అనుగుణంగా మార్పులు చెందవచ్చు. ఈ రెండింటి సమ్మేళనం విశ్వశ్రేయోదాయకం.

ఆధునిక వచన రచయితల వచనం దేదీప్యమానంగా వెలుగొందటానికి విజ్ఞాన శాస్త్రం అందించిన వెలుతురే కారణమని చెప్పవచ్చు. విజ్ఞానశాస్త్రం సృష్టించే డ్రామాను పలువురు పలు విధాలుగా వాడుతున్నారు. రచయితల రచనాశైలిలో తేడాలుండవచ్చు. కొందరిది సామాజిక విశ్లేషణ అయితే మరి కొందరిదీ మనోవిశ్లేషణ కావచ్చు. అయితే ఈ రెండింటికి ఊతమిచ్చింది మాత్రం విజ్ఞానశాస్త్రమే. విజ్ఞానశాస్త్రాన్ని ముడి పదార్థంగా ఉపయోగించి రాయబడే మరో రకం రచనలు ఉన్నాయి. అవి డిటెక్టివ్ సాహిత్యం, విజ్ఞానశాస్త్ర ఆధారమైన సరదా రచనలు, విజ్ఞానశాస్త్ర కాల్పనిక రచనలు.

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో అపరాధ పరిశోధన రచనలు చేయడం తెలుగు రచయితలు అలవర్చుకున్నారు. రచయితలకు అపరాధ పరిశోధన గూర్చి అవగాహన లేకపోయినా విజ్ఞానశాస్త్రం అందించిన తుపాకి, రేడియో, వేలిముద్రల విశ్లేషణ వంటి శాస్త్ర విశేషాలను, హత్యలకు దోపిడీలకు అన్వయించి ఉత్కంఠతను రేకెత్తిస్తూ రాసే రచనలివి. రెండవ దశలో అపరాధ పరిశోధనతో కూడిన రచనలు వెనకడుగు వేసి, సాంకేతిక నాగరికత ఆధారంగా వివిధ రంగాలలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పులను అందంగా, ఆకర్షణీయంగా చిత్రిస్తూ కొన్ని నవలలు వెలుగుచూసాయి. తెలుగులో యండమూరి వీరేంద్రనాథ్, సూర్యదేవర రామ్మోహనరావు, మైనంపాటి భాస్కర్, యద్దనపూడి సులోచనారాణి, సోంబాబు రచనలు ఈ కోవకు చెందినవి. ఈ రచనలన్నింటికీ కేంద్ర బిందువు సాంకేతిక నాగరికతే. మూడవ దశలో విజ్ఞానశాస్త్ర విశేషాలను ఆధారంగా చేసుకొని కథలు, నవలలు రావడం మొదలు పెట్టాయి. విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన అంశాలకు కల్పనను జోడించి విజ్ఞానశాస్త్ర కాల్పనిక రచనలు వెలువడ్డాయి. వివిధ రకాలైన ఆలోచనలతో సిద్ధాంతపరంగా వెలువడే విజ్ఞానశాస్త్ర కాల్పనిక రచనలు అటు రచయితలకు, ఇటు శాస్త్రవేత్తలకు అనుసంధానాన్ని ఏర్పరుస్తాయి.

ఈ విధంగా సాహిత్యం, విజ్ఞాన శాస్త్రాల సమన్వయంతోనే మానవ కల్యాణం సాధ్యమవుతుందని చెప్పవచ్చు. కాబట్టి సాహిత్యం, విజ్ఞానశాస్త్రం పరస్పర సహాయాన్ని ఇచ్చి పుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిద్దాం.

---




**పి. అనంతరావు**

కర్మాగారాల గొట్టాల్లోంచి
పొగలు కోరలు సాచి
మానవ సమూహాన్ని వేటాడుతున్నాయి
విష ప్రయోగం కోసం వెంటాడుతున్నాయి
ఉన్మాదంగా సెగలు చిమ్ముతూ
ఉధృతంగా ఎగసిపడుతున్న
ఫ్యాక్టరీ వ్యర్థ జలాలు విష ప్రవాహాలే
పంటల సారం విషానికే ఆహారం

దూసుకుపోతున్న వాహనాల రొదలో
ప్రాణవాయువు అందిస్తూ ధూళి
మింగుతూ
కృంగి పోతున్న ప్రకృతి

సగం కాలిన శవాలను మోస్తూ
కలుషితమై పోతున్న జీవన గంగ
విషవాయువుల స్వైర విహారంలో
గోళం కాలుష్యాన్ని మొయ్యలేక మోస్తుంది
ఇప్పుడు మరో గోళం కోసం
అన్వేషణ
నివాస యోగ్యం చేద్దామనో
కాలుష్యానికి మరో చిరునామా చెయ్యాలనో

పరిశీలన

# తెలుగు కథానిక - ఎయిడ్స్ అవగాహన



**సామాజిక రుగ్మతలను రూపుమాపటంలో దురాచారాలను నిర్మూలించడంలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ఆత్మీయ హస్తాన్నందివ్వటంలో వివిధ సామాజిక సమస్యల పట్ల జనాన్ని జాగృతం చేయటంలో సాహిత్యం అనాదిగా తన వంతు పాత్రను పోషిస్తుంది. మూడు దశాబ్దాలుగా చాప కింద నీరులా సమాజంలో ఉధృతంగా విస్తరించిపోతున్న ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించటంలో రచయితల స్పందన ఆశాజనకంగా లేదు.**

**ఆచార్య మూలె విజయలక్ష్మి**

ఒకప్పుడు ప్లేగు, కలరా, క్షయ, నేడు ఎయిడ్స్. నయమయ్యే మందులు లేని వ్యాధి. చెడు తిరుగుళ్లకు అలవాటు పడిన వారినే కాకుండా అభం శుభం తెలీని పసిపిల్లలను, అన్నెం పున్నెం తెలీని ఆడవాళ్ళను బలిగొంటున్న మహమ్మారి సోకిందంటే ఆరోగ్యం నానాటికి తీసికట్టు. ఆయువుకు అర్థాంతరంగా ముగింపు. నివారణే మంత్రం. చిత్తశుద్ధి లేని నివారణ నియంత్రణ ప్రచార కార్యక్రమాలు, నానాటికి పెరిగిపోతున్న హెచ్ఐవి బాధితుల సంఖ్య విచారకరం. ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవి సోకిన వారిలో 10 శాతం మంది భారతీయులే. వీరిలో 15-45 ఏళ్ళ వయస్సులో ఉన్న వారే అధికం. 51 లక్షల మంది హెచ్ఐవి / ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులున్నట్లు అంచనా. భారత ప్రభుత్వం 2002లో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసింది.

వ్యాధి సోకిన వారిలో వైరస్ రక్తం, వీర్యం, తల్లిపాలు, యోని స్రావాల్లో ఉంటుంది. ఈ వైరస్ ఒకరి నుండి మరొకరికి సంక్రమించడానికి ప్రధాన మార్గాలు, అసురక్షిత లైంగిక సంబంధాలు, రక్తం మార్పిడి, గర్భంతో ఉన్నప్పుడైనా - ప్రసవానంతరమైనా - తల్లినుండి బిడ్డకు, హెచ్ఐవితో కలుషితమైన సిరంజిలు, సూదులు, ఆపరేషన్లకుపయోగించే పరికరాలు.

అంతేగాని, దోమకాటు వల్ల, కలసి భోంచేయడం, వారి పక్కన కూర్చోవడం, కరచాలనం, వారి వస్తువులను వాడడం వల్ల గాని వ్యాపించదు.

హెచ్ఐవి సోకిన వ్యక్తి ఎయిడ్స్ దశ చేరుకోవడానికి 5-10 సంవత్సరాలు పడ్తుంది. వైరస్ సోకిన తొలి దశలో రోగ లక్షణాలు కన్పించవు. వైరస్ శాతం కూడా అధికం. ఈ దశలో అసురక్షిత లైంగిక సంబంధాలు అతి ప్రమాదకరం.

విచ్చలవిడి లైంగిక సంబంధాలు కలిగిన వారిలో దాదాపు 90 శాతం హెచ్ఐవి బారిన పడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేలో వెల్లడైంది.

హెచ్ఐవి ముప్పు వాటిల్లే అవకాశమున్న వర్గాలలో ప్రధానంగా సెక్స్ వర్కర్లు, కాల్‌గర్ల్స్, మత, కుల సంప్రదాయాల పేరుతో మాతమ్మ, బసివినిలుగా మార్చబడుతున్న అమ్మాయిలు, నపుంసకులు, స్వలింగ సంపర్కులు, మారక ద్రవ్యాలకు అలవాటు పడిన వారున్నారు.

సురక్షిత, సక్రమ లైంగిక సంబంధాల గూర్చి, రక్తమార్పిడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గూర్చి నానాటికి ప్రబలుతున్న ఎయిడ్స్ పట్ల అవగాహన, నివారణ, నియంత్రణ గూర్చిన ప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంది.

సామాజిక రుగ్మతలను రూపుమాపటంలో దురాచారాలను నిర్మూలించడంలో, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి నపుడు ఆత్మీయ హస్తాన్నందివ్వటంలో వివిధ సామాజిక సమస్యల పట్ల జనాన్ని జాగృతం చేయటంలో సాహిత్యం అనాదిగా తన వంతు పాత్రను పోషిస్తుంది. మూడు దశాబ్దాలుగా చాప కింద నీరులా సమాజంలో ఉధృతంగా విస్తరించిపోతున్న ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించటంలో రచయితల స్పందన ఆశాజనకంగా లేదు. కథా సాహిత్యాన్ని గాలిస్తే నా దృష్టికి వచ్చిన కథలు-

పేదరికం పై చీదరింపు, ఆధునిక సౌకర్యాలపై వ్యామోహం, అలంకారంపై మోజు, సంపాదన కోసం అడ్డదారులు తొక్కిస్తుంది. అడుసులో దింపటానికి సిద్ధమయ్యే అయ్యలు, తెలిసీ తెలియక అడ్డదారి తొక్కబోయే గిరిజన యువతులకు కనువిప్పు కలిగించిన కథ రుక్మిణి చావు సావు (2002). .

సామ్లీ అయిదారేండ్ల కిందట బొంబాయి రెడ్‌లైట్ ఏరియా చేరి అంతోయింతో కూడేసుకుందని, ఆమె వెంట పయనమయ్యారు ఆరుగురు లంబాడీ పడుచులు. అది పసిగట్టి కాన్‌స్టేబుల్ సత్తి సామ్లీ తో తర్కించి విఫలమయ్యాడు ఈ తతంగాన్ని చూస్తున్న సత్తి పరిచయస్థునికి పిల్లల తండ్రులు చెప్పిన ఆర్థిక రహస్యం.

"బిల్డింగు మేస్త్రీల కాడ పనికిపోతే పోకిరోళ్ళు...మేస్త్రీల దగ్గరా... అపుడపుడు పండుకోక తప్పదాయె... వాడు లేచి అయిదో పదో చేతులపెడ్తే పెడ్తడు. లేదంటే రేపు గ్యారంటి కూలంటదు- అయితే మరి మా సామ్లి చెప్పిందే బాగుంది గదా..."తో దిమ్మ తిరిగిపోయింది. ఇక పైసాయే పరమాత్మ అని నమ్మే సామ్లీ తో గాని, అమ్మాయిల అయ్యలతోగాని తర్కించి ప్రయోజనం లేదని తెలిపోయింది..దొంగ దెబ్బ తీసే హెచ్ఐవి గూర్చి "రోగం... అది గాని వచ్చిందా... సావే గతి! మరింక మందులేదు... అసలది తగిల్నట్టు...జబ్బు సోకినట్టు కూడా మనకు తెల్వనే తెలవదు... దర్జగానే వుంటం... ఇంగ అది లోలోపల తొలుసుడు షురూ చేస్తది... అదెందు కొస్తది... అదెల పన్లేక ఉత్తగనే

పేరంటానికి రాదు.. రైలు, బస్సు టికటు కొనుకుని రాదు... ఉత్తంగనే ... ఎవనితోని బడితె వానితోని కలిసినా మంటే ఖతం" అనీ ఇంకా కుటుంబంలో, సమాజంలో వివక్షను విప్పి చెప్పినా..

"అబ్బా.. అసలు సావునెవడాపు తాడు సారూ... అదెట్లనైన ఎందులకెళ్ళినా దూరుకుంట వస్తది!" అన్న సామ్లీ మాటలు మూర్ఖత్వానికి పరాకాష్ఠ. డాక్టరై కూడా అల్లరి చిల్లర తిరుగుళ్ల ఫలితంగానే చావుకు దగ్గరయ్యాననే నిజం వెల్లడించి ఆడపిల్లలకు అడలు పుట్టించాడు.

విచ్చలవిడి లైంగిక సంబంధాల కారణంగా హెచ్ఐవి సంక్రమించవచ్చుని, తెలిసీ రొంపిలో పడడం రోగాన్ని కొని తెచ్చుకోవడమే కాకుండా, జనాలకు చావును పంచి పెట్టడం ధర్మం కాదని విప్పి చెప్పిన కథ ఇది.

భర్త చేసే తప్పుల ఫలితంగా అమాయకంగా, అ కారణంగా వ్యాధి బారిన పడిన స్త్రీ దైన్యగాథ నల్లూరి రుక్మిణి "తనది గాని తప్పుకు" (2004)

లక్ష్మణరావు పోస్ట్‌మెన్ . అతనికి ఇద్దరు కొడుకులు, కూతురు సుధ. ఆడపిల్లను కోరి వచ్చిన సంబంధమని, చదువు లేకపోయినా ఆస్తి ఉందని, పిల్లాడు మంచివాడనీ అందరూ చెప్పడంతో అమ్మాయిని శంకరానికిచ్చాడు. కోటి ఆశలతో అత్తింట్లో అడుగుపెట్టిన సుధకు ఆటుపోట్లు తప్పలేదు. అయినా సర్దుకుపోవడానికి యత్నించింది. భర్త ప్రవర్తనే కొరుకుడు పడలేదు. తాగుడు అలవాటుందని తెలిసింది. అత్త మందలించక పోగా వత్తాసు పలికింది. సతమతమవుతుండగా నెలతప్పడం, కాన్పుకు పుట్టింటికెళ్ళడం జరిగింది. తిరిగి వచ్చిన సుధ భర్తలో కన్పించిన మార్పుకు ఆరాతీసింది. భర్తకు మరో స్త్రీతో సంబంధం ఏర్పడిందని తెలిసింది, తట్టుకోలేకపోయింది. గొడవ పడింది. బిడ్డతో పుట్టిల్లు చేరింది. తల్లిదండ్రులు సర్ది చెప్పినా ససేమిరా వెళ్ళనంది. నాలుగేళ్ళలో జీవిత సత్యాలు తెలుసుకొంది. భర్త కబురంపగానే వెళ్ళింది. భర్త చేరదీసినామె చనిపోయింది. తన మంచికేనని, భర్త మారాడని సంతోషించింది. రెండోసారి నెల తప్పినప్పుడు పరీక్షలో బయటపడింది, పిడుగులాంటి విషయం. రోగం గూర్చి తెలీసీ భర్త మోసం చేసాడని కుంగిపోయింది.

పుట్టుకతోనే బిడ్డకు జబ్బు పంచి పెట్టలేక, పుట్టకుండానే చిదిమే హక్కు తనకు లేదని అందరికీ గుణపాఠంగా మిగలాలని ఆత్మహత్యకు పాల్పడింది.

"కానీ చెదిరిన కుటుంబం... నయం కాని రోగం ... దానికి తోడు ఇప్పుడీ సగం కాలిన వికృతత్వంతో జీవించాలా! జారిపోవాలా? ఏమౌతుంది". ఇది ఆమె సంఘర్షణ.

హెచ్ఐవి ప్రస్తావన లేకపోయినా, చెడు తిరుగుళ్లు, విచ్చలవిడి లైంగిక సంబంధాలు, సమాజంలో నిరాదరణకు గురి చేస్తాయని, ప్రాణాంతక రోగాలు తెచ్చి పెడ్తాయని హెచ్చరించిన కథ గూడూరి సీతారాంగారి "రాజమ్మ రాజీరికం" (2004)

రాజమ్మ పేదింటి ఆడపడుచు. ఆరేడేండ్లకే "చాలా పొద్దున్నే తీసిపోయి సాకల్ది తిరిగే యాల్లకు ఇంటి కొచ్చే యవుసాయం జేసుకునేటోని"తో పెళ్లైంది.

రాజమ్మకు సినిమాలపై, పౌడర్లు, స్నోలపై మోజు. అయ్యనడిగి నెలకో రెన్నెల్లకో సినిమాలు చూసి, మంచె మీద పాటలు పాడబట్టింది. రాజమ్మ రాగాలు దొరగారి కొడుకు చెవులబడ్డాయి. మచ్చిక చేసుకున్నాడు. అతడు తెచ్చి ఇచ్చిన వస్తువులతో సోకులు నేర్చుకుంది. అడ్డదారులు తొక్కింది. అత్తింటోళ్లు వచ్చినా వెళ్లనని మొండికేసింది. భర్తకు మారు మనువయింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుంది రాజమ్మ పరిస్థితి. భర్త దగ్గరకు వెళ్ళే పరిస్థితులు లేవు. ఊర్లో సూటిపోటి మాటలు. చిన్న చూపు. చీటికి మాటికీ తండ్రి బాదుడు ఫలితంగా ఊరిడిచింది.

"గప్పుడు మాయమైన రాజమ్మ యియ్యాల కనవడ్డది. పాపం ఎట్లయింది? గదే రాజమ్మని తొల్ల ఎవలూ నమ్మలె సానా పాడైంది. ఏదో బీమారొచ్చి సచ్చేదే బతికిందట. ఏందో రోగం తగిలి మనిషి పూర్తిగ తెల్లయింది. ఇగగిప్పుడు దినాము పొట్టపోసుకోను సిప్పవట్టుక తిరుగుతుంది."

ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులను మానవతా దృక్పథంతో చూడడం. నివారణ, నియంత్రణ గూర్చి ప్రచారం చేయడం, ఎయిడ్స్ రోగుల పట్ల సమాజంలో చిన్న చూపు పోగొట్టడం వంటి సదాశయాలతో రూపుదిద్దుకున్నది 'ఆశ' కార్యక్రమం.

ఆశ కార్యక్రమ ప్రచారంలో భాగంగా ప్రత్యక్ష కథనం కోసం తమతో తీసుకెళ్ళిన ఎయిడ్స్ రోగి ఆనంద్‌పట్ల కార్యకర్తలు ప్రవర్తించిన తీరు, ఆ వ్యక్తిని ఎంత మానసిక క్షోభకు, ఒంటరితనానికి గురి చేసిందీ, ఆచరణ శూన్యమైన కార్యకర్తల, ఉద్యోగుల వికృత స్వరూపాన్ని, సమాజధోరణిని ఎండగట్టిన కథ సన్నపు రెడ్డి వెంకట్రామిరెడ్డి 'ఆశ' (2005)

'ఆశ' ఆశయాల ప్రచారం కోసం ప్రజలను జాగృతం చేయడానికి వెళ్ళి, ఎయిడ్స్ రోగి పక్కన కూర్చొని వచ్చిన భర్తకు, దాయాదులు చనిపోతే అంటుబాపు కోవడానికి వెళ్ళి వచ్చినపుడు చేసే సంప్రదాయాలు అంటే వేడి వేడి నీళ్ళతో స్నానం, వేసుకొని వచ్చిన బట్టలు ఇంట్లోకి తీసుకురానీయకపోవడం వంటివి చేసింది అతని భార్య.

హోటల్‌లో అందరితో పాటు కూర్చొని భోం చేసాడని "వొచ్చినోడు ఏదొక మూలన కూకొని తినిపోయింటే ఎవరికీ తెలవకుండు, అందరి నడుమున దర్జాగా కూకుండె...బానలో చెంబు ముంచె. ఆయప్ప ఎయిడ్స్ రోగి అని అందరికీ తెలిసిపాయె. నా హోటలుకు మనుసులెట్లా వస్తారు సారూ?" అని ఎగిరిపడింది రంగమ్మ. అంతేగాక "బాన వొక్కల గొట్టినా, పెంకులు గూడా దూరంగా పారేసి వొచ్చినా ఆయప్ప ఎంగిలిజేసింది ఏ చెంబో, ఏ లోటానో తెల్వకపాయె. అన్నీ పారేసుకోలేక డబరాలో వేసి నీళ్ళు బోసి మసల గాంచినా... అని చెప్పింది.

ఆఫీసులో నీళ్లు తాగాడని గ్లాసు గోడవతల పారేసాడు. భోజనం, వసతి ఏర్పాట్లు వేర్పాటుగా చేసాడు ఆఫీసు అటెండర్.

కార్యక్రమాలకి పల్లెలకూ వెళ్ళేటపుడు జీపులో గాని, కార్యక్రమంలోగాని ఎయిడ్స్ రోగి తమ పక్కన కూచోకుండా జాగ్రత్తపడ్డారు. ఇదంతా భరించలేక వీరి ప్రవర్తన గూర్చి ఎం.ఆర్.ఓ.కు ఫిర్యాదు చేసాడు. ఆఫీసు వాళ్ళయినంత మాత్రాన మార్పొచ్చి మానుకోవడం పొరపాటనీ, అతనక్కడ పని చేస్తున్నట్లే అటెండెన్స్ వేసి డబ్బు

పంపిస్తామని, బరువు దించుకుంటాడు. ఆ తర్వాత రోజు ఎయిడ్స్ రోగి భయం లేదు కాబట్టి మరింత జోరుగా ఉపన్యాసాలు సాగాయి. ఇదీ ఆచరణ శూన్యమైన 'ఆశ' ఆశయాల ఆర్భాటం.

అప్రమేయంగా అకారణంగా ఎయిడ్స్ బారినపడిన కొడుకును అక్కున చేర్చుకొనడమే కాకుండా అలాంటి బాధితులకు, ఆశాదీపంగా నిలిచిన అమ్మ మనసుకు అద్దం పట్టిన కథ జాజుల గౌరి 'అమ్మ' (2004)

శేఖర్, సుందర్ అరుంధతి కొడుకులు. నెల రోజులుగా వస్తున్న జ్వరం గుర్చి డాక్టర్ దగ్గరకు వెళ్ళిన సుందర్‌కు హెచ్ఐవి అని తేలింది. చాటుగా విన్న సుందర్ ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. సమయానికి తమ్ముణ్ని కాపాడి తల్లీ కొడుకులు విషయం ఆరా తీసారు. తనకు ఎలాంటి చెడు తిరుగుళ్లు లేవని రక్తదానం చేసినపుడు స్టెరిలైజ్ చేయని సూదుల వల్ల వైరస్ వొంట్లోకి ప్రవేశించిందని తెల్పాడు.

అన్నా వదినల ఆదరణలో, వాళ్ళ ప్రోత్సాహంతో ఇంజనీరింగ్ పూర్తి చేసినా నానాటికీ క్షీణిస్తున్న ఆరోగ్య పరిస్థితికి లోలోన సంఘర్షణ పడ్డాడు. సంఘర్షణ ఫలితం 'ఆశా ఎయిడ్స్ కేర్ సెంటర్'లో చేరాలనే నిర్ణయం...అక్కడ తనలాగే విధివంచితులైన స్త్రీలు, పసిపిల్లలు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండటం చూసి తాను నిరాశా నిస్పృహలకు దూరమయ్యాడు. ఎయిడ్స్ వ్యాధి నిరోధక ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటూ జీవిత సార్ధకత ఎంచుకున్నాడు. ఇలాంటి పరిస్థితులలో ఉద్యోగరీత్యా బదిలీపై వెళ్తున్న పెద్దకొడుకుతో వెళ్ళకుండా చిన్న కొడుకు వాటాని ఆశా ఎయిడ్స్ కేర్ సెంటర్‌కి చెందేటట్లు వీలునామా రాయించి అమ్మ ప్రేమను అందరికీ పంచి అక్కున చేర్చుకోవడానికి అక్కడే చేరింది.

వ్యాధిగ్రస్తులు ఒంటరిగా కుమిలి పోకుండా కుటుంబం అండగా నిలవాలనే అకారణంగా బలి పశువులవుతున్న విధి వంచితులను ఆదుకోవాలనీ ఆదరణ చూపాలనీ ఆప్యాయత పంచి ఇవ్వాలనీ ఎయిడ్స్ రోగుల పట్ల సమాజం సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నదే 'అమ్మ' కథా సందేశం.

ఈ సాహిత్యంలో స్పృశించిన అంశాలు.

- H విచ్చలవిడి లైంగిక సంబంధాలు ప్రాణాంతక వ్యాధి ఎయిడ్స్ కారకం
- H హెచ్ఐవి సోకిన వ్యక్తులకుపయోగించిన సిరంజిలు హెచ్ఐవి వాహకాలు.
- H సొమ్ము కోసం ఒళ్ళమ్ముకోవడం తమకే కాక సమాజానికి అనర్ధదాయకం
- H తమది కాని తప్పుకు శిక్షకు గురవుతున్న అమాయక స్త్రీలు, బాలల దయనీయ పరిస్థితి.
- H హెచ్ఐవి బాధితులకు ఆపన్న హస్తా న్నందివ్వటానికి, సమాజ ధోరణిలో మార్పు తేవడానికి ఏర్పడిన 'ఆశ' సంస్థ లోని కార్యకర్తల చిత్తశుద్ధిలోపం. ఆచరణ శూన్యమైన ఉపన్యాసాలు డొల్లతనం, సమాజంలో రోగుల పట్ల చిన్న చూపు. రోగుల పట్ల అవగాహన రాహిత్యం.
- H హెచ్ఐవి / ఎయిడ్స్ రోగుల పట్ల కుటుంబం బాధ్యత, సంరక్షణ, మానవతా దృక్పథం, స్వచ్ఛంద సేవానిరతి.

హెచ్ఐవి / ఎయిడ్స్ నివారణ, నియంత్రణ ప్రచారం సమాజంలో వివక్ష, చిన్నచూపు పోగొట్టడానికి వ్యాధిగ్రస్తుల పట్ల మానవతా దృక్పథాన్ని పెంపొందించటానికి సాహిత్యం ద్వారా కృషి చేయాల్సిన అవసర మెంతైనా ఉంది.

# మాంసాల మాగాణి

## ఈతకోట సుబ్బారావు



మాంసమే యిక్కడ వ్యాపారం
నులివెచ్చని స్పర్శ వున్న వ్యాపారం
రంగు రంగుల మాంసం
నరాల్లో రక్తం ప్రవహిస్తున్న మాంసం
దేశ దేశాల్నించి దిగుమతైన సజీవ మాంసం
రెండు చెమట గుబ్బియల మాంసం
కులమతాల ముసుగుల్లేని
క్రయ విక్రయాల పట్టికలో
వయసే వెలకి పునాదియైన వ్యాపారం
రెండు క్షణాల కోసం మెదళ్ళో రాక్షసుణ్ణి
సంకెళ్ళు విప్పి పురికొల్పే వ్యాపారం
రెండు పూపిర్ల ఆడవాసన కోసం
మానవత్వం ముఖంమైన ముసుగేసి
పశుత్వాన్ని శాంతింపచేసే వ్యాపారం
మనిషిలో దాగిన కుక్క నక్క పాము ఎలుగూ
సమిష్టిగా వుద్రేకించే మార్కెట్టిది
రెండు కాళ్ళపై నడిచొచ్చె పశువుల
నరాల రహదారుల నిండా
నిరంకుశ కామాతురతని పురికొల్పే రుద్రశాల
బలవంతుడు బలహీన జాతిపై
పురివిప్పి కదం తొక్కే నిర్లజ్జ క్రీడ
ఇదొక రాక్షసవాద
సుఖాలు పంచే నాటకానికి తెరదించినప్పుడే
ఇక్కడ పాలు తాగే పిల్లలకి అమ్మ దొరుకుతుంది
కొంగుచాటు మమకారం ముడి విప్పుకుంటుంది
రెండు గుక్కల పాలు యేడ్పు గొంతు నొక్కుతుంది
ఎన్ని గాయాలైన ఎన్ని వ్రణాలైనా
ఇక్కడ సెలవులు బందలు సమ్మెలుండవు
ఇక్కడి మాంసానికి అమ్మకపు విలువే తప్ప
కొనుగోలు హక్కులుండవు
గ్యారంటీలు వారంటీలుండవు
వున్నదల్లా మాంస వినిమయ ఖరీదొక్కటే!

# విశ్వనాథ కథలు - సౌందర్యము



**కవి కథకుడైనపుడు ఆ కథలో భావుకత ఎక్కువగా కనిపిస్తుంది. ఊహలు, భావనలు, కల్పనలు చోటు చేసుకొంటాయి. వాస్తవికత కనిపించినా అది కళాత్మకంగానే ఉంటుంది. "రసప్రలుబ్ధ ధియః" అని కవులను గూర్చి అంటారు. ఈ ప్రలోభం సౌందర్య సంబంధమైనదే. రససిద్ధి వలన ఆనందం కలుగుతుంది. ఆ ఆనందమే సౌందర్యంగా భాసిస్తుంది. ఈ ప్రలోభం కొందరిలో ఉత్కటంగా ఉంటుంది. విశ్వనాథ అలాంటివాడు.**

**డాక్టర్ యు.ఎ. నరసింహమూర్తి**

అతడు ప్రధానంగా కవి అయినా వివిధ ఇతర సాహిత్య ప్రక్రియలలో రచనలు చేయడంతో పాటు కథలు కూడా రాశాడు. ఆయన కొన్ని కథలు కళాత్మకంగా ఉంటాయి. కళాతత్త్వ ప్రతిపాదకాలుగా ఉంటాయి. కవికి సౌందర్య ప్రలోభమెక్కువ అనే విషయాన్ని నిరూపిస్తూ విశ్వనాథ ఒక కథ రాశారు. ఆ కథ పేరు "య్యోఁ- హిషిఖెయ్". హిషిఖెయ్ ఒక సుకుమార కవి. నీగ్రోజాతికి చెందినవాడు. అతడు కాంగో బిడ్డ. వాగులోని చేపలా, అడవిలోని పిట్టలా స్వేచ్ఛను కోరేవాడు. కాంగో అప్పుడు పరాధీనంగా ఉండేది. ఆ బానిసత్వం నుంచి విముక్తిని పొంది స్వేచ్ఛను సాధించాలని ప్రజలను ప్రబోధిస్తూ అతడు మధురగీతాలు ఆలపించేవాడు. ఆ స్వేచ్ఛా గీతాలలో సౌందర్యం తొణికిసలాడేది. నీగ్రోలు నల్లగా ఉంటారు. వారి ముఖాలు వికారంగా ఉంటాయి. కానీ వారి గొంతులో మహా మాధుర్యము ఉంది. ఆ మాధుర్యం కారణంగా వారు పాటలు పాడేటప్పుడు "వారి శరీరములు నైల్యము, వారి మొగముల యందలి వికారము నున్నవా, లేవా యనిపించుచుండును'' అంటారు విశ్వనాథ. కళాత్మక సౌందర్యం అంటే ఇదే. ఇది భౌతిక సౌందర్యం కంటే ఎంతో భిన్నమైనది. పాశ్చాత్యులు దీనిని Sublime అన్నారు. విశ్వనాథ ఇటువంటి సౌందర్యం పట్ల సాధారణంగా ఆకర్షితులవుతారు. అంతేకాదు ఉదాత్త సౌందర్యం వెనుక దివ్యత్వం ఉంటుందని ఆయన విశ్వాసం. అందుకే ఇంతటి ఉదాత్త సౌందర్యాన్ని సృష్టించిన హిషిఖెయ్ అనే కవిని "హిషిఖెయ్ దేవుడు. కాంగోనది అవతారమెత్తిన మూర్తి" అని అభివర్ణించాడు.

సౌందర్యం ప్రధాన వస్తువుగా విశ్వనాథ 'డయాన్థస్' అనే కథను రాశారు. వృక్షశాస్త్ర పరిభాషను ఆధారంగా చేసుకొని ఈ కథ వాస్తవిక సౌందర్యాన్ని ఒక కాల్పనిక సౌందర్య భూమిగా పునఃస్సృష్టి చేసి కళాజగత్తులో నిలిపింది. తెలుగులో ఇటువంటి కథ ఇది ఒకటే అనిపిస్తుంది. ఇందులో ప్రకృతి సౌందర్యము, మానవీయ సౌందర్యము, దివ్య సౌందర్యము, సౌందర్యావధి, సౌందర్యారాధనము, సౌందర్యాభిమానము, సౌందర్య పరిణామము – పరిణతి, భౌతిక సౌందర్యము, మానసిక సౌందర్యము, సౌందర్య ప్రయోజనము వంటి అంశాలెన్నో కనిపిస్తాయి.

డయాన్థస్, ఇసోమియా, ఎమోరిలిస్, నెస్టూరియమ్, టెబిరోజ్, హెలియోట్రోప్, అర్సీనియా, సెమీనేరియా, నక్కారియా అనే పేర్లతో ఉన్న పువ్వులు మనకు కనిపిస్తాయి. డయాన్థస్ అనే పువ్వు రకరకాల రంగులలో ఉంటుంది. ఈ మొక్క వెడల్పైన గరికలా ఉంటుంది. ఇసోమియా పువ్వులు నీలి గెరిటెలలా ఉంటాయి. అవి నీటి ప్రబ్బలి పూలలాంటివి. ఎమోరిలిస్ దుంపజాతి మొక్క. ఈ మొక్క ఎర్రగా ఉంటుంది. దీనికి ఆకుపచ్చని ఆరు రేకులుంటాయి. ప్రతి రేకు మధ్య తెల్లని చార ఉంటుంది. నెస్టూరియమ్ మొక్క మొదలు నారింజరంగు, చివర నల్లదనము కలిగి ఉంటుంది. ఈ మొక్క బంగారు రంగు పూలు పూస్తుంది. దాని రేకులు తుమ్మెద రెక్కలలా ఉంటాయి. టెబిరోజ్ అనేది వొట్టి మొక్క. ఏటేటా అది తొందరగా పూస్తుంది. దాని పూలు ముద్దుగా ఉంటాయి. హెలియోట్రోప్ ఊదారంగు పువ్వు. పువ్వులో ఎఱ్ఱవాగు పసుపు రంగు కూడా ఉంటుంది. లోపలి దిమ్మలు పచ్చగా, సన్నగా ఉంటాయి. అర్సీనియా అనేది ఒక ప్రొద్దు పొడుపు పూల మొక్కే. దాని పువ్వు ఎప్పుడూ సూర్యుని వంకే తిరిగి ఉంటుంది. దీని పువ్వులు నారింజ రంగులో ఉంటాయి. లోపల ఎరుపు రంగు కూడా కనిపిస్తుంది. సెమీనేరియా నక్కారియా పూచే పువ్వులు లేత ఎరుపు రంగులో ఉంటాయి. ఆ పూల రేకుల మీద చిన్న చిన్న ఎర్రని చుక్కలు ఉంటాయి. ఇది ప్రకృతిలో సహజంగా కనిపించే సౌందర్యం. ఈ సౌందర్యాన్ని కళాత్మక సౌందర్యంగా తీర్చిదిద్దడానికి విశ్వనాథ ఒక స్వైర కల్పన చేశారు. అందుకోసం ఒక పురాణగాథను అల్లారు. ఈ పువ్వుల పేర్లన్నీ గ్రీకు భాషలో ఉన్న కారణంగా అది గ్రీకు పురాణగాథ అయింది.

డయాన్ థస్ గ్రీకు యువకుడు. గొప్ప అందగాడు. దేవతా స్త్రీలు అతనిని మోహించేవారు. తుమ్మెదలు అతని సౌకుమార్యాన్ని చూసి భ్రమించి అతని మీద వాలి తేనె లేకపోవడం వల్ల వెనక్కు మళ్ళేవి. లోకమంతా అతని సౌందర్య ప్రశంస వ్యాపించింది. అందమంటే ఏమిటో తెలిసిన వారు తనను తప్పకుండా ప్రేమిస్తారని అతడు నమ్మేవాడు. డయాన్థస్‌లాగే నార్సిపసు, ఎండిమియాలు సౌందర్యవంతులని ప్రశంసకెక్కారు. నార్సిపసు తన సౌందర్యాన్ని గుర్తించలేదని, చంద్రతేజోదేవత తనను వదలి ఎండిమియానును ప్రేమించిందని డయాన్థస్‌కు క్రమంగా వారిద్దరి మీద ఈర్ష్య పెరిగింది. ఆ రోజుల్లో దేవతలు నేలకు దిగేవారు. అతని సౌందర్యాన్ని ఎంత మెచ్చుకున్నా, దేవతా స్త్రీలు గానీ, మానవ స్త్రీలు గానీ అతనిని ప్రేమించలేదు. అతను గొప్ప

వేదనకు గురి అయ్యాడు. ఈర్ష్య కారణంగా లోకానికీ అతనికీ చెడిపోయింది. అతడు జనపదాలలో నిలువలేక అడవికి వెళ్ళాలనుకున్నాడు. దారిలో తనకు కనిపించి రక్షణ నిస్తానని చెప్పిన ఈర్ష్యాధిదేవతను వెంటబెట్టుకొని తిరిగి ఇంటికి వచ్చాడు. తాను ఈర్ష్యను ప్రేమించకపోయినా కీర్తి వంటి దేవతలు తనను ప్రేమించలేదన్న బాధతో ఈర్ష్యాదేవతతో సహవాసం చేశాడు. ఒక నిగూఢమైన దుఃఖము, అల్పమైన సుఖము కలగలసి అతని ముఖం వికృతంగా మారింది. అతని ముఖావయవములు క్రమక్రమంగా మార్పు చెందడాన్ని లోకం గుర్తించింది. ఈ ఈర్ష్యాదేవత సంపర్కంతో లోకంలో లేని అందమంతా అతని ముఖంలో చోటు చేసుకొన్నా ప్రజలు లోపల లోపల అతని అందాన్ని పొగిడేవారే కానీ పైకి వెల్లడి చేయలేదు. ఈర్ష్యా సంపర్కంతో డయాన్థస్‌లో దివ్యత్వం పెరిగి మానవత్వం నశించింది. తాను మానవత్వాన్ని కోల్పోయి ఒక భావంగా మారినందుకు కలతపడ్డ డయాన్థస్ ఈర్ష్యతో కలహించాడు. అప్పుడు ఈర్ష్య తన సంపర్కంతో డయాన్థస్ పంచేంద్రియాలు, మనస్సు మారినా ఆత్మ చెక్కుచెదరకుండా ప్రకాశించడాన్ని గమనించి అతణ్ణి విడిచిపెట్టిపోయింది. లోకం తనను తిరస్కరించిన మాట వాస్తవమే అయినా తనకు గల అద్భుత సౌందర్యంతో తాను లోకానికి ఏ విధంగానూ ఉపయోగపడలేదనే సత్యాన్ని గుర్తించి తన సృష్టి ప్రయోజనం లేకుండా పోయిందని భావించి, ఆ పశ్చాత్తాపంతో కొన్నాళ్ళకు ఒక సరస్తీరంలో ప్రాణాలు విడిచాడు. డయాన్థస్ శవాన్ని జంతువులు గానీ, పక్షులు గానీ, పురుగులు గానీ ముట్టలేదు. వేర్వేరుగా పడిన అతని శరీరము, మొండెము అలా భూమిలోనే కలిసిపోయాయి. ఆ అవయవాలే పూలమొక్కలై పుట్టాయి. ఇది డయాన్థస్ కథ.

మానుష దివ్య ప్రకృతులను చిత్ర విచిత్రములైన రీతులలో కలగలిపిన విశ్వనాథ ఈ కథలో డయాన్థస్‌లో మూడు సౌందర్య పరిణామ దశలను నిరూపించడంతో తన కల్పనా చాతుర్యాన్ని చూపించారు.

**మొదటి దశ :** వాని సౌందర్యము మిసమిసలాడెను.

— — — — — * * * — — — — —

**మానుష దివ్య ప్రకృతులను చిత్ర విచిత్రములైన రీతులలో కలగలిపిన విశ్వనాథ ఈ కథలో డయాన్థస్‌లో మూడు సౌందర్య పరిణామ దశలను నిరూపించడంతో తన కల్పనా చాతుర్యాన్ని చూపించారు.**

— — — — — * * * — — — — —

(1) అతని నాసిక తుద చక్కని సన్నని దిమ్మ కట్టి నాసారంధ్రములు కొంచెముగా నుబికి ముక్కు పొడుగై సొగసు లొలికెను. (2) చెవులు నిక్కి బంగరు ప్రమిదల వలెనయ్యెను. (3) వాని కన్నులు సూదులు పెట్టి పొడిచినట్లు చూడసాగెను. అతని కనుగ్రుడ్డులో నల్లపాప తుమ్మెదలకు బ్రేయో విషయమును వ్రాలబోవు వానికి నతని హస్త తాడన బాధాజనకమునునైనది. (4) అతని పెదవి లేత యెఱ్ఱ కాంతి విరజిమ్మి దిన దినము క్రొత్తదియా క్రొత్తదియా యనిపించుచుండెను. (5) అతని చుబుకము పొట్టిదై ముద్దగా నడుమున కొద్దిగాఁ జీలినట్లు వాని మొగమునకుఁ గ్రొత్త శోభ తెచ్చెడిది. (6) యౌవనాంకురముతో నతనికి మీసములు వచ్చెను. అతని యెఱ్ఱని మొగము మీద నల్లని మీసములు తుమ్మెద ఱెక్కల వలెఁ బ్రకాశించెను. (7) శరత్కాలపు నది వలె నతని మనస్సు కూడ స్వచ్ఛమై యీ స్వచ్ఛత యంతయు నతని పంచేంద్రియముల యందు వ్యాపించెను.

**రెండవ దశ :** ఈర్ష్యాధిదేవత మొగమతని మొగములోఁ గలసినపుడెల్ల నతని ముఖావయవములు మార్పుఁజెందెను.

(1) అతని ముక్కున గూడ రంగు వచ్చెను. ఆ ముక్కు చివర తేలి యది యెఱ్ఱవాగు పసుపుగా మారెను. చివర పచ్చని సన్నని దిమ్మవలె నయ్యెను. (2) అతని చెవులు తీగవలె నల్లుకొన్నవి. చివళ్ళు పెరిగి నీటి ప్రబ్బలి వలె నయ్యెను. (3) అతడు లోకము వంకఁ జూచుట మానివేసి నిత్యము సూర్య మండలము వంకనే చూడనారంభించెను. అతని కన్నులలోఁ దెల్లగ్రుడ్డు నారంజరంగుగా దిరిగెను. నల్లగ్రుడ్డు లెఱుపురంగు కలిపిన పసుపురంగు తిరిగెను. ఆ కన్నులంతకంతకు బెద్దవై ప్రొద్దు పొడుపు పూలవలెఁ గనిపించెను. (4) అతని పెదవి లేత యెఱుపు మానలేదు. కాని దాని మీద నెఱ్ఱని బొట్ల వలెఁ చిన్ని చిన్ని మచ్చలు కలిగెను. (5) అతని చుబుకము పచ్చరంగుగా మారెను. చివర ముద్దగా నున్న భాగము గట్టిపడి దిమ్మకట్టెను (6) వాని మీసములు నారింజరంగు ప్రబలించుకొనెను. చిట్టచివళ్ళు నల్లగానే యుండెను.

**మూడవ దశ :** దివ్యత్వము పెరిగిన కొలది యతనిలోని మానవత్వము క్షీణింపజొచ్చెను. ఆనాటి నుండి యతని మానసమొక విచిత్రస్థితిఁ బొందినది. ఆ మానసము నంటియున్న యైదింద్రియములు చిత్రముగా మారెను.

(1) నేత్రాలు పసుపు పచ్చదనము పొందినను నతని చూపులాకుపచ్చరంగుగా నుండెను. ఈర్ష్యాదేవత తన ముద్ర ఘటిల్లెనని సంతసించెను. (2) నాసిక యూదారంగుగా నున్నను జిట్టచివర నాకు పచ్చ దిమ్మ కట్టెను (3) చెవులు నీటిప్రబ్బలి వలె నీలపు రంగుగా మారినను నొకవిధమైన యాకుపచ్చని రంగు వాని యంతట నావరించి యుండెను. అతని నాలుక యాకుపచ్చని రంగు వాని యంతట నావరించి యుండెను. (4) అతని నాలుక యాకుపచ్చని రంగు పొందెను. (5) అతని శరీరమంతయు నాకు పచ్చని రంగు తిరెగెను.

ఈ మూడు దశలలోను మొదట దశలో సౌందర్యం ఒక ప్రకృతిగా కనిపిస్తుంది. ఇవి డయాన్థస్ పాంచభౌతిక ప్రకృతిని ఆశ్రయించినది. ఆ దశలో డయాన్థస్‌కు సౌందర్యాభిమానం ప్రబలంగా ఉంది. అందరూ తనని ఆరాధించాలని ఆశపడేవాడు. తన సౌందర్యం ముందు నార్సిపసు, ఎండిమియాను వంటి వారి సౌందర్యం ఎందుకు కొరగానిదని భావించేవాడు. లోకులు, దేవతలు కూడా తమకు గల సౌందర్యాభిరుచి కారణంగా డయాన్థస్ సౌందర్యాన్ని గౌరవించినా ఆదరించలేకపోయేవారు. రెండవ దశలో సౌందర్యం ఒక భావంగా మారింది. ఇందుకు ఈర్ష్యా సంకలితమైన డయాన్థస్ మనసు దేవతా సంపర్కాన్ని పొందడం ఒక హేతువుగా కనిపిస్తుంది. ఆ భావ ప్రాబల్యంతో సౌందర్య స్వరూపంలో మార్పు కలిగింది. మూడవ దశలో సౌందర్యం దివ్యత్వంగా మారింది. దివ్యత్వం వాంఛనీయమైనదే గానీ అందులో మానవత్వం లోపించినపుడు అది ప్రయోజనకారి కాదు. డయాన్థస్ మనసును

కోల్పోయినా సౌందర్య నిధానమైన తన ఆత్మను కోల్పోని కారణం చేత ఇంకొక పరిణామ దశకు చేరుకొన్నాడు. మొదట దశలో తనను ఆదరించని లోకాన్ని చూసి వ్యథ చెందాడు. రెండవ దశలో ఆ లోకం మీద కక్ష సాధించాలనుకున్నాడు. మూడవ దశ ముగిసేటప్పటికి తాను కోల్పోయినదేమిటో తెలుసు కోగలిగాడు. నాల్గవ దశలో సౌందర్య మెప్పుడూ భూమికి అలంకారంగా ఉండాలనీ, తన సౌందర్యం లోకానికి మేలు చేసేదిగా ఉండాలనీ తెలుసుకున్నాడు. లోకం తనను ద్వేషించినా తాను లోకాన్ని ప్రేమించాలని, ఆనందం కలిగించాలనే సత్యాన్ని గ్రహించాడు. ఇది సౌందర్య ప్రయోజనం. ఇది రసస్థితి. ఇది సౌందర్యానికి ఆత్మ. ఆ ఆత్మను కోల్పోని కారణం చేత డయాన్థస్ తన మరణానంతరం రంగు రంగుల పూల మొక్కలుగా మారి లోకానికి శాశ్వతమైన ఆనందాన్ని అందిస్తూ సౌందర్య ప్రయోజనాన్ని నిరూపించాడు.

కథారంభంలో సౌందర్యానికి ఒక అవధి కనిపిస్తుంది. అభిరుచి భేదం కనిపిస్తుంది. ఇది పాంచభౌతిక ప్రకృతికి సంబంధించిన ధర్మం. తరువాతి పరిణామ దశలలో సౌందర్యం భావంగా ఏర్పడి ఒక అపరిచిత స్థితికి చేరుకొంది. అపరిచిత స్థితి ఆస్వాదయోగ్యమైనది కాదు. మానవుడు పరిచితపూర్వమైన స్థితి నుండి అపరిచిత స్థితికి చేరుకొన్నపుడు మాత్రమే దానిని ఆస్వాదించ గలడు. మానవీయ భూమికను ఆశ్రయించిన దివ్యత్వం మాత్రమే ఆస్వాదనీయమైన రసానందజనకం కాగలదు. కథాంతానికి సౌందర్యం ఈ స్థితికి చేరుకొని సార్వజనీనము, సార్వకాలికము అయిన ఆనందాన్నిచ్చేదిగా ఒక పరిణతిని సాధించింది. పువ్వులు అందరికీ అందంగానే కనిపిస్తాయి. ఎప్పుడు అందంగానే కనిపిస్తాయి. ఆనందాన్నిస్తూనే ఉంటాయి. ఇది సౌందర్య ప్రయోజనం. దీనిని నిరూపించ డానికే విశ్వనాథ ఈ కథ రాశారు.

పరిపూర్తి అనే కథ సౌందర్యాభి రుచికి సంబంధించినది. సౌందర్యము భౌతికమా? మానసికమా? అనే సమస్యను పురస్కరించుకొని రాసిన కథ ఇది. దృశ్యమానము, ఊహ్యమానము అయిన స్థితి కంటే భిన్నమైన స్థితి సౌందర్యానికి ఉన్నదా? అనే అంశం కూడా ఈ కథలో కనిపిస్తుంది. చదువు సంధ్యలు, సిరి సంపదలు, రూప యౌవనాలు, సభ్యత – సంస్కారాలు కలిగిన

— — — — — * * * — — — —

**పరిపూర్తి అనే కథ సౌందర్యాభి రుచికి సంబంధించినది. సౌందర్యము భౌతికమా? మానసికమా? అనే సమస్యను పురస్కరించుకొని రాసిన కథ ఇది. దృశ్యమానము, ఊహ్యమానము అయిన స్థితి కంటే భిన్నమైన స్థితి సౌందర్యానికి ఉన్నదా? అనే అంశం కూడా ఈ కథలో కనిపిస్తుంది.**

— — — — — * * * — — — —

చంద్రశేఖరుడనే యువకుడు భౌతిక సౌందర్యంతో పాటు దృష్టి కూడా లోపించిన రాధ అనే పేద బాలిక దయనీయ స్థితిని చూసి మనఃపూర్వకంగా ఇష్టపడి పెళ్ళాడతాడు. ఊళ్ళో వాళ్ళు, ఇంట్లో వాళ్ళు కూడా అసహ్యించుకొనే తనవంటి చూపులేని వికార స్వరూపాన్ని చంద్రశేఖరుడెలా పెండ్లాడాడా? అని రాధ సందేహిస్తుంది. అందరూ తనను వికార స్వరూపిణిగా ఎంచగా తన భర్త తనను అందమైన దానిగా చెప్పడంతో ఆమెలో ఒక సౌందర్య మీమాంస మొదలైంది. "సౌందర్య మెట్లుండును? సౌందర్యము కాని దెట్లుండును! నేను నలుపేమో, యెఱుపేమో, తెలుపేమో యెఱుగను. అని తెలుసుకొనుటకు కన్నులుండవలెనట... కన్నులు లేకపోవుటయే యందము లేకపోవుట?

అయిన నా కందము లేదన్న మాటయే. నా పతి యందకత్తెవే నీవన్నారు గద! కనుక లేకపోయినను నందముగా నుండవచ్చును. కన్నులు లేకపోయిన నందమునకు లోపము కలుగవచ్చును. నల్లగా నున్న నందముగా నుండరేమో! నేను నల్లని దానననని యందురందరు. నాభర్త నేనందకత్తెనన్నాడు. ఇది యెట్లు? కనుక నల్లదనమ్మును, నేత్రహీనత్వమును గలిగిన యందముగా లేదనరాదు. నేనందకత్తెనైయే యందును."

రంగు, రుచి, వాసన, మాధుర్యం, మృదుత్వం అనే పంచేంద్రియ ధర్మాలు సాధారణంగా సౌందర్య కారకాలుగాను, సౌందర్య పోషకాలుగాను, సౌందర్య ప్రేరకాలుగాను, సౌందర్యగ్రాహకాలుగాను కనిపిస్తాయి. ఇందులో రాధకు అందరూ మెచ్చే రంగు లేదు. అసలు ఏ రంగూ కనబడదు. పేదరికము, నిరాదరణ కారణంగా మిగిలిన సౌందర్య ధర్మాలు ఉన్నా లేకపోయినా ఉన్నట్లే అయింది. అందువల్ల రాధలో సౌందర్య మీమాంస మొదలైంది. ఈ మీమాంస కారణంగా చివరకు సౌందర్యం భౌతికం కాదని, చంచలమైన మనసులోంచి పుట్టే ఊహకాదని, ఆ రెండింటికి అతీతమైన ఒక స్థితి అని విశ్వనాథ చెప్పినట్లు అయింది.

"ఎఱ్ఱవారి కన్న నల్లని వారే యెక్కువ యందముగా నుందురు. కృష్ణమూర్తి నల్లనివాడు. ఆయన భార్య రాధ నల్లనిదే" అని రాధను ఓదార్చిన చంద్రశేఖరుడు కన్నులు లేకపోవడం మాత్రం సౌందర్యానికి లోపమేనని భావించడంతో రాధ తిరిగి సందిగ్ధావస్థలో పడింది. చంద్రశేఖరునిది వ్యక్తిగతమైన సౌందర్యాభిరుచి. ఇది తరచుగా రూపాన్ని, గుణాన్ని ఆశ్రయించుకొని ఏర్పడుతుంది. ఈ రెండూ కలిసి ఉన్నపుడే సౌందర్యానికి పరిపూర్తి లభిస్తుందని రాధ భావించింది. తనకు పుట్టిన బిడ్డ అందమైన చంద్రశేఖరుని కళ్ళ సొగసును, చూపును కలిగి ఉండటంతో ఆమె అంతరంగంలో ఒక పరిపూర్ణ సౌందర్య భావన రూపుదిద్దుకొంది. తాను పరిపూర్ణ సౌందర్య సృష్టికి కారకురాలిని కాగలిగానన్న తృప్తి ఆమెకు మహానందాన్ని కలిగించింది. ఆ ఆనందమే సౌందర్య స్వరూపము.

తిరోధానము అనే కథలో మహాశ్వేత సహజ సుందరి. "ఆమె సౌందర్యము మసృణ మృణాల మధురము. ఆమెకెందు చేతనో కృత్రిమ సౌందర్యము నెడల వైముఖ్యము. సౌమంగల్యము కన్న, వైధవ్యము కన్న విభిన్నమైన యొక్క లక్షణమామె మొగమున నిండియున్నది. అది సౌందర్య మేమో! ఆమె వంక చూచిన నడవి పూలు వికసించినట్లుండును. మహాశ్వేత కృత్రిమ సౌందర్యము నెడ నెంత విముఖయో బ్రతికి వున్నపుడు నీలోచనుడు ఆ సౌందర్యము నెడ నంత సుముఖుడు. సౌందర్యము విషయమున నిద్దరి భావములు ఏకీభవించ లేదు. ఈమెకు మల్లెపూవనిన యిష్టము. అతనికి మందార పుష్పము మీద నభిమానము."

మహాశ్వేత, నీలలోచనులకు గల ఈ సౌందర్యాభిరుచి భేదాన్ని ఆధారంగా చేసుకొని విశ్వనాథ సౌందర్యాభిరుచి కూడా ఒక మానసిక విక్రియగా నిరూపించడానికి ఈ కథలో ప్రయత్నం చేశారు. తమ అభిరుచుల కనుగుణంగా శ్వేత ఒక మల్లెచెట్టును, నీలలోచనుడు ఒక మందార చెట్టును నాటారు. ఆ తరువాత నీలలోచనులు మరణించాడు. అప్పుడు శ్వేతకు పదునెనిమిది సంవత్సరాలు.

పరిపుష్ట యవ్వన దశలో ఆమెలో వృద్ధి చెందిన కామ వికారానికి సరియైన విడుదల కలుగని కారణంగా మహాశ్వేతకి తన దొడ్డిలో నీలలోచనుడు నాటిన మందార వృక్షాన్ని, దాని పుష్పాలను చూసినప్పుడల్లా ఒక మనో వైకల్యానికి గురి అవుతూ నిరంతర నీలలోచన స్మృతి, ఆ స్మృతి సంబంధమైన సంసర్గము ఆమెను బాధించడం మొదలయింది. ఆ బాధకు ఉపశమనంగా శ్వేత తన సౌందర్యాభిరుచిని వదులుకొని నీలలోచనుని సౌందర్యాభిరుచికి క్రమంగా అలవాటు పడసాగింది. ఈ పరిణామానికి ఆమెలోని గుప్త వాంఛ కారణమయింది. ఆ తరువాత ఆమె జీవితంలోకి అనుకోని రీతిగా రాధారాం అనే యువకుడు ప్రవేశించాడు.

రాధారాం సంస్కారము, సౌందర్యాభిరుచి శ్వేత అభిరుచికి అనుగుణ మైనవి. రాధారాం శ్వేత గుప్త వాంఛలకు ఒక విడుదలను కల్పించాడు. తిరిగి శ్వేత క్రమంగా ఈ మధ్య కాలంలో నీలలోచనుని అభిరుచి కనుగుణంగా తాను ధరిస్తూ వచ్చిన వెల గల రంగుల చీరలను, విలువైన ఆభరణాలను ధరించడం తగ్గిస్తూ వచ్చింది. రాధారాంతో మానసిక పరిచయం పెరుగుతున్న కొద్దీ నీలలోచనుని సంసర్గం క్రమంగా అంతర్నిహితమవుతుండటంతో ఆమె మళ్ళీ నిరాడంబరంగా, నిరలంకారంగా, శ్వేత దుకూలధారిణిగా మారుతూ వచ్చింది. చివరకు రాధారాంని వివాహమాడి కామ వికృతి కారణంగా ఏర్పడిన గుప్త వాంఛల నుండి విముక్తిని పొంది తన సహజ సౌందర్య అభిరుచి మార్గానికి మళ్ళింది. ఆధునిక మానసిక శాస్త్ర పరిభాషల జోలికి పోకుండా విశ్వనాథ ఒక యువతి సౌందర్యాభిరుచికి సంబంధించిన మనో వికృతినీ, వైవిధ్యాన్నీ, వేదనను, దాని నుండి పొందిన విముక్తిని ఈ కథలో ఒక విలక్షణమైన మార్గంలో చిత్రిం చాడు. ఇందులో కొంత స్వాప్నికాంశ, కొంత స్వైరకల్పన, ప్రాక్యేతనలోని సంసర్గ ప్రభావము కలగలసి మహాశ్వేత సౌందర్యాభి రుచిలోని విలక్షణ రీతిని మన ముందు నిలిపి వుంచాయి. విశ్వనాథ తన కథలలో ఈ విధంగా సౌందర్య సంబంధమయిన భిన్న కోణాలను విశ్లేషించి చూపిస్తూ చామర గ్రాహిణి అనే కథలో "సౌందర్యమునకు, వివేకమునకు నాత్మ జ్ఞానమెక్కువ. ఆత్మాభిమానమెక్కువ" అని ప్రకటించారు.




**శ్రీ వరం**

ఎందరో అల్లసాని పెద్దనలు
గండపెండేరాని కర్త మైన ఉద్దండపిండాలే...
అక్షర పరబ్రహ్మ పదానార్చకులే.
లక్షలాది రసజ్ఞ మనోజ్ఞ పీఠికల ఆరాధ్యదైవాలే
కళాజీవన స్రవంతిలో నటగాయక కవన శిరోమణులే
అయితే...
తరాలు మారుతున్నా... తరతమ స్వరాలు పాడుతూనే ఉన్నాయి
వారి అంతరాల... అనుస్వరాలు మ్రోగుతూనే ఉన్నాయి.
అలాంటప్పుడే...
కళ కళ తప్పుతుంది
'అక్షరం'అలుగుతుంది.

ప్రవచన శిరోమణి ప్రవాహం ప్రక్కదారి పడుతుంది.
గాయకుల గమకాల గండశిల గండి పెడుతుంది.

బలహీనతల బకాసురుడు బూని
నట సామ్రాట్టు వికట విరాట్టౌతాడు.
జ్ఞానం పీఠం నుండి జారిపోతుంది.
వైభోగ వినాయకుడికి వివేక నిమజ్జనమౌతుంది.

ఇలా జరిగింది ఎందుకోనని
అక్షర లక్షల సందేహాలు
లక్ష అక్షరాలూ తీర్చలేని యక్ష ప్రశ్నలు..

'జగతః పితరౌవందే' అంటున్న మనసులో....
జాడ్యం జతకూడినందుకా?

కలకంఠి కంట కన్నీరెందుకన్న పోతన్న
ఆదర్శం కానందుకా..?

పదవీ వ్యామోహాల పరిష్వంగంలో
కీర్తి కిరీటాల దోబూచులాటలో
ధనకాంక్షా దగ్ధయోగంలో,
'కళ'కళేబరమైన ఆ రుద్రభూమిలో
అహమిహమికలు అర్ధాంగమై
భవుడు భృగుడై
నటరాజ వక్షస్థలంపై నాట్యమాడుతున్నడు...
అపుడు...
ఆ అరికాలి చక్షువును ఒత్తేది ఎవరు?
ఆ దక్షయజ్ఞాన్ని ఆపేది ఎవరు?
ఆ శిల్పి ఉలి పదును పెట్టేది ఎవరు!
ఎవ్వరో కాదు... మరెవ్వరో కాదు
చండికా చరణాల హారతుల స్ఫూర్తిగా
నరక సంహారాన ఆయుధం సాక్షిగా...
ఓ కవీ! కళారవీ!!
అది అచంచలమైనప్పుడు
అలరించే నీ అంతరాత్మే

అందుకోసం...
స్పృశించు నీ మనస్సును
తరింపజేయి ఈ జగత్తును
ప్రసరింపజేయి నవ ఉషస్సును...

అప్పుడు...
శూన్యంలోంచీ కురుస్తుంది కళాచినుకు
అలిగిన అజంతంలోంచి 'అద్భుత మెరుపు'

'ఎక్కువ తక్కువలన్న తరాల
అంతరాలకు అదే మలిమలుపు...'

# పరాన్నజీవి



కురుల నుండి బొట్లు బొట్లుగా కారుతున్న నీళ్ళతో తడిసి, కడిగిన లేత తమలపాకులా కనిపిస్తుంది నాని. అప్పుడే స్నానించి వచ్చిన నానీ కురుల్ని తుడిచి వదులుగా ముడి బిగించాను.

**బి.వి.ఎన్. స్వామి**

**వ**ర్షంలో తడిసి, వెన్నెలలో అరిన అక్కృతి మాతలా నానీ కనిపిస్తుంది. నిరలంకార శోభితయై, నీ రెండకు నిల్చున్న నానీ లో మాతృమూర్తి గోచరించింది. ఆ ఉదయాన మనస్సులో తల్లి పాదాలకు ప్రణమిల్లాను. ఆదివారం కనుక రోజువారీ హడావిడి లేక మనసు, ఇల్లు కాస్త ప్రశాంతంగా ఉన్నాయి.

"నాన్నా, నిన్నటి నీ కథ బాగలేదు"

"తప్పురాశానా"

"కాలేజి పిల్లల విషయాలు మీకేం తెలుసని రాశారు?"

"నీకు తెలుసా?"

"తెలుసు. కాని రాయలేను."

"నీవు రాయలేని కథ నేను రాశాను. అందులో తప్పేం ఉంది"

"ఎవరి అనుభవాల్ని వారు రాయడం బాగుంటది కదా!"

"పండించిన పంటనంత రైతు తినడం లేదు. ఉత్పత్తులన్నిటిని కార్మికుడే కాజేయటం లేదు. అలాగే ఎవరి అనుభవాల్ని వారే రాసుకోవాలని లేదు. కలసి పంచుకోవాలి. నేరుగా సాధ్యపడనపుడు కనీసం కథలు, కవిత్వం ద్వారానైనా అది జరగాలి".

"నాన్నా, నీతో వాదించే శక్తి నాకు లేదు. బహుశ తెలివి కూడా లేదేమో!?"

"అయ్యో తల్లీ, ఎందుకో చిన్నతనం. ఎదిగేదానివి. అందరి అనుభవాలతో తెలివిని పెంచుకోవాలి."

ఆ సాయంత్రం, సాహితీ మిత్రులతో ఇష్టాగోష్టిగా కూర్చున్నాను. పదహారణాల తెలుగమ్మాయిలా తెలుగు నేలపై కాలిడిన కథానిక అడుగు జాడల్ని గుర్తుచేశారొకరు. ఉధృతంగా ప్రవహించే వరద నీటిలా తెలుగుదేశాన్ని ఊపేసిన కథా చేలాం"చలాన్ని" జ్ఞప్తి చేశారు మరొకరు.

గంగాధరుని సిగలోని జాబిలి విసిరిన కథా ఐరావతాల్ని స్మరించారొకరు. సొమ్ములు పోనాయండిలోని మాండలిక సొగసుల్ని అర్థం చేసుకున్న వైనాన్ని వివరించారొకరు. పనిపిల్లపై జరిగిన ఖండన మండనల్ని గుర్తు చేశారొకరు. గొల్లరామవ్వ టెంపరితనాన్ని పలవరిస్తూ పరవశించారొకరు. కథా లోకంలో మానసిక విశ్లేషణలకు పట్టం కట్టిన చైతన్య స్రవంతుల్ని చూసి పొంగిపోయారొకరు. కథకు సురవరం తొడిగిన అందాల్ని విశ్లేషించారు. "అజంత" భాషా రహస్యాల్ని విడమరిచారు. మా అమ్మాయి అందించిన కాఫీని గొంతులో వంపుకొంటూ ఘుమ ఘుమల్ని ఆఘ్రాణిస్తూ గాలివాన గురించి చర్చించారు. మీ అమ్మాయి బతుకమ్మ సిగలో తురిమిన కట్లపూవులా ఉందంటూ మిత్రుడు నవీన్ చేసిన వర్ణనతో బుచ్చిబాబు గుర్తొచ్చాడు.

నాన్నా! నేను కాలేజికి వెళ్తున్నా.

ఈ సాయంత్రం కాలేజి కెళ్ళడం ఎందుకు?



స్పెషల్ క్లాసుంది.

"ఏం చదువుతున్నావమ్మా" మిత్రుని పలకరింపు.

ఇంటర్ సెంకడ్ ఇయర్

ఫస్ట్ ఇయర్ లో ఎంత పర్సెంట్ వచ్చింది.

సిక్స్‌టీ పర్సెంట్

అయ్యో! అంతేనా, ర్యాంకులు సాధించాలి. నాన్న పేరు నిలబెట్టాలి.

అలాగే.

నానీ వెళ్ళింది. కథన కుతూహలంతో మా వాళ్ళు కథాలోకంలోకి ప్రవేశించారు. ఆ రోజంతా అలా సాగింది. మిత్రుని మాటలతో నా తల్లి మనసు చిన్నబుచ్చుకుందేమో అనే భావన నాలో కొసమెరుపులా తళుకుమంది.

- - -

బ్రౌన్ కలర్‌తో మిల మిల మెరిసే ఆకాశ హర్మ్యాలు. మట్టి అంటని నేల. కింద మొజాయిక్ ఫ్లోరింగ్. పైన సీలింగ్ గోడలన్నీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో ముద్దొస్తున్నాయి. గార్డెనింగ్, ప్లానింగ్‌లతో ఆ కళాశాల భవనాలు చూపరులను ఆకట్టు కుంటున్నాయి. పాలరాయిలా మెరిసే ఆధునిక హంగులన్నీ కలిగిన వాహనాలు, స్వరాజ్ మజ్దాలు వచ్చి వాలాయి. వాటిలో నుండి రకరకాల పూలు ఒక్కసారిగా పరిమళించాయి. అంతే! భవనాలకు మరింత సోయగం, సువాసన అబ్బింది. మరో వైపున ఉన్న పెద్ద గేట్ నుండి గాలితో పోటీ పడుతూ వచ్చిన అత్యాధునిక మోటార్ బైక్స్ పార్కింగ్ ప్లేస్‌లో బారులు తీరాయి. భవనాల రాజసం రెట్టింపయింది. ఇప్పుడా భవనాల కారిడార్స్ అన్నీ అయస్కాంతా లయ్యాయి. కాస్మటిక్ ఫ్యాషన్ పరిధిలో అందం, ఆకర్షణలు పరేడ్ చేసాయి. అదో ప్రత్యేకమైన వాతావరణం. పత్రహరితాన్ని నింపుకొన్న ఆవరణంతా కార్పోరేట్ కళాశాలలో ఒక భాగం. అదొక పార్శ్వం. అది నానీ చేరిన కళాశాల బెల్ మోగగానే ఆవరణలోని వాతావరణమంతా గదుల్లో నిండింది. చదువుల్లో మునిగింది. టెస్టుల్లో తేలింది. మార్కులు పునాదిగా విద్యార్థుల మధ్య విభజనలు జరిగాయి. ఫలితంగా ఒత్తిడి, న్యూనత, విద్యార్థులకు అయాచిత శాపాలయ్యాయి. కనపడని చీకట్లు, వినపడని వేదనలు కళాశాల వాతావరణంలోని తేమలో నిండి ఉన్నాయి. అటువంటి స్థితిలో ఒక రోజు ప్రిన్సిపాల్ నుండి నానీకి కబురొచ్చింది.

గుడ్‌మార్నింగ్ సర్.

సిడౌన్ నాని

థాంక్సు సర్.

ఐ హావ్ మెనీ హోప్స్ అపాన్ యు, బట్ యూ ఆర్ నాట్ షోయింగ్ ఇంట్రెస్ట్ ఇన్ స్టడీస్.

హౌకెన్ యు సే సర్.

దిస్ ఈజ్ ఎ మిర్రర్ ఆఫ్ యవర్ పెర్‌ఫార్మెన్స్ అంటూ మార్కుల జాబితాను ముందుంచాడు. సీ, యు ఆర్ ఎ చైల్డ్ ఆఫ్ గుడ్ ఎడ్యుకేషనిస్ట్. యువర్ ఫాదర్ హేజ్ ఎ గుడ్ నేమ్ ఇన్ ది సొసైటి. బీయింగ్ హిజ్ డాటర్, యు హావ్ టు పే మోర్ అటెన్షన్ ఇన్ యువర్ స్టడీస్.

టెన్త్‌కు, టెన్త్‌కు మధ్య గల నా ఇంప్రూవ్‌మెంట్ చూడండి సార్.

ఇది సరిపోదు. రేట్ ఆఫ్ ఇంప్రూవ్‌మెంట్ ఈజ్ వెరీ పూర్.

ఎంత ఉండాలంటారు.

ఇట్ షుడ్‌బి హండ్రెడ్ పర్సెంట్. నీ ఇంప్రూవ్‌మెంట్ పర్సంటేజ్ ఎంత?

ఎబౌ ఫార్టీ పర్సెంట్

సిల్లీ ఇటీజ్

హండ్రెడ్ పర్సెంట్ సాధ్యమా

సాధ్యం కాకపోతే కాలేజి మానెయ్యి. వేరే కాలేజీలో చేరు. సిటీలో ఈ కాలేజికి మంచి పేరు ఉంది. మీ నాన్నకున్న పేరు ప్రతిష్టల్ని చూసి నిన్ను జాయిన్ చేసుకున్నాం. ఆయన పేరు నిలపాల్సిన బాధ్యత నీపై ఉంది. తర్వాత పరీక్షల్లో హండ్రెడ్ పర్సెంట్ ఇంప్రూవ్‌మెంట్ నీవు చూపెట్టాలి. లేకపోతే ఐ విల్ పనిష్ యు.

జవాబు లేని ప్రశ్నలా లేచి బయటకు నడిచింది నాని.

అంతులేని హద్దుల మధ్య ఏపుగా పెరుతున్న తోటి విద్యార్థుల ముఖాలు బ్లాంక్‌గా కనిపించసాగాయి. అనేక

ముఖాలలో వైవిధ్యంగా కనపడాల్సిన కళాశాల ఏకముఖంగా కనిపించసాగింది. అమె గడ్డకట్టసాగింది. క్యాంటిన్ వేపు అడుగులేసింది.

ఆ రోజంతా అన్యమనస్తంగా ఉంది నాని. ప్రిన్సిపాల్ మాటల్తో పొక్కిలయింది. మనసంతా తుమ్మలు మొలిచిన భూమిలా ఉంది. ఆలోచనల ప్రభావం ఆమె ఆచరణలో కనపడింది. నిస్సత్తువగా, నిరాశగా కనపడుతున్న నానీని చూసి తండ్రి చలించాడు.

ఏమయింది? ఎందుకట్ల ఉన్నావు.

.................................

నీ అలక, నా పాలటి కండ్లకలక.

నాన్నా! కవిత్వం చెప్పకు.

కథ చెప్పనా మరి.

కథలు, కవిత్వంలో కడుపు నిండే కాలం కాదిది.

ఏం చేస్తే నీ మనసు నిండుతుంది

నన్ను, హాస్టల్ లో చేర్పించు.

నన్ను హిమాలయాల కెళ్ళమంటావా?

మానస సరోవరం తీరాన హాయిగా బ్రతుకు వెళ్ళదీయటం ఒక వరం

ఈ రోజు వింతగా మాట్లాడుతున్న వేంది?

నాన్నా! నిన్ను, ఇంటిని వదిలి వెళ్ళాలని లేదు.

వదిలి వెళ్ళమన్నదెవరు?

ఇంట్లో ఉండి చదివితే మార్కులు రావడం లేదు.హాస్టల్‌లో చేరి చదవాలనుంది.

హాస్టల్‌లో చేరమన్న దెవరు?

మార్క్సు తక్కువ వచ్చాయని ప్రిన్సిపాల్ మందలించారు. ఆయన అన్నది కూడా నిజమేననిపించింది. ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థికి చదువే లోకంగా ఉండాలి. కనుక, ఇంటికి దూరంగా ఉండాలనుకుంటున్న.

చూడమ్మా, నీ మాటను ఎన్నడూ కాదనలేదు. సరి అయిన కళాశాలలో చేర్పించాను. మంచి వాతావరణాన్ని ఇంట్లో కల్పించాను. చదవమని ఎన్నడూ ఒత్తిడి చేయలేదు. చదివే బాధ్యత నీదని సరిపెట్టుకొని స్వేచ్ఛనిచ్చాను.

"నిజమే నాన్న. కడుపున పెట్టుకొని సాదిన నీ పరువు ప్రతిష్టలను కాపాడాల్సిన బాధ్యత నాది."

"నా పరువు ప్రతిష్టలకు నీ వల్ల ఏం చేటు వచ్చింది"

"నాకు తక్కువ ర్యాంకు వస్తే నీకు నామోషీ కాదా!"

"నా పరువు, ప్రతిష్టలు నీ ర్యాంకుతో ముడిపడి లేవు. అవి అంత బలహీనమైనవి కావు. ఆవిషయంలో నీవు బాధపడవద్దు. చదువుపై శ్రద్ద పెడితేచాలు"

"నీ వెన్ని చెప్పినా హాస్టల్‌కు వెళ్ళక మానను"



"ర్యాంకుల మోజులో కొట్టుకపోకు. అవి సరియైన ప్రాతిపదికలు కావు"

"నాన్నా, ప్రపంచానికి, నీకు ఎప్పుడు పొంతన కుదరదు. అట్లని నీ ఆలోచనలు తప్పని చెప్పలేను. నేనీ లోకంతో సరితూగాలంటే హాస్టల్‌కు వెళ్ళక తప్పదు"

"నానీ, నీ ఆలోచనలు తప్పుదారి పడుతున్నాయి. నీ ఇష్టం వచ్చినట్లు చేయి."

థాంక్యూ నాన్నా.

– – –

పాట గొంతు నొక్కాను. సెల్ నోరు తెరిచింది. నాన్నా అనే పిలుపు వినపడింది.

చెప్పుబిడ్డా!

బాగున్నారా నాన్నా?

"నీ ఆరోగ్యం బాగుందా. భోజనం సరిగా తింటున్నావా. నీళ్ళు సరిపడితున్నాయా."

"నీళ్ళకు భోజనానికి, వసతికి కరువు లేదు. కాని వాటిని వాడుకోనివ్వడం లేదు."

"అదేంటి? ఎందుకట్లా?"

"నిన్న టిఫిన్ బాగుందని మరింత తెచ్చుకొని తిన్నాను. అది గమనించిన మా కేర్‌టేకర్, ఇక్కడికి తినడానికి వచ్చిండ్రా, అట్ల తినుకుంట కూర్చుంటే లేటయితది అంటూ అసహ్యంగా మాట్లాడిండు. టిఫిన్ అక్కడే వదిలాను. ఇబ్బంది అనిపించింది.

"అటువంటి వన్నీ పట్టించుకోకు"

"త్వరలో మా సెంకడ్ ఇయర్ ఎగ్జామ్స్ ఉన్నవి. వాటికి ముందు ప్రీ ఫైనల్స్ పెడుతున్నారు. ఇకముందు ఈ మాత్రం ఫోన్ చేసే వీలు కలుగుతుందో లేదో, మీ ఆరోగ్యం జాగ్రత్త. ఇక ఉంట"

"ఈ మధ్యలో నన్ను రమ్మంటావా. ఏమైనా కావాలంటే చెప్పు"

"నాకన్నీ సమృద్ధిగానే ఉన్నాయి. నా గురించి ఆలోచించకు" అంటూ ఫోన్ పెట్టేసింది.

నాలో నేనే నవ్వుకున్నాను. చదువు పేరు మీద అన్ని వసతులు కలిగి ఉన్నా ఇల్లు వదిలి వెళ్ళడం ఎంతవరకు అర్థం కావడం లేదు. కోరి ఒకరి నియంత్రణలోకి వెళ్ళడంలోని అనివార్యతను గురించి ఆలోచిస్తే ఆందోళన కలిగింది.

కాలం గడుస్తుంది. కాలంతో పాటు పరీక్షలు గడిచాయి. గండం గడిచిన సంతోషంలో ప్రశ్నాపత్రాల్ని చింపేసిన పిల్లలందరు ప్రకృతిలోకి బయల్దేరారు. అందమైన జలపాతంలో ఆడుతూ, పాడుతూ అంతరంగాన్ని క్షాళన చేస్తూ విహరించారు. అందరితో పాటు నానీ ఆడింది. పాడింది. జట్లు జట్లుగా, గుంపులు గుంపులుగా, సమూహంగా ఆడిన ఆటల్లో, పాటల్లో నాని

తనివితీరా తడిసింది. ఆనందంతో అలసిన స్నేహితులందరూ, నలుమూలల నుండి వచ్చి ఒక చోట సేద తీరసాగారు. ఆయాసాన్ని సైతం పంచుకొని ఆనందించసాగారు. పంచుకొనే క్రమంలో నానీ కోసం చూశారు, వెతికారు, తిరిగారు. ఖాళీ కళ్ళతో వెనుదిరిగారు. ఒక చోట కుప్పగా పోగయ్యారు. ఆందోళన చెందసాగారు. ఆటపట్టించడం లేదు కదా! అనుకోనిదేమైనా జరుగలేదు కదా! ఒక్కసారి ఆనందం ఆవిరయింది. బితుకు బితుకుమంటూ సాగిన గాలింపు ఫలించింది. అల్లంత దూరాన, ఒడ్డున నానీ అచేతనంగా కనిపించింది. ఊహించని దృశ్యం ఉక్కిరిబిక్కిరి చేసింది. స్నేహితుల కలవరపాటుకు నానీ కేంద్ర బిందువయింది. చేతుల్లోని సెల్‌ఫోన్స్ ఒపెన్ అయ్యాయి. క్షణంలో వార్త నలుదిక్కులా పాకింది. కాసేపట్లోనే అనేక వాహనాలు వచ్చి చేరాయి. నిశ్శబ్దంగా ఉన్న ప్రకృతి శబ్దాలలో రోదించసాగింది. అలా చాలా సేపు గడిచాక తిరిగి నిశ్శబ్దంలోకి జారిపోయింది.



కూతురి ఎడబాటు అతణ్ణి నిలవనీయటం లేదు. కన్నతల్లి మాదిరిగా పెంచిన కూతురు చెప్పకుండా గుండెలమీద తన్నిన తీరును కలవరపరచింది. బాధను మందుతో కలిపి పంచుకోసాగాడు. మందు అతనికి ఉపశమనం ప్రసాదించింది. అలా అతని దినచర్యలో మందు అనివార్యమైన భాగమయింది. క్రమక్రమంగా కూతుర్ని మరిచిపోతున్న తరుణంలో ఎప్పటిలాగే రాత్రి ఇంట్లో, డిమ్‌లైట్ మధ్య మందు గ్లాస్‌లో పోసుకున్నాడు. ఒకటి, రెండు, మూడు – అలా, అలా మందు గొంతులోకి దిగసాగింది. సోఫాలో కూర్చుని టీపాయ్ మీదికి కాలు జాపిండు. సిగరెట్ వెలిగింది. మధువు, పొగలలో గదంతా గమ్మత్తైన వాసన. వాతావరణం మత్తెక్కింది. కంప్యూటర్ నుండి షహనాయి ఆర్ద్రంగా పలుకుతుంది. ఆ పలుకులోని తడిలో అతని గుండె చెమ్మగిల్లింది. అతని కళ్ళు రెండు బుగ్గబావులయ్యాయి. అతను నిశ్చల సమాధి స్థితిలోకి వెళ్ళాడు. ఆ సమయంలో చిరపరిచితమైన గొంతొకటి నాన్నా! అని పిలిచింది. నిశ్చలమైన నీళ్ళలో రాయి విసిరినట్లయింది. గభాల్న కళ్ళు తెరిచాడు. భ్రమా! లేక నిజమా? గది నాలుగు వైపులా కళ్ళు తిరిగాయి. ఒకింత విస్మయానికి గురయ్యాడు. చంచలమైన మనసు కోసం మందు వైపు దృష్టి సారించాడు. గ్లాసులోని ద్రవంలో నానీ ప్రతిబింబం కనిపించింది. అప్యాయంగా అందుకున్నాడు. అతని కళ్ళు వర్షించసాగాయి.

"ఏడవకు నాన్నా"

"నాకు ఏడుపే మిగిలింది"

"ఏడవడం ఒక బలహీనత"

"చావడం కాదా!"

"అదొక అనివార్యత:"

"తెచ్చిపెట్టుకొన్న చావైతే"

"అదొక ఖర్మ. మార్కులతో మనుషుల్ని కొలిచే లెక్కలలోకం ఇది. అందుకే తనువు చాలించాను"

"అది నాకు బూతు మాటలా వినిపిస్తుంది"

"ఈ పరిస్థితులలో నీ కలాగే అనిపిస్తుంది"

"నీవు, నీలాంటి అనేకులు ఆ వాక్యం మాటున దాక్కొంటున్నారు."

"మేమంతా బలిపశువులు"

"మిమ్మల్ని బలితీసుకున్నదెవరు?"

"ఈ వ్యవస్థ"

"మీకు శత్రువైన ఈ వ్యవస్థను మీరెప్పుడైనా ప్రశ్నించారా? నిలదీసారా?"

"అవి మాకెవరూ నేర్పలేదు"

"చావడం నేర్పారా?"

"అది మా చేతిలోనిది"

"ప్రశ్నించడం, ఎదిరించడం అనేవి కూడా మీ చేతిలోవే. మీ తరానికి బాధ్యత తెలియదు"

"నాన్నా నిష్ఠూరంగా మాట్లాడుతున్నావు"

"కనిపెంచిన వారి కొరకు, మీ పెరుగుదలకు సహకరించిన సమాజం కొరకు ఏదైనా చేయాలనే తలంపు మీలో ఇసుమంతైనా లేదు"

"నాన్నా ఈ రోజు వింతగా వాదిస్తున్నారు"

"అవును. నా మాటలు నీకు వింతగానే ఉంటవి. సామాజిక బాధ్యత, సామాజిక రుణం అనే మాటలు, నీకు కాని నీ తరం వారికి గాని అర్థం కాని విషయాలు అయ్యాయి"

"అవన్నీ పాత చింతకాయ పచ్చడిలాంటి మాటలు"

"ఒకరికి బాధ్యత వహించడమంటే చెట్టున మాగిన పండులా మారడమన్నట్లే అది తెలియని మీరు కసుగాయలుగా ఉన్నప్పుడే రాలుతున్నారు. బాధ్యత తెలిసిన మనిషి ప్రేమ, బ్రతుకునిస్తుంది. కాని మీ ప్రేమలు బతుకును కాలరాస్తున్నవి"

"నాన్నా, ఆత్మహత్య చేసుకోవడం నా తప్పు. నా లాంటి వారి కనువిప్పు కలిగే కథ ఒకటి రాయవూ"

"కడుపులోని కార్బన్-డై-ఆక్సైడ్ పై కూడా పేటెంట్ హక్కు కోసం కలవరించే తరం మీది. మీకు కథ తలకెక్కుతుందా?" అంటూ నిట్టూర్చాడు.

బలమైన అతని నిట్టూర్పులో చేతిలోని మధువు ఒలికింది. వేయి వక్కలయింది. సోఫాలోపడి ఇంకిపోయింది.

H

చర్చ

# భాషా సమస్యా? సాంస్కృతిక సమస్యా?



**పూర్వం సంస్కృత నాటకాల్లో పాత్రల్ని ఉత్తమ, మధ్యమ, అధమ పాత్రలని విభజించారు. ఉత్తమ, మధ్యమ, పాత్రలు సంస్కృతంలో మాట్లాడితే– అధమ పాత్రలు విధిగా ప్రాకృతంలోనో, పైశాచీలోనో మాట్లాడాలి. దాదాపు అలాంటి నియమం అన్ని నాటకాల్లో నియమంగా, నిష్ఠగా పాటించేవాళ్ళు. ఇప్పుడు సమాజంలో పట్టణాల్లో ఉన్న విశిష్ట కులీన వర్గాల్లో ఇంగ్లీషు మాట్లాడుతారు. నాటకాల్లో అధమ పాత్రల్లాగా పనిపిల్ల, పనిమనిషి, కూరలమ్మిలాంటి వారే తెలుగు మాట్లాడుతారు. ప్రమాదవశాత్తూ మనం భరతుడు పేర్కొన్న భాషాస్తరీకరణాన్ని చక్కగా పాటిస్తున్నాం. ఎంచక్కా ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలు మాత్రమే రాష్ట్రపతి– ప్రధానమంత్రులు పాల్గొనే ఎర్రకోట పండగలో పాల్గొంటారు. మట్టిలో పుట్టి, మట్టి బలపాలతో రాసి, మట్టివాసన ఉన్న మన (తెలుగు) వీధి బడుల పిల్లలెవరూ అక్కడ కన్పించరు.**

## నందివెలుగు ముక్తేశ్వరరావు

**భా**ష సమాజానికి ఉమ్మడి ఆస్తి – వంశ పారంపర్యం– రక్తంలోనూ – మూలుగుల్లోనూ ఉన్న చోదకశక్తి. దీన్ని కోల్పోతే మనమేమౌతాం? అన్నది ముందుకు రావాల్సింది పోయి – ఒక భాష అకాల మరణాన్ని గురించి వాపోతున్నట్లు కనపడటం మొత్తం సమకాలీన చర్చలో ఉన్న విషాదం. భాష పోతే – దాని నుడికారం, అనుభూతి, సహజత్వం అన్నీ పోతాయన్న బాధ లేదు సరికదా, కాలంతో పాటూ మనమూ మారాలి లాంటి సూత్రీకరణలు ముందుకు రావడం మరో విషాదం.

యుగ యుగాలుగా మనం రాజ భాషల్ని నెత్తిన మోసి – ఈ రోజున ఇంగ్లీషును మోస్తున్నాం. ఇంగ్లీషు కొనసాగింపే. అందువల్ల ఇవాళ్టికివ్వాళ మనం బాధ పడాల్సింది మాని, ఇప్పటికైనా దీన్ని భాషా సమస్యగానే కాకుండా ఒక సామాజిక, సాంస్కృతిక సమస్యగా చూస్తే మంచిది.

**తెలుగు జాతి సమస్య**

నిజమెంతో తెలీదు గాని, నేను చిన్నప్పుడు విన్న అంశాన్ని ఒకటి మనవి చేస్తాను. మా గురువుగారొకాయన చెప్పేవారు. 'మన సమాజంలో ఉపన్యాసాలివ్వడం లేదు– లేనేలేదు. ఇంగ్లీషు వాడు మనకి దీన్ని దిగుమతి చేశాడు' అని. ఉపన్యాసంలో బాధ్యత లేదు, మనకి తోచిందల్లా మాట్లాడొచ్చు. మనకి నచ్చనివి కూడా నచ్చినట్లు, మనం పాటించేవి పాటించనట్లు చెప్పవచ్చు. ఉపన్యాసంలో మనం కంఠశక్తి కొద్దీ మాట్లాడుతాం. జనం ఓపికుంటే నోరు మూసుకు వింటారు, లేకపోతే వెళ్ళిపోతారు. ఇది ఉపన్యాసంలో ఉన్న సౌలభ్యం.

ఈ మధ్య కాలంలో సభలే సభలు – ఇందులో తెలుగును ప్రేమించమని చెప్పొచ్చు. తెలుగు అసలు అత్యంత ప్రాచీనభాష అనొచ్చు. తెలుగువాళ్ళం కాబట్టి తెలుగే మాట్లాడుదాం అంటూ మన వెన్ను మనం చరుచుకోవచ్చు. తెలుగు సభలు జరపవచ్చు. తెలుగుకు ఏదో అయిపోతోందని కొంచెం అటూ ఇటూగా తెలుగు (సంతాప) సభలు జరపవచ్చు. అయితే వేదికల మీద నుంచి మాట్లాడేవాళ్లు వేదిక బయటకొచ్చి శుభ్రంగా మర్చిపోతారు. ఇదంతా ఉపన్యాస సంస్కృతి. ఉపన్యాసాలు తెలుగును బ్రతికిస్తాయా? ఉపన్యాసకులు వాళ్ళు చెప్పింది వాళ్ళు నమ్ముతున్నారా?

ఒక రైతు, ఒక కూలీ, ఒక గృహిణీ, ఒక చిన్న కుగ్రామంలో ఒక ఉపాధ్యాయుడు వీళ్ళెవరూ ఇలా ఉపన్యాసాలు ఇవ్వరు. కానీ వాళ్ళు తెలుగు మాత్రమే మాట్లాడుతారు. తెలుగులోనే పలకరించుకుంటారు. తెలుగు లోనే ఆలోచిస్తారు. తెలుగులోనే నవ్వును, విషాదాన్ని పంచుకుంటారు. వాళ్ళెవరికీ ఈ సమస్యరాదు. ఇలాంటి సమస్య– తెలుగువాళ్ళు తెలుగులోనే మాట్లాడాలనే ఒక సమస్య– ఉందని కూడా తెలీదు.

ఇవ్వాళ 112 పురపాలక సంఘాల్లో మాత్రం ఇలాంటి చర్చ జరుగుతోంది. వేలాది గ్రామాల్లో ఇది సమస్యే కాదు. వేలాది గ్రామాల్లో లేని సమస్య 112 పురపాలక సంఘాల్లోనే ఎందుకొచ్చినట్లు! ఇక్కడంతా విశిష్ట సమాజం వుంటుంది. వీళ్ళందరూ వాళ్ళ పిల్లల్ని ఇంగ్లీషు బడులకే పంపుతారు. వీళ్ళు ఇళ్ళల్లో కూడా తెలుగును పట్టిపట్టి ముక్తసరిగా మాట్లాడుతారు.

మట్టీ మురికీ ఒకటనుకునే పిచ్చి భావం మనలో చాలాకాలంగా పాతుకు పోవడం వల్ల– మట్టిలో పుట్టి, ఈ మట్టి మాట లెరిగిన పిల్లలెవరికీ అందులో స్థానముండదు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. దీనివల్ల జనానికి ఏమర్థమవుతుంది?! మనబళ్ళు, మన చదువులు చదువులు కాదు అన్న భావం రావడం లేదూ? ఈ అభిప్రాయం యాదృచ్ఛికమా? దీని వెనుక ఐచ్ఛికంగా ఒక ప్రణాళిక వుందా? ఖచ్చితంగా దీనివెనుక ఈ నేల, ఈ భాష, ఈ యాస, ఈ నుడికారం తెలీని – మట్టి మీద మమకారం లేని కొందరు పెద్దల ప్రణాళిక వుంది. కాకపోతే – వాళ్ళే నిర్ణయాలు తీసుకొనేవాళ్ళు కావడం – మనందరి దురదృష్టం.

1 పానుగంటి సాక్షి వ్యాసాలు పుంఖాను పుంఖంగా రాశారు. అందులో 'స్వభాష'

అని ఒక వాక్యం రాశారు. తెలుగులో మాట్లాడటం న్యూనతగా భావించే మనస్తత్వాన్ని ఇంగ్లీషు నేర్చుకొన్న శిష్టవర్గం నడమంత్రపు పోకడల్ని ఆయన విపులంగా రాశారు. కాకుల్లో ఒక కాకి కా–కా అనకుండా కీ – కీ అంటే తక్కిన కాకులన్నీ పొడిచి చంపేస్తాయి గదా. ఆపాటి సామాజిక భావం మనకు లేకపోయెనే అని ఆయన వాపోయారు.

2. కన్యాశుల్కం నూరేళ్ళ పండగ చేసుకుంది. ఆ కన్యాశుల్కంలోనే వెంకటేశం తల్లి వెంకమ్మ గిరీశం, వెంకటేశం క్రిస్మస్ సెలవులకు ఇంటికి రాగానే, నాయనా మీరిద్దరూ ఒక్కసారి ఇంగ్లీషులో మాట్లాడుకోండి వింటాను అంటుంది. 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్' ఇంగ్లీషు రెయిమ్ చెరో పాదం చదివితే ఆ తల్లి మనసు ఎంత సంబరపడిపోతుందో, వాళ్ళ బంధువులబ్బాయికి – ఇంగ్లీషు చదవడం వల్ల మునసబీ అయి అగ్రహారం భూంవులన్నీ కొనేశాడని సంబరపడ్తుంది. అంటే ఇంగ్లీషు చదువుకోవడం ఎంత గొప్ప విషయమో...! మనం తెల్లదొరల్లాగా బ్రతకొచ్చు. అనేది అనాటికే–వందేళ్ళ క్రితమే మన మనస్సులో నాటుకు పోయిందన్న మాట. మెకాలే చచ్చిపోయినా సమాధిలోనే సంబరాలు పడ్తాడు ఇలాంటి విషయాలు జరిగినప్పుడల్లా. మెకాలే నుంచి నేటి దాకా వచ్చిన ఒక మార్పు– నల్లతోలున్న తెల్లదొరల సంఖ్య పెరగడం.

3. నా చిన్నప్పుడు మా తెనాలి– రేపల్లె రైల్లో ఇంగ్లీషులో అడుక్కునే ముసలాయన ఒకడుండేవాడు. మామూలు ముష్టివాడ్ని 'ఏం రోగం...కష్టం చేసుకోరాదూ పనీ పాటూ లేకుండా మామీద పడకపోతే' అని ఈసడించుకొనేవాళ్ళు, తెలుగులో అడుక్కునే ముష్టివాళ్ళను చూసి. ఇంగ్లీషు ముష్టివాణ్ణి చూసి–'చూడండీ ఎంత మేధావో? ఇంగ్లీషు ఎంత ధారాళంగా మాట్లాడుతున్నాడో' అనేవాళ్ళు. మనకర్థం కానిదైనా– ఇంగ్లీషులో మాట్లాడేవాళ్ళు తెలివైనవాళ్ళు అనే భావం మనలో లోతుగానే నాటుకొంది కదా. పాల్కురికి సోమనాథుడు దాదాపు ఎనిమిది వందల సంవత్సరాల క్రితమే ఒక మంచి మాట చెప్పాడు. 'తెలుగు మాటలనగ వలదు వేదముల కొలదిగ చూడవయ్యా' అంటూ వాపోయాడు. అంటే – అప్పటికే మన తెలుగు మీద మనకి తక్కువ చూపు ఉన్నదన్న మాట, 'ఓస్ ఇంతేనా తెలుగు మాటలేగా' అని తక్కువగా చూడటం లేకపోతే ఇలా ఎందుకు అనాల్సివస్తోంది.

దీనికి సమాంతరంగా పన్నిద్దరాళ్వార్లు రచించిన తమిళ ప్రబంధ పాశురాలు చూద్దాం. వందల సంవత్సరాల నుంచి వాటిని యథాతథంగా పారాయణం చేస్తున్నారు తమిళులు, వాటిని తు.చ. తప్పకుండా కళ్ళకద్దుకొన్నది ఆ జాతి. వేదంతో సమానంగా పీట వేశారు. ఆ ప్రబంధాలకు. మరి మన బసవపురాణం ఎంతమందికి వచ్చు? భాగవతంలో పద్యాలు ఎంతమందికి వచ్చు? వేమన తెలుగు నుడికారం ఎంత మిగుల్చుకున్నాం? అసలు ఆశు సంప్రదాయానికే మంగళం పాడేశాం. మాది కూడా ప్రాచీన భాషే అని చెప్పడానికి మాత్రం ముందున్నాం. మొత్తం మీద మనది స్వాభిమాన సంస్కృతి కాదు– ఆత్మ న్యూన సంస్కృతి – ఇలా అంటే ఎవరైనా నొచ్చుకుంటే – రోషంలో ముక్కుపుటాలదిరితే నాకు సంతోషమే – నేను విడిచిన బాణం సూటిగా తగిలినట్లే.

అసలు మనది భాషా సమస్యా? సామాజిక సమస్యా? లేకసాంస్కృతిక సమస్యా? చాలా పెద్ద చర్చే జరగాలి. చూడగా ఇది భాషా సమస్యగానే చాలామంది భావిస్తున్నట్లు కన్పడుతోంది. ఎందుకంటే దీన్ని తెలుగు బోధించే విభాగాల వాళ్ళు, తెలుగు జర్నలిస్టులు వగైరానే మాట్లాడుతున్నారు కాబట్టి. భాష సమాజానికి ఉమ్మడి ఆస్తి – వంశపారంపర్యం – రక్తంలోనూ – మూలుగు ల్లోనూ ఉన్న చోదక శక్తి. దీన్ని కోల్పోతే మనమే మౌతాం? అన్నది ముందుకు రావాల్సింది పోయి– ఒక భాష అకాల మరణాన్ని గురించి వాపోతున్నట్లు కనపడటం మొత్తం సమకాలీన చర్చలో ఉన్న విషాదం. భాషపోతే – దాని నుడికారం, అనుభూతి, సహజత్వం అన్నీ పోతాయన్న బాధ లేదు సరికదా, కాలంతో పాటూ మనమూ మారాలిలాంటి సూత్రీకరణలు ముందుకు రావడం మరో విషాదం.

యుగ యుగాలుగా మనం రాజ భాషల్ని నెత్తిన మోసి – ఈ రోజున ఇంగ్లీషును మోస్తున్నాం. ఇంగ్లీషు కొనసాగింపే. అందువల్ల ఇవాళ్టికివ్వాళ మనం బాధ పడాల్సింది మాని, ఇప్పటికైనా దీన్ని భాషా సమస్యగానే కాకుండా ఒక సామాజిక, సాంస్కృతిక సమస్యగా చూస్తే మంచిది.

పై సమస్యతో పాటు మన రాష్ట్రంలో ఒక విచిత్ర సమస్య వుంది. తెలుగులో వ్యాకరణాలు, సంధులు, విసంధులు, అరసున్నాలు వగైరాలు ప్రధానంగా బోధించి బోధించి తెలుగును సహజంగా మాట్లాడటం పోయి, తెలుగు 'సార్ల'కే తెలుసు అన్నంత దూరంపోయింది. తెలుగును మనం సరిగా మాట్లాడలేము. రాయనూ లేము. తెలుగు వ్యాకరణం గొప్పది. అది పండితులకే వస్తుంది లాంటి భావాలు పాదుకొనేటట్లు తరగతి గదుల్లో తెలుగు బోధించడం జరిగింది. ఒక హిందీ మాతృభాషీయుడు తోచిన, చేతనైన హిందీలో రాస్తాడు. మనం మాత్రం వీలున్నా, లేకపోయినా ఇంగ్లీషులోనే రాస్తాం. 'తెలుగులో రాయలేము' అని తరగతి గదిలో దిగుమతి అయి, తల్లితో పరాయీకరణ పొందడం మనకున్న విషాదయోగం.

ఈ వ్యాసంలో ప్రస్తావించిన అంశాలు కొంతమందినైనా ఆలోచింపచేస్తే పౌరుషం లాంటిదేమైనా రగిలించితే–

మన ఆలోచనల్లో మరింత స్పష్టత, శాస్త్రీయత వస్తే – వ్యాసం సఫలమైనట్లే!

**అంకితం**

**నిరక్షరాస్యులైనా**
**తెలుగునే నమ్ముకొని**
**తెలుగులోనే మాట్లాడే**
**సమాజంలోని అన్ని వర్గాల జనానికి**

కథ

# వెంటనే చేరండి!

లేచీ లేవక ముందే
ఫోన్ మోగడంతో
విసుగ్గా తీశాను.
ఎవరో అమ్మాయి
మాట్లాడుతుంది.
గీత
మీ అమ్మాయే
కదండీ..



**హరిశ్చంద్ర**

**అం**త పొద్దున్నే ఫోన్ చేసి మా అమ్మాయి పేరు అడగడంతో ఒకింత సంధిగ్ధం. అందులోనూ ఇంకా వదలని నిద్ర మత్తు.

కాని ఫోన్ చేసినావిడ ఇవన్నీ పట్టించుకునే స్థితిలోలేదు.

మేము నవీన నుంచి మాట్లాడుతున్నామండీ.. మీ గీత ప్రభాత్ పబ్లిక్ స్కూల్లో పదో క్లాసు చదువుతుంది కదా...

హమ్మయ్య. విషయం అర్థమైంది.

చెప్పండి..

మేము ఆ స్కూలులో టెస్టు పెట్టామండీ. మీ అమ్మాయి బాగా రాసింది. అలాటి వారందరినీ కాంటాక్టు చేస్తున్నాము.

ఆహా...

మీ గీత సైన్సు తీసుకుంటుందాండీ లేక మ్యాత్సా?

నేనేం మాట్లాడలేక పోయాను. ఇంతవరకూ నిర్ణయించుకోలేదు. పరీక్షల మధ్యలో అడగడం ఎందుకని దానితో కూడా పెద్దగా చర్చ పెట్టలేదు. అదే చెప్పాను.

ఇంకా ఏమీ అనుకోలేదండీ..

రేపు చెబుతారా సార్?

రేపు కాదు లెండి. వారం తర్వాత..

కాని అంత సావధానంగా వుండేందుకు అవకాశమేదీ

కాద్సార్. మా దగ్గర ఒక స్కీము వుంది. ఇప్పుడు మీరు వెయ్యి రూపాయలు కడితే రిజిస్టర్ చేయించుకుంటాం. పరీక్షల తర్వాత రెండు రోజులు గ్యాప్ వదలి పెట్టి క్లాసులు మొదలు పెడతాం. ఒక వేళ మీ అమ్మాయికి గనక అయిదు వందలకు పైగా మార్కులు వస్తే వెయ్యి రూపాయలు వెనక్కు ఇచ్చేసి ఫ్రీ సీటు ఇస్తాం.

కాని అయిదు వందలు రావాలి కదా...

ఎందుకు రావండీ.. ఇప్పటికే తనకు ఎయిటీ పర్సెంట్ వుంది కదా.. ఎందుకంటే ముందు మీరు వెయ్యి రూపాయలు కడితే తర్వాత ఫ్రీ సీటు వుంటుంది. ఒకవేళ మీరు కట్టలేదనుకోండి. అయిదు వందలకు పైన వచ్చినా ఫ్రీ సీటు వుండదు. వెయ్యి రూపాయలే కద సార్?

ఆఫర్ బ్రహ్మాండంగా వుంది. మెదడున్నవారెవరైనా ఎలా కాదంటారు? కాని నా సమస్య వెయ్యి రూపాయలు ఒక్కటే కాదు. పరీక్షలకోసమే తలకిందులవుతున్న అమ్మాయిని ఆ వెంటనే రెండు రోజులలో మళ్లీ రుబ్బుడులో ముంచెత్తడమా అని ఆలోచన. అంతకంటే సమస్య– తను ఏ గ్రూపులో చేరుతుందో మేము లోతుగా మాట్లాడు కోలేదు. లెక్కలూ సైన్సూ అంటూ రెండింటి చుట్టే ప్రదక్షిణలు చేయడమెందుకున్న ఆలోచన నాకుంది. కాని దాని అభిప్రాయం కూడా తెలుసుకున్నాక పరస్పరం చర్చించుకున్నాక గాని ఒక నిర్ణయం తీసుకోలేము. కాని నేను అనవసరంగా ఆలస్యం చేస్తున్నానని మా ఆవిడతో పాటు నా కొలీగ్స్ కూడా తిట్టిపోస్తున్నారు. ఇంతలో ఈమెవరో ఫోన్ చేసి అవకాశాలు హరించుకుపోతాయని హడలగొడుతోంది.



చూద్దామమ్మా. ఆలోచించి ఫోన్ చేస్తాను. మీ నంబరు వుంది కదా..

కాద్సార్. మేము అందరినీ అడగడం లేదు. మీ అమ్మాయి వంటి ఇంటలిజెంట్ల ఇళ్లకే ఫోన్ చేస్తున్నాము.

తల్లి పుట్టిల్లు మేనమామకు తెలియదా అని మా అమ్మాయి ఇంటలిజెన్స్ గురించి నాకే చెప్పడం. వినడానికి బాగానే వున్నా అందుకోసమే చేస్తున్నారని ఎలా నమ్మగలను?

నేను అంతసేపు నిశ్శబ్దంగా వుండటం అవతలివైపు వారు భరించేట్లు లేరు.

చెప్పండి సార్, ఎప్పుడు ఫోన్ చేయమంటారు?

ఏదో ఒకటి చెప్పాలి కదా, 'వచ్చేవారం'– అప్రయత్నంగానే అన్నాను.

"థాంక్యూ అంకుల్." అప్పటి వరకూ సార్ అన్న సంబోధన వొక్కసారిగా మారిపోయింది.

... ...

కాఫీ తాగి బయిలు దేర బోతుంటే కొరియర్ ఎదురొచ్చాడు. సంతకం చేయించుకుని కవర్ ఇచ్చాడు.

అది వందర్ విద్యా సంస్థ నుంచి వచ్చిందని పైన కవరే చెబుతూ వుంది.

బయిటకు వెళ్లవలసి వున్నా మానవ సహజమైన ఆసక్తికొద్ది తెరచాను.

హలో పేరెంట్.. అంటూ మొదలైంది. మా అమ్మాయి సంతకంతో వున్న ఒక ఫారమ్ కూడా దాంట్లో వుంది.

తాము మూడు మాసాల కిందట స్కూళ్లో నిర్వహించిన మెరిట్ టెస్టులో ర్యాంకులు సంపాదించినందుకు మా అమ్మాయికి అభినందనలు తెల్పుతూ అప్పుడు ఆమె దరఖాస్తు ప్రకారం తమ సంస్థలో చేరేందుకు ఆహ్వానిస్తున్నామని రాశారు. దరఖాస్తులో మా అమ్మాయి ఇచ్చిన వివరాల ప్రకారమే ఈ కవరు పంపించారు. తెను సైన్సు గ్రూపులో చేరాలనుకుంటున్నట్టు అందులో తనే రాసింది. దీనిపై తదుపరి సమాచారం ఫలానా తేదీలోగా పంపిస్తే గాని సీటు అట్టిపెట్టలేమని, తీవ్రమైన పోటీ వుందని గట్టిగా బెదిరిస్తూ మరీ రాశారు.

అప్లికేషన్ పెట్టింది తనే కనక తననే అడగడం మంచిది కదా?

"నేను ఇంకా నీతో వివరంగా చర్చించి నిర్ణయంచాలనుకున్నాను. నీవు ఇప్పటికే డిసైడ్ చేసుకుని ఒక సమస్య తగ్గించావు" అన్నాను.

డెసిషన్ ఏమిటి డాడీ అడిగింది? అమ్మాయి అదే, సైన్సు గ్రూపులో చేరతానని వాళ్లకు రాసిచ్చావు కదా?

"లైట్ తీసుకో. ఏదో స్కూలుకు వచ్చి అదే పనిగా రొద పెడుతుంటే ఏదో ఒకటి రాయాలి గనకరాశాను. పైగా ఆ రోజు వచ్చిన ఆ కాలేజీ ఏజంట్లు సైన్సు తీసుకోవడం మంచిదంటూ మాకు బ్రైన్ వాష్‌చేశారు. అంతేగాని నేనేం డిసైడ్ చేసుకుంటాను డాడీ?"

అయితే ఇంకా అనుకోలేదన్నమాట.

అబ్బే, లైట్ తీసుకో. అయినా వాళ్లు అందరికీ అలాగే చెబుతుంటారు. మా క్లాసులో పూర మొద్దులకు కూడా మెరిట్ వచ్చిందంటున్నారు. ఎలాగైనా చేర్చుకోవాలని అన్నీ ప్లాన్లు.

బాగా చెప్పావ్. ఇంతకూ నీవేం చేయాలనుకుంటున్నావ్?

అదేమిటి డాడీ నన్నడుగుతారు? మీరు ఎందులో చేరమంటే అందులో చేరతాను.

చూడుతల్లీ. చదవాల్సిన దానివి నీవు. నీకు ఎందులో ఇంట్రస్టో చెప్పకుండా నన్ను చెప్పమంటావే?

అసలే అందరూ అదీ ఇదీ చెప్పి అర్థం కాక చస్తుంటే నీవు కూడా ఏమిటి డాడీ? ఇంతవరకూ అన్నీ నన్నడిగే చేర్చావా?

అప్పుడంటే చిన్నపిల్లవు. ఇప్పుడు టెంత్ క్లాస్ అయిపోతుంటే కూడా ఆలాగే మాట్లాడితే ఎలా

టెం.. త్... క్లా... స్.. పేద్ద గోప్ప.. ఎవరితో మాట్లాడినా..ఎక్కడ మాట్లాడినా ఇదే గోల గొడవ.. టెంత్ క్లాస్, టర్నింగ్ పాయింట్ అంటూ లెక్చర్లు. అన్నయ్య అందుకే అన్నాడ్లే..

ఏమన్నాడేమిటి?

ఈ పెద్దవాళ్లు ఎప్పటికప్పుడు టర్నింగ్ పాయింట్ అంటూనే వుంటారు. టెంత్ క్లాస్ .. తర్వాత ఇంటర్.. తర్వాత ఎంసెట్..

తర్వాత ఇంజనీరింగ్ ఆర్ మెడిసిన్ .. ఆఫ్టర్ దట్ పీజీలు, ఫారిన్లు ఇలా ఎప్పుడూ పరిగెత్తిస్తూనే వుంటారని వాడు బాగా చెప్పాడు..

చెప్పాడ్లే గొప్ప. నీ సంగతేదో నీవు చెప్పు. మీ ఫ్రెండ్స్ ఏమంటున్నారేమిటి?

ఇది ఇంకో ఫార్సు. మమ్ముల్నూ మా ఫ్రెండ్సునూ ఎప్పుడూ తిడుతూనే వుంటారు. వాళ్లవల్ల టైం వేస్టంటారు. మా ఫ్రెండ్సు చెప్పారని చెబితే తీసిపారేస్తారు. కాని మీరు ఏదైనా డిసైడ్ చేయాలంటే మాత్రం పావని ఏమంది, శివానీ ఏమంది అంటూ ఆరాలు తీస్తారు. వాళ్లగొడవ నీకెందుకు, నీవేం అనుకుంటున్నావో చెప్పు. చాలు.

కాదమ్మా... ఇప్పుడు సైన్సు, మ్యాథ్సా ఏది తీసుకోవాలనుకుంటున్నావో తెలియాలి కదా

ఔను కదా. వెలుగూ చీకటి తెలుపూ నలుపూ పొట్టి పొడవూ ఇలా అన్నిటినీ రెండుగా డివైడ్ చేసినట్లు మీరు చదువును మా భవిష్యత్తునూ సైన్సూ మ్యాథ్సూ అని తేల్చేశారు డాడీ..



అబ్బే అలాటిదేం లేదు. ఈ విషయంలో నీకు నిజంగానే పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలనుకుంటున్నాను. నీవు ఏది చదువుతానంటే అది చదవొచ్చు, నిరభ్యంతరంగా.. సైన్సు మ్యాథ్స్ వద్దంటే ఏం చదువుతావు చెప్పు? హిస్టరీ ఎకనామిక్స్, ఏదైనా సరే,

తెలుగు ఇంగ్లీషు వంటి లాంగ్వేజెస్ చదవాలని వుంది.

కాని ఇంటర్ లెవల్లో వాటికి వేరే అవకాశం లేదు కదా?

అదే మరి తేల్చుకోలేక చస్తున్నా. నేనే కాదు. మా ఫ్రెండ్సు కూడా. మాకేమో లెక్కలంటే ఇష్టం లేదు. బాగా రావు కూడా. సైన్సు అంటే అందులోనూ ఫిజిక్స్‌లో లెక్కలు వుంటాయి. పైగా మెడికల్ సీట్లు మనవంటివారికి రావడం అసంభవం. లేదంటే ఏ కంప్యూటర్ సైన్సో, అగ్రికల్చరల్‌సైన్సో ఫార్మసీ కోర్సో చదవాలి. కాని మా సైన్సు సిలబస్,టీచింగ్ అన్నీ ఎంసెట్ యాంగిల్‌లోనే నడుస్తాయి. అక్కడంతా టాపర్సు గురించి తప్ప మా లాటి వాళ్లను పట్టించుకోరంట.. సీటు రాని వాళ్ల కథలు వినీ వినీ భయం పట్టుకుంది... ఇంకా ఈ కాలేజీల వాళ్లు రోజూ వెంటపడి ఏదో ఒకటి చెబుతుంటారు. ఇవన్నీ ఆలోచిస్తుంటే పిచ్చెక్కి పోతుంది. పరీక్షలపైన కూడా పూర్తిగా ధ్యాస పెట్టలేననిపిస్తోంది. ప్లీజ్, నన్నొదిలేయండి. మీరే ఏదో ఒకటి డిసైడ్ చేయండి. మాట్లాడకుండా చేరిపోతాను.

దాని గోడు విని మనసు కరిగిపోయింది. ఏదైనా చెబుదామనుకుంటుండగానే ఇద్దరు కుర్రాళ్లు వచ్చారు– ఫైళ్లుపట్టుకుని. రాగానే టేప్ మొదలెట్టారు.

మేము సముద్ర నుంచి వచ్చాం సార్. మీ అమ్మాయికి ప్రీ ఫైనల్లో ఎనభై అయిదు పర్సెంటు వచ్చాయంట.

నిజంగా మాకే తెలియదు. ఇంకా పేపర్లు ఇవ్వలేదు. ఆ మాటే అన్నాను.

లేదండీ.. మాకు ప్రిన్సిపాల్ గారే పంపించారు. దాన్నిబట్టి వచ్చాం. మా దగ్గర ఒక స్కీము వుందండీ. మీరిప్పుడు అయిదు వందలు పే చేసి రిజిస్టరు చేసుకుంటే తర్వాత ఫీలో కన్షెషన్ వుంటుంది. ఇప్పుడు చేసుకోకపోతే తర్వాత మార్కులు ఎక్కువ వచ్చినా ఫీజు తగ్గింపు గ్యారంటీ లేదు.

చూద్దాం లెండి.

కాద్సార్. ఇప్పుడు మా దగ్గర ఫైవ్ హండ్రడ్ కట్టేస్తే సంతకం చేసి మీకు ఒక రిసిప్ట్ ఇస్తామన్నమాట. మాకు కూడా ఇంతమంది చేరతారన్న గ్యారంటీ వుంటుంది. చేర్చినందుకు మాకు కూడా ఇన్సెంటివ్ ఇస్తారు.

మీరు ఏం చేస్తుంటారు.

నేను మ్యాథ్స్ లెక్చరర్‌నండీ. రేపు మీ అమ్మాయి గనక మ్యాథ్స్ తీసుకుంటే చెప్పేది నేనే. ఇప్పుడే చేరితే మాకో ఐడియా వుంటుంది.

కానీ మాకు సైన్సు ఐడియా వుంది.

నో ప్రాబ్లమ్ సర్. సైన్స్ చెప్పేది కూడా నా కొలిగే.అతనికి నెంబర్ ఇచ్చి కలవమంటాను. మీ నెంబరు ఎంత సార్?

అబ్బే ఎందుకు లెండి..

మీకేం ఇబ్బంది వుండదు సార్. మాకు పోయిన సారి మంచి పర్సంటేజి వచ్చింది. మా ద్వారా చేరితే మాకూ మంచిదని ఇంత ఇదిగా చెబుతున్నాం.. చెప్పండి.. రాయమంటారా?

వద్దులెండి. నేను కాంటాక్టు చేస్తాను.

అయిదు వందలే కద సార్?

దాని గురించి కాదు.. నేను ఆలోచించాలి కదా.. అయినా తర్వాత కూడా చేర్చుకుంటారు కదా?

కాని చెప్పాను కద్సార్, ఇప్పుడు రిజిస్టర్ చేసుకుంటే...

'పర్వాలేదు లెండి' అతని మాట పూర్తవకుండానే చెప్పాను.

అతను నిరుత్సాహంగా కదిలాడు. ఆశాభంగం స్పష్టంగా కన్పిస్తోంది. నాకూ ఇబ్బందిగానే వుంది.కాని ఏం చేస్తాం?

... ...

"ఎదురింటి వాళ్లమ్మాయి స్వర్ణలో చేరిందట." మా ఆవిడ మాటలు దేనికో ఉపోద్ఘాతంలా వున్నాయి.

ఆహా అన్నాను.. మొగ్గలోనే తుంచెయ్యాలని. పేపర్‌లో పెద్ద విశేషాలేమీ లేకున్నా దాంట్లో మునిగిపోయినట్టు నటిస్తూ..

పేపర్ చదివింది చాలు గాని చెప్పేది వినండి. మళ్లీ ఎవరిదారిన వాళ్లం పరుగులు పెట్టడమే కదా!

సరే చెప్పు.

మా ఆఫీసులో, మన వీధిలో కూడా అందరూ ముందే త్వర త్వరగా పిల్లలను ఎక్కడో ఒక చోట చేర్చేస్తున్నారు. క్లాసులు

→

## లేట్

# మల్లంపల్లి శరభయ్య కన్నుమూత

ప్రముఖ కవి, సాహితీవేత్త, ప్రాచీన కవితాధ్యయనంలో దిట్ట మల్లంపల్లి శరభయ్య (79) ఏప్రిల్ 13న రాజమండ్రిలో తుది శ్వాస విడిచారు. కృష్ణాజిల్లా ఎలకుర్రులో జన్మించిన శరభయ్య మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో తెలుగు పండితునిగా దశాబ్దకాలం పాటు పనిచేశారు. అనేక సంస్కృతాంధ్ర గ్రంథాలను పరిష్కరించారు. తర్వాత రాజమండ్రిలో సంస్కృత అధ్యాపకుడిగా, సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 1990 నుంచి రెండేళ్ళపాటు తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంలో గౌరవ అచార్యునిగా సేవ లందించారు. ఆయన రచించిన అనేక కవితా ఖండితాలు భారతి, ఆంధ్రప్రతిక తదితర వాటిలో 'పావని' కలం పేరుతో ప్రచురిత మయ్యాయి. ఆయన మృతికి పలువురు సాహితీవేత్తలు సంతాపం ప్రకటించారు.

# కొమ్మినేని వాసుదేవరావు మృతి

ప్రముఖ పాత్రికేయులు, సాహితీ మిత్రులు కొమ్మినేని వాసుదేవరావు ఏప్రిల్ 11న మరణించారు. ఆయన వయస్సు 66 ఏళ్లు. ప్రకాశం జిల్లా కంభంపాడుకు చెందిన వాసుదేవరావు 'ఆంధ్రజ్యోతి' దిన పత్రికలో పాత్రికేయునిగా వృత్తి జీవితం ప్రారంభించి 'ఈనాడు' దినపత్రికలో తొలి న్యూస్ ఎడిటర్‌గా పనిచేశారు. ఉదయం, ఆంధ్రప్రభ, సుప్రభాతం, మాభూమి, ఆంధ్రప్రభ వారపత్రిక వగైరాలలో ముఖ్య బాధ్యతలు నిర్వర్తించారు. పలు సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు, రాసారు. ఆయన మృతికి ప్రస్థానం సంతాపం ప్రకటించింది. మరణవార్త తెలియగానే వాసుదేవరావు నివాసానికి అధికార భాషా సంఘం అధ్యక్షుడు ఎ.బి.కె. ప్రసాద్, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. రామచంద్రమూర్తి, ఆంధ్రప్రభ మాజీ ఎడిటర్ వాసుదేవ దీక్షితులు, సీనియర్ పాత్రికేయులు, రచయితలు వెళ్లి నివాళులర్పించారు.

---

→

కూడా వెంటనే మొదలైపోతాయి. ఇప్పటికే మీ చాదస్తంతో అన్నీపేరబెట్టి పిల్లల చదువులు పాడు చేసుకున్నాం.. ఇప్పుడైనా హుషారుగా వుంటేనే వాళ్లు కాస్త బతికి బట్టకట్టేది..

మా ఆవిడ మాటలెప్పుడూ అలానే వుంటాయి. అమెరికాలా తనే పోలీసు, జడ్జీ, తలారీ అన్నీ తనే. పిల్లల చదువులు పాడై పోయాయాని ఆమె నిర్ధారణతో విభేదించే ఛాన్సు ఎక్కడుంటుంది?

ఇంత ముందుగా వాటి గురించి మాట్లాడుకుని లాభమేమిటి?

నేను చెప్పేది కూడా భవిష్యత్తుగురించే. వెంటనే ఏదో ఒకటి అనుకోవాలి. మా కొలీగ్స్ పిల్లలతో పాటు స్వర్ణలో చేర్చేస్తే సరిపోతుంది. కాని ఫోన్ చేసిన నవీన, కొరియర్ పంపిన వండర్ వీటి విషయం.

ఏం చేయాలి.

అదే చెప్పేది. మీరూ మీ అయోమయమూ. ముందు జాగ్రత్త వుండదాయె. తీరా గొంతు మీదకొచ్చాక ఏం చేయాలో తోచక తలకిందులు కావడం..

అంత సమస్య ఏమొచ్చింది? ఇంకా అమ్మాయి పరీక్షలే మొదలవలేదు?

అదే వద్దనేది. పరీక్షలు రిజల్ట్సు అనుకుంటూ కూచునే రోజులా ఇవి? ఏడో క్లాసు నుంచే ఎంట్రన్సులు నేర్పిస్తుంటే మీలాగా మీన మేషాలు లెక్క పెట్టుకుంటూ కూచుంటారా?

బాగానే వుంది. మధ్యలో నేనేంచేయాలి?

నాకు ఇంత పలుకుబడి, వాళ్లు తెలుసు,వీళ్లు తెలుసు అంటూ పెద్ద ఫోజులు పెడుతుంటారుగా, మీరేం చేస్తారో నాకు తెలియదు. అమ్మాయి ఆఖరి పరీక్ష అయిపోయేలోగా ఎక్కడ ఎందులో చేర్చాలో తేల్చాయాలి. మీ తాత్సారాలు నాకు నచ్చవ్.

అదేమిటె నీవేగా అమ్మాయి అహోరాత్రులు చదువుతో అల్లాడిపోతుంది..కాస్తయినా విశ్రాంతినివ్వాలి అన్నావు..

మీ సామాజిక సందేశాలు వినీ వినీ బుద్ధిగడ్డితిని అన్నాను. తప్పే.ఇప్పుడు చెబుతున్నాగా వినండి. నలుగురితో పాటు నారాయణ పదిమందితో పాటు గోవింద. అందరూ ఎలా వుంటే మనమూ అంతే.

సరే, చూద్దాం.

చూద్దామంటే కుదరదు. చేయాల్సిందే.

ఒకే ఒకే

... ...

హలో మేము నవీన నుంచి మాట్లాడుతున్నామండీ, అమ్మాయి విషయం ఎందులో చేర్చాలనుకున్నార్ సార్?

ఏదో ఒకటి అనుకున్నాం. నీకెందుకు చెప్పాలి?

అదేంటి సార్, అలా మాట్లాడతారు; మీ మేలు కోసమే కదా చెప్పేది..

ఔనమ్మా మా మేలు కోసమే మీరు బిల్డింగులు కట్టుకుని టెలిఫోన్లు పెట్టుకుని ప్రాణాలు తోడేస్తున్నారు. పరీక్షలు ముగియకముందే క్లాసులు మొదలుపెట్టడం, రుబ్బురోలులో వేసి తిప్పినట్టు వాళ్లను సతాయించడం ఇవన్నీ నాకిష్టం లేదు.

సతాయించడమేమిటండీ, తమాషాగా మాట్లాడుతున్నారు. మా ఇన్‌స్టూట్ గురించి తెలిసే మాట్లాడుతున్నారా?

ఆ. అన్నీ తెలిసే చెబుతున్నాను. విద్యా వ్యాపారం కోసం చదువును సరుకుగా మార్చేసి జనాన్ని హడలగొట్టకండి. విజ్ఞానంతో వికసించాల్సిన రేపటి తరాన్ని ఖైదులో వేసి ర్యాంకుల రాక్షసులుగా మార్చకండి..

నాలో నుంచి తన్నుకుని వస్తున్న ఈ మాటలు నాలోనే మింగేశాను. ఒకటి– ఆ ఫోన్‌చేసే అమ్మాయికి ఇవన్నీ చెప్పడం దండగ. రెండోది– పక్కనే మా ఆవిడ మింగేసేలా చూస్తున్నది. అందుకే ఎంతో తెలివిగా–

నువ్వే మాట్లాడు అని ఆమెకు ఇచ్చి తప్పుకున్నాను.

H

## పరిచయం

# మహాకవిపై మలిన ప్రచారం చరిత్రలో చెరగని కళంకం




**పండితారాధ్యులు అజ్ఞాతంగా రాసిన ఉత్తరం కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి రచయితలను పురికొల్పడానికేనని నందూరి రామమోహనరావు విమర్శించారు. "లూయీ ఆరగాన్, హోవర్డ్‌ఫాస్ట్, పాబ్లోనెరూడా వంటి ప్రఖ్యాత రచయితలూ, పికాసో వంటి చిత్రకారులూ, పాల్ రాబ్సన్ వంటి గాయకుడూ బెర్నాల్ వంటి శాస్త్రజ్ఞుడూ, డీన్ ఆఫ్ కాంటర్బరీ వంటి క్రైస్తవ మతాధికారీ కమ్యూనిస్టు అనుకూల ప్రచారం చేస్తుండగా వారినెందుకు అనుసరించకూడదో బోధపడటంలేదు." అని పేర్కొన్నారు**

**తెలకపల్లి రవి**

సాహిత్యకారులు రాజకీయాలకు అతీతంగా వుండాలనే మాట తరచూ వినిపిస్తుంటుంది. కాని కీలక సమయాల్లో రాజకీయ ప్రయోజనాల కోసం సాహిత్యకారులపై విషపు దాడి చేసేందుకు వెనుకాడని వైనం 'దొంగదాడి కథ'. ఈ పుస్తకాన్ని విజయవాడ సాహితీ మిత్రుల పక్షాన విశ్వేశ్వర రావు ప్రచురించారు. ఇందుకోసం ఆయన ఎంతో శ్రమకోర్చి ఆనాటి పత్రికల జిరాక్సులు తీయించారు. వాటిని పలువురు రచయితలకూ, పాత్రికేయులకూ చూపించారు. వాటిని చదివినవారెవరికైనా కాంగ్రెస్ నాయకులూ, వారి అనుకూల పత్రికా సంపాదకులూ ఆ నాడు ఎంత దారుణంగా వ్యవహరించారో అర్ధంకాకమానదు. మొత్తం భారతదేశం గర్వించదగిన మహాకవి, నాటికీ నేటికీ సాటిలేని సుప్రసిద్ధుడు శ్రీశ్రీ. కేవలం కమ్యూనిస్టు అభిమాని అయిన పాపానికి, విషప్రచారాల మధ్య కూడా కమ్యూనిస్టులతో నిలబడిన నేరానికి ఆయన ఇంత దాడికి గురికావలసి వచ్చింది. దాన్ని తట్టుకోలేక చివరకు ఆయన మతి స్తిమితం తప్పింది కూడా. ఇదంతా ఎందుకు జరిగిందో తెలియాలంటే ఈ పుస్తకం చదవాల్సిందే.

ప్రచురణ కర్త సంకల్పాన్ని వివరిస్తూ విశ్వేశ్వరరావు ఇలా రాశారు: "....యావన్మంది పత్రికాధిపతులూ, పత్రికా సంపాదకులూ, యావన్మంది మేధావులూ, రచయితలూ ఒక పక్కైతే ఒక్కడే ఒకపక్క నిలిచి మత్స్య యంత్రాన్ని ఛేదించిన అక్షరార్జునుడు. ప్రతిభావంతుల్లో ఔన్నత్యాల సరసనే కలలో కూడా క్షమించలేని బలహీనతలూ వుంటాయి. అయితే పురుషుల్లో పుణ్యపురుషు లన్నట్టు ఒక్కరే యుగకర్తగా నిలుస్తారు. అతనిలో నిబద్దత, దార్శనికత, ప్రలోభాలను దరికి రానీని మొండి తనం, నేను తెల్లారినా జనం బ్రతుకు తెల్లారరాదనే అసాధారణ అభ్యుదయ కాంక్ష ఆ ఒక్కరికే కిరీటం పెడతాయి. ఆ ఒక్కరే మకుటాయ మానంగా నిలుస్తారు' అంటూ ఆ కాలంలో శ్రీశ్రీ నిర్వహించిన పాత్రకు నివాళు లర్పించారు. ఆయనపై అంతగా దాడి సాగడానికి కారణమూ అదే. ఎన్.అంజయ్య, సహవాసి, కె.ఎన్‌వై పతంజలి, మోహన్, చలసాని ప్రసాద్‌లు తమ ముందుమాటలు రాశారు.

"ఆంధ్ర రచయితల గురుతర బాధ్యత" అంటూ ఆంధ్ర పత్రికలో వచ్చిన వ్యాసం దీనంతటికీ తెరలేపింది. ఈ పుస్తకమూ ఆ వ్యాసంతోనే మొదలవుతుంది. రాజకీయ దురుద్దేశంతో రచయితలను రెచ్చగొడుతూ రాయడంలోనే పెద్ద కుట్ర వుంది. పైగా ఒక రచయిత అంటూ ఆ రాసింది కూడా పత్రిక సంపాదకుడు పండితారాధ్యుల నాగేశ్వరరావు గారే కావడం ఇంకో విపరీతం. సంపాదకుడే అసలు పేరుమీద, కలంపేరు మీద కాక ఆకాశరామన్న వ్యాసం రాయడం. తన భావాలు జనం మెచ్చరనే భయం ఆయనను ఎంతగా వెన్నాడుతున్నదీ దీన్నిబట్టే విదితం. రచయితల గురుతర బాధ్యత అని మొదలు పెట్టిన పెద్దమనిషి తొలి వాక్యాల్లోనే ఎన్నికలలోకి దిగారు. .... మరో మాసం రోజులలో మనకు ఎన్నికలు వస్తున్నవి. మూడు రాజకీయ పక్షాలు వాటి ఎన్నికల ప్రణాళికలను ప్రకటించినవి. వాటిలో చాలా ఆకర్షవంతంగా వున్నది కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల ప్రణాళిక అంటూ అందులో సోషలిజానికి అనుకూలంగా రాసిన మాటలపై యుద్ధం ప్రకటించారు. అదే సందర్భంలో మాస్కో విశ్వవిద్యాలయం చాలా గొప్పగావున్నదని అలాటిది మన దేశంలో ఒక్కటైనా లేదని శ్రీశ్రీ ఎవరో అభ్యుదయ కవితో అన్నారంటూ వాటిచుట్టూ దాడిని తిప్పారు. ఇంతకూ ఆ కవి ఎవరో ఎప్పుడు ఈయన అన్నాడో కూడా లేదు. ఆ విశ్వవిద్యాలయ భవనం కమ్యూనిస్టులు అధికారంలోకి రాకముందు 1775లో కట్టారని గొప్ప పరిశోధనాత్మకంగా ప్రకటించారు. తర్వాత ఆ రచయిత అభ్యుదయ కవులపై దాడికి దిగారు. వారు ప్రేమభావం, నవ్యత అధిగమించిన లేదా వదలివేసిన వారని తిట్టిపోశాడు. కమ్యూనిజమంటేనే నియంతృత్వమనీ, దానిపై పోరాటంలో తామెక్కడో ఆంధ్ర రచయితలు తేల్చుకోవాలని సవాలు విసిరారు. పాశ్చాత్య దేశాలలో కమ్యూనిస్టులుగా వుండి ప్లేటు ఫిరాయించిన స్పెండర్, కోస్లర్, జైడ్ వంటివారిని ఉదహరించి ఆ బాట పట్టాలని, ఆంధ్ర రచయితలకిది పరీక్షా సమయమని దుర్బోధలు గుప్పించారు.

శ్రీశ్రీ దీనికి స్పందిస్తూ లేఖ పంపించారు. తాను చెప్పింది 1775లో కట్టబడిన భవనం

**కమ్యూనిస్టు వ్యతిరేక రచయితలపై శ్రీశ్రీ కవితా బాణం**



ఏవి తల్లీ నిరుడు మురిసిన
ఇనుపరచయితలు
కృష్ణశాస్త్రపుటుష్ట్రపక్షీ
దారితప్పిన నారిబాబూ
ఫ్రైజు ఫైటరు పాపరాజు
పలకరెంచేత?

ప్రజాస్వామ్యపు పెళ్లికోసం
పండితారాధ్యుడాడిన
వందకల్లల పందిపిల్లల
ఆంధ్ర పత్రిక ఎక్కడమ్మా?

అరె యార్ ఇదర్ ఆవో దేఖో
ఆంధ్రుల దినపత్రిక
పెట్టుబడికి కట్టుకథకి
పుట్టిన విష పుత్రిక

గురించి కాదంటూ ఫోటో కూడా జతచేశారు. రష్యా ప్రజలు రెండు మహాయుద్ధా లలో అపార త్యాగాలు చేశారనీ, మన దేశంలో విశాఖ పట్టణంలో బాంబులు పడితే ఢిల్లీ దాకా పరిగెత్తే ప్రజలున్నారనీ ఆ లేఖలో రాశాడు. "నలభై సంవత్సరాలుగా సోవియట్ వ్యతిరేక సాహిత్యం చదివి ఈనాడు ప్రజాస్వామ్యమనీ, వ్యక్తిస్వాతంత్రమనీ పెద్ద కబుర్లు చెప్పే వారితో వాగ్వివాదానికి దిగడానికి నాకు సావకాశమూ లేదు, సంతోషమూ లేదు.... అనారోగ్యం (మానసికమూ, శారీరకమూ) అది నేటి భారత దేశానికి మారు పేరు. నెహ్రూ చిట్కాలు నేటి తీవ్ర రుగ్మతను తగ్గించలేవు'....... అంటూ...'కళ్లులేని కబోది పత్రికలు కావలసి నన్ని అబద్దాలు సరఫరాచేస్తున్నాయి' అని కుండబద్దలు కొట్టాడు. ఈ లేఖ తర్వాత ఒక రచయిత పేరుతో సంపాదకుడే సంపాదక లేఖ రాశారు. అనేకానేక చవకబారు వ్యాఖ్యలు చేస్తూ....ఇంకా ఇలా రాశాడు "తాము కమ్యూనిస్టుసాహిత్యాన్ని చారు తాగినట్టు తాగివేశామనీ, మేము కమ్యూనిస్టు వ్యతిరేక సాహిత్యాన్నినలభై సంవత్సరాలుగా జీర్ణించుకు న్నామనీ

— — — — — * * * — — — — —

**ఆంధ్రప్రభలో 1955 ఫిబ్రవరి 7న "ప్రజాస్వామ్య చైతన్య శక్తులతో సహకారానికై తెలుగు ప్రజానీకానికి రచయితల కళాకారుల ప్రబోధం. నియంతృత్వ వ్యవస్థ భారతీయాత్మకు విరుద్ధమైనదని ఉద్ఘాటన-' అంటూ నూటయాభై మంది రచయితల పేర్లతో ప్రకటన వెలువడింది.**

— — — — — * * * — — — — —

శ్రీరంగం శ్రీనివాసరావు గారు వాపో యారు. దీన్ని తెలిసీ తెలియని అఘోరింపు అనడం కంటే చేయగలిగింది లేదు...... విషయాలను విచక్షణా జ్ఞానంతో విచారించి రాసేవాళ్లం మేము. కవినని చెప్పుకు కాలక్షేపం చేసేవారు శ్రీరంగం శ్రీనివాసరావుగారు.. ఇప్పటికైనా నినాదాలపై పదాలల్లి కవిత్వమని కదం తొక్కడం మాని మనం ఏం చేస్తే అ ఘనకార్యం అనే మనస్తత్వాన్నివిసర్జించి .. ఇప్పటికైనా మార్క్సిజం లెనినిజం గురించి చదివి నేటి మిడిమిడి జ్ఞానం నుంచి బయిట పడ్డానికి ప్రయత్నించడం వారికీ, వారి మరో ప్రపంచానికీ మంచిది. వున్న కొద్ది పాటి పరిజ్ఞా నాన్ని అందుకు వినియోగించడం క్షేమం." ఇలా సాగింది ఆ ఉత్తరం.

ఇక ఆ తర్వాతి ఉత్తరం అప్పటి ఆంధ్ర పత్రిక ఉపసంపాదకులూ, ఉత్తరోత్తరా ప్రసిద్ధులూ అయిన నండూరి రామమోహన రావు 'ఒకానొక రచయిత' పేరుతో రాసింది. పండితారాధ్యులు అజ్ఞాతంగా రాసిన ఉత్తరం కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి రచయితలను పురికొల్ప డానికేనని ఆయన ఆ లేఖలో స్పష్టంగా విమర్శించారు. "లూయీ అరగాన్, హోవర్డ్ ఫాస్ట్, పాబ్లోనెరూడా వంటి ప్రఖ్యాత రచయి తలూ, పికాసో వంటి చిత్రకారులూ, పాల్ రాబ్సన్ వంటి గాయకుడూ బెర్నాల్ వంటి శాస్త్రజ్ఞుడూ, డీన్ ఆఫ్ కాంటర్బరీ వంటి క్రైస్తవ మతాధికారీ కమ్యూనిస్టు అనుకూల ప్రచారం చేస్తుండగా వారినెందుకు అనుసరించకూడదో (అంతకంటే) బోధపడటంలేదు. స్పెండర్ ప్రభృతులు ఒకప్పుడు కమ్యూనిజంపై మోజుపడిన వారే. ముందు మోజుపడి తర్వాత మతిభ్రమణ కలిగి మతం మార్చుకున్నవారు అప్పుడూ ఇప్పుడూ వున్నారు. ఇకముందు కూడా వుంటారు. అంతమాత్రం చేత కమ్యూ నిజంలో ఆకర్షణశక్తి తగ్గదనుకుంటాను' అని విశ్వాసం వెలిబుచ్చారు. ప్రగతిశీలమైన శక్తులకే దోహదం చేయడం రచయితల కర్తవ్యమని కూడా ఆయన రాశారు.

ఈ ఉత్తరం తర్వాత వరుసగా వందకు పైగా ఉత్తరాలు ఆంధ్రపత్రిక ప్రచు రించింది. వీటన్నిటిలోనూ కమ్యూనిస్టు వ్యతిరేకత, శ్రీశ్రీపై ద్వేషం పరాకాష్టకు చేరడం చూస్తాం. వాస్తవానికి అదొక పెద్ద పథకం ప్రకారం నడిచింది. అందులోనూ అనేక లేఖల రచయితల పేర్లు కల్పితమైనవిగా తెలిసి పోతుంది. భారతీయాత్మ వగైరా పదజాలంతో అభివృద్ధి నిరోధకతను నెత్తినెత్తుకున్న అనేకమంది లేఖలు గుప్పించారు. అందులో కొందరు ఇప్పటికీ కాషాయ శ్రేణులలోదర్శనమిస్తూనే వున్నారు.

ఇక ఆంధ్రప్రభ విషయానికి వస్తే 1955 ఫిబ్రవరి 7న "ప్రజాస్వామ్య చైతన్య శక్తులతో సహకారానికై తెలుగు ప్రజానీకానికి రచయితల కళాకారుల ప్రబోధం. నియంతృత్వ వ్యవస్థ భారతీయాత్మకు విరుద్ధమైనదని ఉద్ఘాటన-' అంటూ నూటయాభై మంది రచయితల పేర్లతో ప్రకటన వెలువడింది. అభ్యుదయ, అభివృద్ధి నిరోధక తేడాలు లేకుండా ప్రసిద్ధులైనవారందరి పేర్లూ ఇందులో దర్శన మిస్తాయి. వీరందరికీ సమన్వయ కర్తలుగా శ్రీరంగం నారాయణబాబు, పాలగుమ్మి పద్మ రాజులు వ్యవహ రించారు. ఆ మరుసటి రోజున మరో యాభై మంది రచయితల పేర్లు వెలు వడ్డాయి. వారిలో ఒక్క ఆరుద్ర మాత్రం తాను దానిపై సంతకం చేయలేదని రాశారు. ఈ ప్రతిని తనకిచ్చినపుడు రచయితల సమా వేశంలో చర్చించి నిర్ణయించాలని చెప్పానని పేర్కొన్నారు. తర్వాత ఆరుద్ర లేఖను ఖండిస్తూ మరి కొన్ని లేఖలు, దాన్ని సమర్థించు కుంటూ ఆయన రాసిన మరింత వివరమైన సమాధానం వున్నాయి. చివరకు 576మంది రచయితలు తమను బలపరుస్తున్నట్టు ప్రకటించుకున్నారు.



## శ్రీశ్రీ 'ప్రజ'

అప్పట్లో శ్రీశ్రీ తనకు తనే ప్రశ్నలు వేసుకుని జవాబులిచ్చాడు. వాటిలో ఆయన భావాలు స్పష్టమవుతాయి. అప్పుడే ప్రజ అన్న పదం పుట్టించాడు. అందులో కొన్ని :

H రైళ్లుతప్పిపోవడానికి కారణమేమిటి?
అన్ని రైళ్లూ కాంగ్రెస్ వారి గుండెల్లో పరుగెత్తుతున్నాయి కాబట్టి.
H రచయితల బాధ్యత?
బాధ్యత కాదు, వహించవలసిన పాత్ర
H ఏ రంగాలలో ?
తురంగాలలో, సురంగాలలో కురంగాలపై మృదంగాలుగా.
H ఎర్రజండా ఎవరికి చిహ్నం?
ఈనాటి పీడిత మానవుడికి.
H నీ మీద రాళ్లు విసిరితే?
గాయాలను కానుకలుగా అంగీకరించి కాయమున్నంత కాలమూ గర్విస్తాను.
H నార్లవెంకటేశ్వరరావు గురించి నీ అభిప్రాయం?
మరో ప్రశ్న అడుగు.
యూ బ్లడీ కమ్యూనిస్ట్! థాంక్యూ! మెర్సీబకూ! స్పసీబో బల్షోయ్
H ఈ పువ్వు ఎలా వికసిస్తుంది?
సూర్యుడుదయిస్తే.
H ఏ సూర్యుడు?
కమ్యూనిస్టు సూర్యుడు
H ఎటునుంచి?
తూర్పు నుంచి.
H ఇప్పుడొప్పుకోనా?
ఒప్పుకో లేదా తప్పుకో

**(24.1.54)**



## మృత్యువుతో నా మూడో యుద్ధం : శ్రీశ్రీ

"మొదటి సారి విదేశీ యాత్ర ముగించుకుని స్వర్గాదపీ గరీయసీ అని జన్మభూమి మీద కాలుపెట్టానో లేదో అన్ని దిక్కుల నుంచీ ఆంధ్రదేశం నామీద దండయాత్ర సాగించింది. అవి 1955 ఎలక్షన్ రోజులు. నేను కమ్యూనిస్టుపార్టీ తరఫున ప్రచారానికి బయిలు దేరాను. ప్రజాస్వామ్యం పేరుతో ధనస్వామ్యానికి వూడిగంచేసే పెట్టుబడిదారీ పత్రికలన్నీ తమ విద్వేషాగ్నిని నాపై కేంద్రీకరించాయి. ఒక్క విశాలాంధ్ర మాత్రమే నన్నుతొలినుంచీ సమర్థిస్తూ వచ్చింది. ఈ కాగితాల యుద్ధంలో కురుక్షేత్రాన అభిమన్యుడిలా పోరాడిన నార్లచిరంజీవిని నేను మర్చిపోలేను. హేతువాదానికి మూఢవిశ్వాసానికి జరిగిన సంకుల సమరంలా నేను పరిగణిస్తాను ఆ ఎన్నికల సంరంభాన్ని! నేను కుక్క చావుచస్తానని ఒక అమ్మాయి రాసిన ఉత్తరం కూడా ఈ సందర్భంలో ప్రచురణ గౌరవం పొందింది. తర్వాత ఆమెనెవరో అడిగారట, అలా ఎందుకు రాశావాని. శ్రీశ్రీని తిడితే పత్రికలో తన పేరు పడుతుందని అంతేగాని నేనెవరో ఆమెకు ముక్కూ మొగమూ తెలియదట....

ఈ గాలి దుమారాల మధ్య ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్నప్పుడు నాకు మతి భ్రమించి పోయింది.

గూడూరు రైల్వే స్టేషన్ ఎదుట మైదానంలో ఎన్నికలసభ ఇక ప్రారంభమవుతుందనగా వెనక వైపు నుంచి రాళ్లు రువ్వడం మొదలైంది. సభా వేదికపై నుంచి పుచ్చలపల్లి సుందరయ్యగారు పోలీసులకు తీవ్రమైన హెచ్చరిక చేశారు. 'శాసన సభలో ప్రతిపక్ష నాయకుడినైన నేను పోలీసులు వెంటనే కలుగజేసుకోవలసిందని అడుగుతున్నాను. అది వారికి చేతకాకపోయినా లేక ఇష్టం లేకపోయినా మా పార్టీ వాలంటీర్లే అదుపులో పెట్టవలసి వస్తుంది అని! అంతటితో రాళ్లు పడటం ఆగిపోయింది. సభ సాఫీగా జరిగిపోయింది. 'పాతిక సంవత్సరాల నుంచి ఎప్పుడూ సీరియస్‌గావుండే సుందరయ్యగారి ముఖంలో ఎన్నికల ఫలితాల సూర్యోదయంతో చిరునవ్వులు వికసిస్తాయి' అని ఆయనచేత నవ్వించాను. సభ పూర్తికావడానికి ముందు వెనకతట్టును కాపాడుతున్న వాలంటీర్లలో ఒకరి తలను పగలగొట్టడంజరిగింది. రక్తం కారుతున్న ఆ యువకుని తలకు కట్టుకట్టడం చూశాను. గాంధీగారి అహింసా భావాలకు అలవాటు పడిన నా మనసు ఈ కఠోర దృశ్యాన్ని సహించలేకపోయింది. ఆ నిముషం నుంచే ప్రారంభమైంది నాలోని చిత్త చాంచల్యం..."

విజయవాడ నుంచి నన్ను ఎలాగ మద్రాసు చేర్పించారో నాకు తెలియదు. కాని మద్రాసు చేరుకున్నాను అని నా 1955 డైరీలో రాశాను. మద్రాసులో ఆరుద్ర నన్నొక మెంటల్ క్లినిక్‌లో ప్రవేశపెట్టాడట...

విజయవాడలో పోయిన స్మారకం నాకు అయిదారు వారాల దాకా తిరిగిరాలేదు. ఈమధ్య కాలంలో ఏమయిందో నాకు స్పృహ లేదు. విజయవాడలో కమ్యూనిస్టుపార్టీ ఆఫీసులో ఈజీఛెయిర్‌లో విశ్రమించాను. నాకు ఎదురుగా గోడమీద లెనిన్‌చిత్రం, వెనక గోడ మీద స్టాలిన్ చిత్రంవున్నాయి. వాటిని చూస్తున్నంత వరకే నాకు జ్ఞాపకం. తర్వాత కొన్నాళ్లకు మద్రాసులోని డాక్టర్ ధైర్యం క్లినిక్‌లో నా గది తలుపు తీస్తూ ఒక వార్డ్‌బాయి నేనెవరో తెలుసా పోలీసు వాడిని అనడంతో నా మనసు తేరుకుంది. ఆ తర్వాత మరో పదిహేను రోజులు ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకున్నాను. ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ చిత్తుగా ఓడిపోయిందని పత్రికల ద్వారా నాకక్కడే తెలిసింది."

ఈ లేఖల తర్వాత పుస్తకంలో విశాలాంధ్రలో వీటిపై వచ్చిన సమాధానాలు ఇచ్చారు. మొదటి వ్యాసం కె.వి.రమణారెడ్డి రాశారు. కాంగ్రెస్ కూటమిని బలపర్చడమంటే కళాసరస్వతిని కళంకితం చేయడమే అంటూ మరో వ్యాసం అప్పట్లోనే వచ్చింది.

——— * * * ———

**రాష్ట్ర రాజకీయాలలోనూ, సాహిత్యం లోనూ అత్యంత హీనమైన నీచమైన అధ్యాయం ఆయనపై సాగిన దొంగదాడి. కాని ఆయన శారీరక మానసిక ఘర్షణలను అధిగమించి ఆఖరు వరకూ కమ్యూనిస్టు భావాలతో కొనసాగారు.**

——— * * * ———

అంతకంటే కూడా ప్రసిద్ధమైన, శక్తివంతమైన సమాధానం (దీన్ని శ్రీశ్రీ కూడా ఉటంకించారు) నార్ల చిరంజీవి రాశాడు. పాలగుమ్మి పద్మరాజు లేఖను మొదట పొందుపర్చి తర్వాత 'మహాకవి శ్రీశ్రీ ప్రతిభా దర్పణంపై మసిపూయజూచే పత్రికా వ్యాపారుల ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి?" అంటూ సునిశితమైన సమాధానమిచ్చాడు చిరంజీవి. కాంగ్రెస్ కుటిలనీతినీ, కర్కశ పాలననూ, దానికి వంతపాడే కుహనా సాహిత్య కారుల బూటకత్వాన్నీ చిరంజీవి తుత్తునియలు చేసిన తీరు స్వయంగా చదవాల్సిందే. ఈ కాగితాల యుద్ధం లో కురుక్షేత్రాన అభిమన్యుడిలా పోరాడిన నార్లచిరంజీవిని మర్చిపోలేం. ఈ పుస్తకాన్ని చిరంజీవికే అంకితమిచ్చారు.

స్వతంత్ర పేరుతో వచ్చిన మరో వ్యాసం పీడిత ప్రజల మహాకవిగా శ్రీశ్రీ అగ్రగామి పాత్రను చక్కగా వివరించింది. 'ఎన్ని కల ప్రచారానికి అభ్యుదయ కవితా ద్వేష మెందుకు?' అని ప్రశ్నించింది. తర్వాత కాలంలో దర్శకుడుగా ప్రసిద్ధుడైన ప్రత్యగాత్మ, 'ప్రవాసి' పేరుతో ఈ దుష్ప్రచారాలకు మరో గట్టి సమాధానమిచ్చారు. ఆంధ్రప్రభ ప్రగతి పేరుతో ధారావాహికంగా రాసిన కమ్యూనిస్టు వ్యతిరేక సంపాదకీయాలను ఆయన ఒక్కొక్కటిగా ఎండగట్టారు. ప్రతి ఖండికకూ చక్కటి జాతీయాలతో శీర్షికలిచ్చారు.

ఇదంతా పత్రికలలో వాగ్వివాదాలు కాగా బయట మాత్రం శ్రీశ్రీ, కమ్యూనిస్టు పార్టీ ఎన్నికల సభల్లో పాల్గొంటూ, రాష్ట్రమంతా ప్రచారం చేస్తూ తిరిగారు. ఎన్నికల ప్రచార సరళిని వివరించేందుకు ఏర్పాటు చేసిన పత్రికా గోష్టిలో సుందరయ్య, అప్పటి కార్యదర్శి అజయ్‌ఘోష్‌లతో పాటు శ్రీశ్రీ కూచున్న దృశ్యాన్నే 'దొంగదాడి' ముఖచిత్రంగా ముద్రించారు. ఆ కాలపు అనుభవాలపై శ్రీశ్రీ అనేక వ్యంగ్య కవితలు రాశాడు. అంతేగాక తను అప్పట్లో ఎదుర్కొన్న మానసిక ఘర్షణనూ, చిత్తచాంచల్యాన్నీ గురించి తన ఆత్మకథలోనూ రాశారు (బాక్సుచూడండి). రాష్ట్ర రాజకీయాల లోనూ, సాహిత్యంలోనూ అత్యంత హీనమైన నీచమైన అధ్యాయం ఆయనపై సాగిన దొంగదాడి. కాని ఆయన శారీరక మానసిక ఘర్షణలను అధిగమించి ఆఖరు వరకూ కమ్యూనిస్టు భావాలతో కొనసాగారు. ఒక ప్రముఖ దన్నుట్టు మహాప్రస్థానానికి ముందుమాట రాసిన చలం అరుణాచలం (రమణాశ్రమం) చేరాడు గాని శ్రీశ్రీ అరుణారుణంగానే ఆఖరి వరకూ వుండిపోయాడు. అదే ఆయన విశిష్టత, విప్లవ నిబద్ధత. అందులో కీలకమైన ఈ భాగాన్ని తెలిపే దొంగదాడి ప్రచురించిన విశ్వేశ్వరరావు అభినందనీయుడు. ఇది చదవడం ద్వారి కీలకసన్నివేశాల్లో పాలకవర్గాల నైచ్యాన్నీ, పిరికి మురికి మనుషుల అవకాశవాదాన్నీ, మేధావుల మనుకునే వారి పూగిసలాటలనూ ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు.

**(వెల : రూ. 100/-, ప్రజాశక్తి, విశాలాంధ్ర బ్రాంచీలలో దొరుకుతుంది.)**

## కవితలు

# నేను చిలకల సమూహం

**పి. విద్యాసాగర్**



ఆకుపచ్చ రెక్కల జెండాలను అతికించుకుని
నాలో ఒక చిలకల సమూహం
బొట్లుబొట్లుగా పండుదాటి కల్లును చప్పరించిన
చిలకల సమూహపు ప్రాణవాయువులో ఇంకిపోయాను.
అవీ
కుళ్ళికంపు కొడుతున్న నా రక్తమాంసాల్ని
జలపాతాలలో కడిగి,
దాహపు పుండును పువ్వుగా మార్చాయి.
చివరికి
నా దేహాన్ని రుతువుల్ని ధిక్కరించే
వటవృక్షంగా మార్చుకున్నాయి.
సూర్యుడు విడిచిన ఎర్రటి కుబుసాన్ని
ముక్కలకు తొడుక్కుని
ఏ నాగరికత అంటని చీకటిగుహల వేట దృశ్యాలను
నాలో బొమ్మలు బొమ్మలుగా చెక్కాయి.
గాజుకన్ను కొరుక్కుతిన్న హృదయం మీద
రంగుల్ని బహిష్కరించిన ఆదివాసి కలల్ని జారవిడిచాయి.
నన్నో చిలుకను చేసి సమూహంలో కలుపుకున్నాయి.
నేనిప్పుడు భాషతో పనిలేని వింత శబ్దాన్నయ్యాను.
నాకంటికిప్పుడు ప్రతిమనిషి
మాయల ఫకీరులా బొమ్మ కదుతున్నాడు
నేనిప్పుడు రాయిదెబ్బకు సొమ్మసిల్లిన
చిలుకకు మెత్తటి గరికపాన్పునైయ్యాను.
అది తెచ్చిన అడివి మామిడి పండు విత్తనానికి
పురుదు పోసే మట్టినయ్యాను.

---

# లేబర్ గ్లోబలైజేషన్!?

**శ్రీధర్‌శర్మ మొకురాలశ్రీ**



అవున్నిజమే...!
ఇది గ్లోబలైజేషన్ మహిమే!
భూమి గుండ్రంగా ఉంటుందంట
అయిన దానికి దిక్కులున్నాయట
మాకు మొన్న నిన్ననే తెలిసింది.
పొద్దుపొడిచే దిక్కు-పొద్దు గూకే దిక్కు తప్ప
దిక్కులే తెలియని మాకు
మాడిన డొక్కలు నింపుటకు
బొంబాయ్...మద్రాస్...కలకత్తా...
ఢిల్లీ...ఆగ్రా... ఛత్తీస్‌గఢ్...?
అన్ని దిక్కులు ఒక్కటి చేసి
ఆ దిక్కులన్నీ మావైనట్లు!
మరి...తాజ్‌మహల్ నిర్మాణంలో
కూలీలూ మా తాత తండ్రులట!
నిజమే.. ఇది గ్లోబలైజేషన్
ఇది "లేబర్" గ్లోబలైజేషన్!
ఆరోజు ఎంతో ఉత్సాహం...?
తీరబోతున్న తెల్లబస్సు ఎక్కేకోరిక!
ఆరోజు ఎంతో గర్వం...?
దొరబాబుకు తెలియని బొంబాయ్
ఆగ్రా వీధులు నాకు తెలుసన్నట్లు!!
"ఈరోజు మదిలోమెదిలిన భయం?"
తూర్పున బంగాళాఖాతం...
ఉత్తరాన ఛత్తీస్‌గడ్..
దిక్కులను చదివిన నా కొడుకు...
వాడి భవిష్యత్ దిక్కేదోనని!!!

---

# 'గ్లోబల్' నానీలు

**పి. లక్ష్మణ్‌రావ్**

గ్లోబలైజేషన్
లిబరలైజేషన్
పాపులేషన్‌పై
పొల్యూషన్!

మార్కెట్ విధ్వంసం
బతుకులు ఛిద్రం
గ్లోబల్ క్రౌర్యానికి
ఇంకా కావాలా సాక్ష్యం!

ప్రపంచీకరణ
ప్రైవేటీకరణ
ఫలాలందుతాయా
ఈ జన్మలో!

కుట్రపన్ని
చిచ్చుపెట్టి, ఉచ్చుబిగించి
చచ్చేటట్లు చేస్తుంది
ప్రపంచీకరణ!

నిన్ను నీకే
అమ్మేస్తుంది
గ్లోబల్ వ్యాపారం
మోసాల పుట్ట!

మాటల అమృతం పోసి
మీటతో విషం చిమ్ముట
బహుళజాతి
న్యాయమదే

ప్రపంచీకరణ
దొంగఅతిథి
స్వీయాకరణే
తరిమి కొట్టే యజమాని!

ప్రజాసంక్షేమం కోసం
ప్రపంచీకరణెందుకు?
స్వదేశీ
వనరులు చాలు!

**సమీక్ష**

# అరుణకుమారి కథలలో స్త్రీ



**'సాగరకోయిల'లో కథలు వస్తుపరంగా నేటి సామాజిక స్థితిగతులను మన ముందుంచుతాయి. సమాజంలో నానాటికీ దిగజారుతున్న నైతిక విలువల్ని తెలియజేస్తాయి. సమాజం సిగ్గుతో తలవంచుకో తగిన తీవ్ర సమస్యలను రచయిత్రి వస్తువులుగా స్వీకరించారు. కొన్ని కథలు చదువుతుంటే ఇలాంటి సంఘటనలు కూడా జరుగుతాయో అన్న ఆశ్చర్యం కలుగుతుంది. కానీ జరుగుతున్నాయనే చేదు నిజాన్ని వార్తాపత్రికలు నిత్యం నిరూపిస్తూనే ఉన్నాయి.**

**సి. సరళాదేవి,** పరిశోధక విద్యార్థి

**క**థకులు, విమర్శకులు పెరగటం వలన ఇటీవల కాలంలో తెలుగు సాహిత్యంలో బాగా అభివృద్ధి చెందింది. అందు కథా ప్రక్రియ మరింత బలపడింది. కథను కేవలం వస్తు పరంగానే కాకుండా రూప పరంగానూ, భావజాలపరంగానూ విశ్లేషించడం ఒక మంచి పరిణామంగా చెప్పవచ్చు. ఇతర ప్రాంతాలతో పోల్చి చూస్తే రాయలసీమలో రచయితల సంఖ్య తక్కువనే చెప్పాలి. అందునా స్త్రీ వాద దృక్పథంతో కలం పట్టిన రచయిత్రుల సంఖ్య మరీ తక్కువ. అలాంటి స్థితిలో రాయలసీమలో పుట్టి పెరిగిన శ్రీమతి అరుణకుమారి స్త్రీవాద దృక్పథంతో రచించిన కథా సంపుటి 'సాగరకోయిల' వెలువడటం అభినందనీయం. ఇందులోని కథలు వస్తుపరంగా నేటి సామాజిక స్థితిగతులను మన ముందుంచుతాయి. సమాజంలో నానాటికీ దిగజారుతున్న నైతిక విలువల్ని తెలియజేస్తాయి. సమాజం సిగ్గుతో తలవంచుకో తగిన తీవ్ర సమస్యలను రచయిత్రి వస్తువులుగా స్వీకరించారు. కొన్ని కథలు చదువుతుంటే ఇలాంటి సంఘటనలు కూడా జరుగుతాయో అన్న ఆశ్చర్యం కలుగుతుంది. కానీ జరుగుతున్నాయనే చేదు నిజాన్ని వార్తాపత్రికలు నిత్యం నిరూపిస్తూనే ఉన్నాయి. బహుశా రచయిత్రికి అవే ప్రేరణ కావచ్చు. ఇందులోని కథల,న్నీ ప్రధానంగా శ్రామిక, మధ్య తరగతి స్త్రీలు ఎదుర్కొన్నే సమస్యల్ని తెలియజేస్తాయి. వృద్ధాప్యంలో దిక్కులేక తల్లడిల్లిన తల్లులు, చిన్న వయస్సులో అత్యాచారానికి గురైన బాలికలు, కుటుంబం కోసం జీవితాన్ని త్యాగం చేసిన కూతుళ్ళు, ప్రేమ పేరుతో మోసం చేసిన వారిపై ప్రతీకారం తీర్చుకొన్న యువతులు ఈమె కథల్లో మనకు కన్పిస్తారు.

"పితారక్షతి కౌమారే, భర్తా రక్షతి యవ్వనే, పుత్రారక్షతి వృద్ధాప్యే" అంటూ స్త్రీకి నిరంతరం పురుషుడి సంరక్షణ అవసరమని తెలియచేసింది. ప్రాచీన సాహిత్యం, కాని ముసలితనంలో ఆదరించాల్సిన కన్నబిడ్డలే కసాయి వాళ్ళయితే తల్లిపడేవేదన ఎదుర్కొనే సమస్యలు 'అమ్మసిగ్గు', 'నిమజ్జనం', 'భోజ్యేషుమాత' కథల్లో చిత్రించబడింది.

వృద్ధాప్యంలో ఉన్నతల్లిని ఆదరించాల్సిన కొడుకే ఆమెను తనకు ఆదాయాన్ని సమకూర్చే సాధనంగా ఉపయోగించుకుంటే ఆ తల్లి యొక్క మన:స్థితిని తెలియజేసే కథ 'అమ్మసిగ్గు', ఆడతనపు సహజాలంకారమైన సిగ్గును నగ్నం చేసి తద్వారా వచ్చే ఆదాయంతో జీవితాన్ని గడిపే కొడుకుని చూసి కృంగిపోయే తల్లిగా ఈ కథలో స్త్రీ చిత్రించబడింది. "నీకిది నాయం కాదురా! నేన్నిన్ను పదినెల్లు మోసి కన్నమ్మనురా నాకొడకా! నన్నిట్లా గుడ్డల్లేకుండా ఈదులు, రోడ్లు తిప్పేదానికి నీకు, తిరగడానికి నాకు సిగ్గేక పోయినా నన్నిట్టాజూసి సిగ్గుబడి ఏ పాత చీర గుడ్డిచ్చిన ఏయమ్మో మల్లా కన్పడితే వాల్లమొగం నేనెట్లా జూసేదిరా? అమ్మను సిగ్గులేని దాన్ని చేసి నాకొడుకు చీరలమ్ము కొంటూండాడని వాల్లకు నేనెట్టా జెప్పేదిరా! దేవుడా నాకు సావన్నరాదే! అంటూ హృదయ విదారకంగా రోదించే తల్లిగా "అమ్మ సిగ్గ" కథలో స్త్రీ చిత్రించబడింది.

అప్పులు చేసి పెద్ద చదువులు చదివిస్తే ఆ అప్పులు తమపై నెట్టి నిర్లక్ష్యంగా కొడుకు తప్పుకున్నా అతన్ని ప్రేమించే తల్లిగా 'నిమజ్జనం' కథలో స్త్రీ చిత్రించబడింది. "ఇన్నేళ్ళూ ఊపిరందించిన ఈ గాలిలోనే నా చివరి శ్వాస వదలాలి. ఇన్నేండ్లూ ఈ శరీరాన్ని మోసిన ఈ నేల తల్లిలోనే నా భౌతిక కాయం శాశ్వతంగా నిద్రించాలి. అన్న భర్త కోరిక తీర్చడానికి అతని చితాభస్మాన్ని ఆ జాగాలో చల్లి అక్కడ భవంతికి పునాదులు తీసిన షావుకారు చేతిలో చావు దెబ్బలు తిన్న భార్యగా స్త్రీ 'నిమజ్జనం' కథలో చిత్రించబడింది.

రాయలసీమలో రాళ్ళుపడితే అనావృష్టి వల్ల పట్నానికి వలసపోయిన కొడుకులు తమకు ఒక పూట తిండికయినా తృణమోపణమో పంపకపోతారా అని ప్రతిరోజూ కళ్ళుకాయలు కాచేలా పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూసి నిరాశతో కృంగిపోయే వృద్ధ దంపతులు నేడు ఎందరో వున్నారు. కనిపెంచిన కొడుకులు వృద్ధాప్యంలో ఉన్న తమను ఏ విధంగా ఆదరించకపోయినా కన్న ప్రేమను వదులుకోలేని మాతృమూర్తిగా, ఎవరన్నా పిడికెడు మెతుకులిచ్చినా, గుక్కెడు నీళ్ళిచ్చినా దాంతో భర్త ఆకలిని తీర్చి తాను మాత్రం ఆకలికి ఆహుతైన త్యాగమూర్తిగా "భోజ్యేషుమాత" కథలో స్త్రీ చిత్రించబడింది.

సమాజ సంప్రదాయాలు, కుటుంబ కట్టుబాట్లు, అత్తవారింటి అధికారం, అణచివేత విధానాలు స్త్రీని జీవచ్ఛవంగా మారిస్తే ఆ స్త్రీ జీవితం ఎంత మౌన విషాదమౌతుందో వాళ్ళు రావణ కాష్టంలో ఎలా సమిధులు అవుతారో తెలియజేసే కథ. "సమిధులు" పెళ్ళయి అయిదేళ్ళయినా పిల్లల్లేరని బాధపడే అత్తమామల కోరిక తీర్చడం కోసం తనకు నమ్మకం లేకపోయినా గుళ్ళు, స్వాములు,

బాబాల చుట్టూ తిరిగి గర్భవతి అయిన ప్రణీత, అబార్షన్ చేయించుకోమని ఒత్తిడి చేసే అత్తమామలు వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడే స్త్రీగా ఈకథలో ప్రణీతి చిత్రించబడింది. ఆ బాబా తన వద్దకు వచ్చే స్త్రీలకు మత్తు మందిచ్చి అత్యాచారం చేస్తాడనే వార్త పత్రికల్లో రావడమే "ముక్కూ మొహమూ తెలియకపోయినా కాషాయం కట్టిన ప్రతి వెదవనూ దైవాంశ సంభూతుడని నమ్మేసే వాళ్ళు ఏళ్ళు తరబడి కలిసి మెలసి ఉన్న ఆత్మీయులను నమ్మకపోవడం అమానుషం కాదా? అన్యాయం కాదా? అన్న ప్రణీత మాటలకు "ప్రతి సమస్యకూ ఆత్మహత్యే పరిష్కారం కాదని, మన పితృస్వామిక వ్యవస్థలో పురుషాధిక్య సమాజంలో ఆచారాలు, సంప్రదాయాలు అన్నీ మగవాడికి అనుకూలంగా మలచుకొన్నవే. అవి మారాలంటే ముందు స్త్రీల ఆలోచనలలోనే మార్పు రావాలి. ప్రపంచంలో నిజం అంటూ ఉంటే అది తల్లిమాత్రమే. తండ్రి కేవలం నమ్మకం మాత్రమే నీ గర్భాశయాన చేరిన విత్తు ఎవరిదైనా సరే నీ రక్త మాంసాలతోనే కదా రూపుదిద్దుకొంటోంది. కాబట్టి అది నీ బిడ్డ ఆ బిడ్డను చంపే అధికారం, హక్కు నీతో సహ ఎవరికీ లేదు. "మనసనే కోట దృఢంగా ఉన్నంత వరకూ జీవన సమరంలో ఓటమి అనేది ఉండదు.'' అన్న స్నేహితురాలి మాటలకు నూతనోత్సాహాన్ని నింపుకొని "నేనూ బిడ్డను కంటాను". అనే నిర్ణయాన్ని తీసుకున్న చైతన్యవంతమైన స్త్రీగా "సమిధలు" కథలో ప్రణీత చిత్రించబడింది.

మైనారిటీ తీరని బాలికలపై జరిగే అత్యాచారాలపై రచయిత్రి వివిధ కోణాల్లో తెలియజేస్తూ 'కసాయిమనిషి' 'శత్రుస్పర్శ', 'రేపటి బతుకులు', 'అమావాస్య వెన్నెల' అనే కథలు రచించారు.

పతియేసతికి ప్రత్యక్షదైవం అనీ, భార్య భర్తను దైవంగా భావించి పూజించాలనేది అనాది నుండి వస్తున్న ఆచారం. అంత ఉన్నత స్థానాన్ని పొందిన పురుషుడు నేడు ఎంత నీచస్థితికి దిగజారాడో తెలియజేసే కథ "కసాయి మనిషి" కామాతురాణాం నభయం నలజ్జ అయినంత మాత్రాన వావి వరుసా లేకుండా కళ్ళు మూసుకుపొయి కామపిశాచియై కన్నబిడ్డపై అత్యాచారం చేసిన భర్తను తీవ్రంగా శిక్షించిన భార్యగా నీలిమ ఈ కథలో చిత్రించబడింది. "తప్పు చేసిన వ్యక్తిని శిక్షించడానికే కదా కోర్టులు చట్టాలు వున్నది. చట్టాన్ని నీ చేతుల్లోకి తీసుకొని ఒక మనిషిని శిక్షించే అధికారం నీకెవరిచ్చారు." అన్న జడ్జిగారి మాటలకు "అతను నాకు కట్టిన తాళి, అతనికి బిడ్డలను కన్న నాలోని అమ్మతనం" అన్న నీలిమ మాటలను బట్టి భర్త తప్పు చేస్తే శిక్షించే అధికారం, హక్కు భార్యకు ఉంటుందని భర్త చేసే ప్రతి తప్పును క్షమించడానికి స్త్రీ క్షమయాధరిత్రి కాదని తెలుస్తుంది.

ఆడపిల్లలంతా చదువుకోవాలని వారికోసం ఉచితంగా పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు ఏర్పాటు చేశామంటారు. కానీ "కంచే చేను మేస్తే ఎట్లా"? అన్న సామెతలా అక్కడ ఆడపిల్లలకు భద్రత లేకుండా పోయిందని,కడుపునిండా తిండిపెట్టక పోగా కడుపులు చేసి ఆడపిల్లల బతుకులు నాశనం చేస్తున్నారని, అలాంటి వారిని కఠినంగా శిక్షించాలని 'శత్రుస్పర్శ' కథలో వివరించబడింది. "అమ్మ ఊరికి వెళ్ళినపుడు రాత్రిళ్ళు నాన్న కౌగిలిలో పురుష స్పర్శ --- నీకు నాన్న ఎవరిని చెప్పను? నాన్నా! సారా?!! అన్న బాలిక మాటల్లోని ఆక్రోశాన్ని, దాని వెనుక ఉన్న కఠోర వాస్తవాన్ని బట్టి ఆడపిల్లకు బయటే కాదు గుడిలాంటి బడి స్వర్గంలాంటి ఇంట్లో కూడా భద్రత లేకుండా పోయిందని "శత్రుస్పర్శ" కథ ద్వారా తెలుస్తుంది.

పిల్లల రేపటి బతుకులు హాయిగా ఉండాలనే కోరికతో చిన్న పిల్లల బాధ్యతను బాల్యం వీడని పెద్ద కూతురికి అప్పగించి తల్లి పరదేశానికి వెళితే తండ్రి తనపై చేసే అత్యాచారాన్ని భరించలేక ప్రాణాలు తీసుకున్న కూతురిగా మల్లి "రేపటి బతుకులు" కథలో చిత్రించబడింది.

కరువు కారణంగా జానెడు పొట్టకోసం వలస వచ్చి పెత్తందార్ల దౌర్జన్యానికి గురైె భర్తను పొగొట్టుకుని విధిలేక దొరకు లొంగిపోయిన అమాసి తన భర్తను చంపి తనను అనుభవించడమే కాక తన కూతురిపై అత్యాచారం చేయబోయిన దొరను హతమార్చి కూతురిని కాపాడుకున్న తల్లిగా "అమావాస్య వెన్నెల" కథలో స్త్రీ చిత్రించబడింది.

సాహిత్యం, సంప్రదాయాలు, కట్టుబాట్లు అన్నీ స్త్రీ ఎలా ఉండాలో తెలియజేసాయి కాని పురుషుడు ఎలా వుండాలో తెలియజేయలేదు. ''న్యాయ పోరాటం" కథలో భర్త ఎదుటే నలుగురు రేపిస్టుల చేత అత్యాచారానికి గురైన శ్వేత ఇంట్లోని అందరితోపాటు భర్త కూడా తనకు వదిలించుకోవాలని, తనలో పెరిగే బిడ్డను మాత్రం కావాలనుకోవడం చూసి నిర్ఘాంత పోతుంది. "స్వచ్ఛమైన అద్దం మీద ఎవరో అమానుషంగా "ఉమ్మేస్తే" ఆ తప్పు అద్దానిదా? అందుకు శిక్షగా ఉమ్మిన వాడ్ని వదిలేసి అద్దాన్ని పగలగొట్టడం మానవత్వమా? ''నాకు పుట్టబోయే బిడ్డ అచ్చంగా నాదే. బీజదాతకు సర్వహక్కులు సంక్రమించవు. క్షేత్రం నాది. రక్తమాంసాల ఎరువునాది. నా పేగు బంధాన్ని నానుంచి ఎవరు ఎలా విడదీయగలరో వారితో న్యాయపరంగా పోరాడడానికి నేను సిద్ధమే" అంటూ జన్మనిచ్చిన తల్లికే బిడ్డపై సర్వహక్కులు ఉంటాయని తెలియజేసి, కళ్ళెదుటే భార్యపై అత్యాచారం చేసిన వాళ్ళతో కాంప్రమైజ్ అయి, కాంపెన్సేషన్ తీసుకోమన్న మానసిక సంపుకుడైన భర్తతో వివాహబంధాన్ని కొనసాగించుట ఇష్టంలేక భర్తను వదిలివేసే భార్యగా ''న్యాయపోరాటం" కథలో శ్వేత చిత్రించబడింది.

నేడు స్త్రీలు ఎదుర్కొంటున్న మరో సమస్య 'ఈవ్ టీజింగ్'. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు మొదలైన చోట్ల ఎన్నో రకాలుగా అవతరాలు ధరిస్తున్న లైంగిక వేధింపును భరించలేక ప్రాణాలు తీసుకొన్నవారు కొందరైతే ప్రతీకారం తీర్చుకొన్న వాళ్ళు కూడా వున్నారు.

'చీకటి రంగులు' కథలో తన ప్రేమను అంగీకరించలేదన్న కోపంతో తోటి విద్యార్థి శ్రీతేజ తనపై యాసిడ్ చల్లి కూరూపిగా చేసిన అతనిపై ప్రతీకారం తీర్చుకున్న యువతిగా క్రాంతి చిత్రించబడింది. "పొట్టేలు కొండను ఢీకొనాలంటే తలతో కాదు తెలివితో ఢీకొనాలి. ఏ యాసిడ్‌తో నువ్వు నా అందాన్ని పాడు చేశావో, అంతకన్నా ఎక్కువ పవర్‌ఫుల్ యాసిడ్‌తో నేను నీ కంటి చూపును పొగొట్టాను. నీ డబ్బు ప్లాస్టిక్ సర్జరీతో నీ మొహాన్ని సరిచేసినా దాన్ని కూడా చూసుకోలేని చీకట్లో నీబతుకు మగ్గిపోతుంది." అంటూ తన జీవితాన్ని అస్తవ్యస్తం చేసిన శ్రీ తేజను ఏ రంగూ చూడలేని వాడిగా చేసి ప్రతీకారం తీర్చుకొన్న యువతిగా క్రాంతి కనబడుతుంది.

ఇదే విధంగా తనను దగా చేసిన ప్రేమికుడి పై ప్రతీకారం తీర్చుకొన్న యువతి కథ "ప్రేమ సుడిగుండాలు" ప్రభాత్ మాయ మాటలు నమ్మి అతని కారణంగా గర్భవతి

అయిన ప్రమద విధిలేక అబార్షన్ చేయించుకొనేటప్పుడు డాక్టర్లు ఎక్కించిన రక్తం ద్వారా ఎయిడ్స్ వ్యాధికి గురవుతుంది. దాంతో అయిన వాళ్ళందరికీ దూరంగా ఒంటరిగా అజ్ఞాతంలో కుంగిపోతున్న ప్రమదకు మళ్ళీ ప్రభాత్ తారసపడి అవివాహితగానే ఉన్న ఆమె వెంటపడతాడు. తన జీవితం నాశనం కావడానికి కారకుడైన ప్రభాత్‌తో మళ్ళీ ప్రేమాయణం మొదలు పెట్టి అతనికి కూడా అనారోగ్యం, అకాల మృత్యువు వచ్చేలా చేసి ప్రతీకారం తీర్చుకొన్న యువతిగా ప్రమద చిత్రించబడింది.

కుటుంబం కోసం తన ఆశల్ని, కోరికల్ని, జీవితాన్ని, త్యాగం చేసి మోడుగా మిగిలిపోయిన స్త్రీగా 'సాగరకోయిల' కథలో సింధు చిత్రించబడింది. కూతురి సంపాదన లేకుంటే సంసారం నడవటం కష్టం అని భావించే తల్లి ఇతర కుటుంబ సభ్యుల బాధ్యతల బరువు సింధు జీవితాన్ని దారితప్పేలా చేస్తాయి. తనను గురించి వాస్తవం తెలిసినా తన చేయి అందుకోవడానికి సిద్ధమైన విజయ్ నీడలో మోడుబారిన జీవితానికి వసంతం వచ్చేలా చేసుకోవాలని కలలుకనే సింధుకు దారితప్పిన జీవితం ప్రసాదించిన ఎయిడ్స్ అడ్డుగా నిలవడంతో తిరిగి మోడైపోయిన తన జీవితంపై విరక్తి కలిగి ఆత్మహత్యకు పాల్పడుతుంది. ఎందుకిలా చేశావన్న స్నేహితురాలి ప్రశ్నకు "పాపపంకిలమైన నాకు 'విజయ్' అనే వరాన్నిచ్చిన ఆ దేవుడు అతన్తో కలిసి వుండ కూడదన్న శాపాన్ని కూడా ఇచ్చాడు" అంటూ హృదయ విదారకంగా ఏడుస్తున్న సింధు హృదయఘోష సాగర ఘోషలో కలిసిపోయే కోయిల కూతలా ఎవరికీ వినిపించదు. ఈ కథలో సింధు కుటుంబం కోసం జీవితాన్ని త్యాగం చేసిన స్త్రీగా చిత్రించబడింది.

పెళ్ళికి ముందే యాక్సిడెంట్‌లో సంతానభాగ్యాన్ని కోల్పోయాడని తెలిసినా తన మనసుకు నచ్చిన శ్రీకాంత్‌నే పెళ్ళి చేసుకొని అతనితోనే జీవితాన్ని పంచుకోవాలని కోరుకునే స్త్రీగా "నేనూ నాన్న నవుతాను" కథలో సౌమ్య చిత్రించబడింది. యాక్సిడెంట్‌లో సంతాన భాగ్యాన్ని కోల్పోయి పిల్లల్లేరని బాధపడే శ్రీకాంత్‌తో అతని తల్లి "తల్లిదండ్రుల ప్రేమను పంచగల్గే పెద్ద మనసు మనకుండాలే గాని, తల్లిదండ్రుల ప్రేమకోసం తపించే బిడ్డలు ఎంతమంది లేరు? 'నాది' 'అనే అహంకారాన్ని, 'నారక్తం' అనే సంకుచితత్వాన్ని విడిచి పెట్టకల్గితే' అని కొడుక్కి హితబోధ చేసిన తల్లిగా ''నేనూ నాన్న నవుతాను'' కథలో స్త్రీ చిత్రించబడింది.

పుట్టినప్పటి నుంచి మరణించే వరకు సమాజంలో స్త్రీ ఎదుర్కొనే సమస్యలను శ్రీమతి అరుణకుమారి తన కథల్లో తెలియజేసారు. స్త్రీ విద్యావంతురాలు అయినా కాకపోయినా వివాహానంతరం స్త్రీ ఎదుర్కొనే సమస్యల్లో తేడా ఉండదని తెలియజేసారు. ఈమె కథల్లోని స్త్రీలు మొదటి సమస్యను చూసి భయపడినా తర్వాత ధైర్యవంతులై ఆ సమస్యను ఎదుర్కొన్న వారుగా కనిపిస్తారు. భావ వ్యక్తీకరణలో స్త్రీవాదుల్లో సహజంగా కనిపించే ఆవేశం ఈ ప్రతి కథలో అడుగడుగునా కనిపిస్తుంది. కథల్లోని పాత్రలను బట్టి సందర్భానుసారంగా రాయలసీమ మాండలికాన్ని చక్కగా ఉపయోగించారు.

# తుపాకీ జయంతి



**నిశాపతి**

హాయిగా వేటకెళ్ళి నా ఆహారం నేను తెచ్చుకునేవాణ్ణి
కొన్నాళ్ళకి ఓ 'స్నేహితుడు' కలిశాడు. 'ఇద్దరం కలిసి వేటకెళ్దాం
ఎక్కువ దొరుకుతుంది' అన్నాడు. 'సరే!' అన్నాను,
ఆ రోజే నా కష్టాలు ప్రారంభం.
వేట నుంచి వచ్చేసరికి కంచంలో అన్నం మాయం.
నా స్నేహితుడి కంచంలో రెండింతలు!
ఓ రోజు వాణ్ణి చాటుగా గమనించాను.
వాడి దగ్గర బోలెడు అన్నం వుంది.
దాన్ని ఓ మిషన్లో వేస్తున్నాడు. మిషను రెండో కొస నుంచి
ఆ అన్నం కత్తులుగా మారిపోయి వస్తోంది!
బొత్తులుగా మారిపోయి వస్తోంది!
లావుపాటి బుక్కులుగా మారిపోయి వస్తోంది!
నాకేం అర్థం కాలేదు. అయినా వాణ్ణి ఏమీ అనలేదు.
ఓ రోజు మాత్రం ఆకలికి ఆగలేక
కొంచెం అన్నం పెట్టమని అడిగాను.
వాడు యింటికి తీసుకెళ్ళి మర్యాద చేసి అన్నం పెట్టాడు.
పక్కనే కుంకుమ బొట్లు పెట్టి ఓ లావుపాటి పుస్తకం వుంది.
వాణ్ణి అందరూ పొగిడారు! నేను కూడా!
అది నా అన్నమే అని నాకప్పుడు అనుమానమే రాలేదు!
ఇలా కొన్నాళ్ళు సాగింది.
వాడు క్రమంగా విసుక్కోవడం మొదలెట్టాడు.
చివరికి అసలు అన్నం పెట్టడవే మానేశాడు.
ఓ రోజు వెళ్ళి అన్నం పెట్టమని వాడితో దెబ్బలాట వేసుకున్నాను.
వాడి పక్కన వుండే లావుపాటి పుస్తకం
యిప్పుడు చెదలు పట్టి వుంది.
దాని పక్కనే మెరుస్తోన్న ఓ కత్తి వుంది.
నేను వాడి కళ్ళలోకి సూటిగా చూస్తూ,
"నా అన్నం నాకు పెట్టు!" అన్నాను కోపంగా.
వాడికీ పట్టరాని కోపం వచ్చింది. 'నీదా? ఎక్కడుంది?!'
అంటూ పక్కనున్న కత్తి తీసుకుని నా మీదకి బలంగా విసిరాడు.
ఆ కత్తి నా కుడిచేతిని భుజాల దాకా నరికింది.
తెగిన చెయ్యి కింద పడటానికి బదులు పైకి లేచింది.
కొంచెం సేపు గాలిలో తేలి చివరికి వచ్చి
మళ్ళీ నా భుజానికి అతుక్కుంది.
కాని, ఆశ్చర్యం! అదిప్పుడు నా చేయి కాదు!!
తుపాకీ!!

# ప్రకటనలు

## 2007 విమలాశాంతి సాహిత్య పురస్కారాలు

2007 వ సంవత్సరంలో ఇచ్చే 'విమలశాంతి పురస్కాం', 'విమలశాంతి కవితా పురస్కారం' కోసం రచనలు పంపవలసిందిగా ఛైర్మన్ డా॥ శాంతినారాయణ కోరారు.

**రచయితలు గమనించాల్సిన అంశాలు :**

1. ఎంపిక కోసం కథా, కవితా సంపుటాలు జనవరి 2005-డిసెంబర్ 2006 మధ్య కాలంలో ప్రచురింపబడినవై వుండాలి.
2. కథా కవితా సంపుటాలలో సమకాలీన సామాజిక జీవిత చిత్రణ తప్పక వుండాలి. దళిత బహుజన జీవితాన్ని చిత్రించిన రచనలకు ప్రాధాన్యత వుంటుంది.
3. వేరు వేరు రచయితల రచనలతో కూర్చిన సంకలనాలు స్వీకరింపబడవు.
4. రచయితలు తమ రచనలను 15-6-2007 లోపల మాకు చేరే విధంగా పంపాలి. ఆ తర్వాత వచ్చిన రచనలు స్వీకరింపబడవు.
5. ఎంపిక కోసం పంపే రచనలను ఒక్కొక్కటి నాలుగు కాపీల వంతున పంపాలి. ఒక కాపీలో "విమలాశాంతి కథా/ కవితా పురస్కారం కోసం' అని తప్పనిసరిగా రాయాలి.
6. ఎంపికైన రచనలకు 2007 ఆగస్టు రెండో ఆదివారం అనంతపురంలో జరిగే సభలో సగౌరవంగా పురస్కారాలు అందజేయ బడతాయి. ఒక్కొక్కరికి రు. 10,000/-లు నగదుతో పాటు పురస్కార పత్రం, ఒక మొమెంటో బహూకరింపబడతాయి. పురస్కార గ్రహీతలకు ఆ రోజు భోజన వసతి సౌకర్యం వుంటుంది.
7. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి (రాయలసీమ, తెలంగాణా, కోస్తా) మేము ఎంపిక చేసుకున్న న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు పురస్కారాలు నిర్ణయింప బడతాయి. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు అస్కారం వుండదు.
8. రచనలు చేరవలసిన చిరునామా: ఎస్వీ ప్రసాద్, కథా రచయిత, 28-4-271, యమునానగర్, విజయనగర్ కాలని, అనంతపురం. సెల్: 94405 47123.

## ప్రకాశంజిల్లా కథా సంకలనం

ప్రకాశంజిల్లా సాహిత్య చరిత్రను సుసంపన్నం చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లా జన జీవితాల్ని, అస్తవ్యస్తమైన జీవన చిత్రణను హృద్యంగా చిత్రించిన కథలతో కూడిన ప్రకాశంజిల్లా కథా సంకలనం తీసుకురావాలని ప్రకాశంజిల్లా సాహిత్య ఐక్యవేదిక సంకల్పించింది.

కాబట్టి ప్రకాశంజిల్లాలో కథలు రాసే రచయితలు / రచయిత్రులు తాము రాసిన కథా సంపుటాలు కానీ లేదా ప్రచురితమైన రెండు లేదా మూడు కథలు కానీ, పూర్తి రచనల వివరాలతో పాటు ఒక పాస్‌పోర్టు ఫోటోను కూడా జతచేసి పంపించవలసిందిగా కోరుచున్నాము. పూర్తి వివరాల కోసం 9949535695 నెంబర్‌ను సంప్రదించ గలరు.

**కథలు, కథా సంకలనాలు పంపవలసిన చిరునామా :**
మంచికంటి వెంకటేశ్వర్‌రెడ్డి
కొత్తపట్నం, ప్రకాశంజిల్లా - 523 286

## సాహిత్య ప్రస్థానం
### మాసపత్రిక చందా వివరాలు

| | | |
|---|---|---|
| సంవత్సర చందా (వ్యక్తులకు) | రు. | 120 |
| సంవత్సర చందా (సంస్థలకు) | రు. | 150 |
| అయిదేళ్లకు | రు. | 500 |
| పదేళ్లకు | రు. | 900 |
| విడి ప్రతి | రు. | 10 |

ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలన్నిటిలోనూ సాహిత్య ప్రస్థానం లభిస్తుంది. ప్రజాశక్తి దినపత్రిక ఏజంట్లకు చెప్పి వారి ద్వారా కూడా తెప్పించుకోవచ్చు.

## సాహిత్య ప్రస్థానం
### అడ్వర్టయిజ్‌మెంట్ టారిఫ్

కలర్

| | |
|---|---|
| టైటిల్ బ్యాక్ | రు. 15000 |
| టైటిల్ ఇన్నర్ | రు. 12000 |
| లోపలి పేజీ | రు. 10000 |

## చందాదారులకు గమనిక

- ఏప్రిల్ 2007 నుండి ప్రస్థానం నెలవారీగా తెస్తున్న విషయం తెలిసిందే. ఏప్రిల్ సంచికను చందాదారులకు ఇప్పటికీ పోస్టు ద్వారా పంపించాము. ఆ సంచిక అందని వారు వారి చందా ముగిసిందని భావించి చందాను పునర్దురించుకోవలసిందిగా మనవి.
- మే సంచికతో జూన్ సంచికను కూడా మే నెల చివరి వారంలో పోస్టు చేయడానికి ప్రయత్నిస్తున్నాం.
- ప్రస్తుతం చందా కట్టేవారికి ఏప్రిల్ 2007 సంచిక నుండి పంపిచడం జరిగింది.
- చందాల వివరణలు, సందేహాలకు సంబంధించి ఫోన్ నెం. 9392221848 (వార ప్రసాద్)లో తెలుసుకోగలరు.
- ప్రస్థానం ప్రగతిని కాంక్షించే మిత్రులు బాధ్యత స్వీకరించి కొత్త చందాదారులను చేర్పించగలరు. వారు పైన తెలిపిన ఫోన్ నెంబర్‌లో వారి ఆసక్తిని తెలియజేయవచ్చు. వారు కోరినట్లయితే చందా పుస్తకాలను పంపించగలరు.
- గ్రంథాలయాలు, కాలేజీలు, పాఠశాలలు, వివిధ సంస్థలకు శ్రేయోభిలాషుల చేత 5 సం॥ల చందా రూ. 500/-, పది సం॥ల చందా రూ. 1000/-లను కట్టించవచ్చును.

## పాట

# రచయిత - రాజ్యం



రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

ఈ మట్టిలోనే పుట్టాము – ఈ మట్టిలోనే పెరిగాము
ఈ మట్టిని మించిన దైవం లేదు – మట్టే మెతుకురా
ఈ మట్టే బతుకురా ॥ఈ॥
బీడుపడ్డ బంజరు నేల మేడిపట్టి రమ్మంటుంది
అఱ్ఱు సాచి కోడెగిత్త కఱ్ఱు మునగ దున్నుతుంది
నీరు పోసి నారు వేసి కలుపు తీసి సాగు చేసి
బంగారపు రాశులు ఎన్నో పండించాలిరా
ప్రజకందించాలిరా ॥ఈ॥
ఎంత చెమట ధారపోస్తే ఈ పచ్చని పైరు పండెరా
ఎంత నెత్తు రావిరైతే ఈ ఫలితం చేతి కందెరా
గట్టు మీద కూరుచుండె పొట్ట నింపువాడెవడురా
రాజ్యాలే తలక్రిందయినా రైతే మిగులురా
మన జాతే వెలుగురా ॥ఈ॥
కలసి మెలసి బతికిననాడె కష్టాలే తీరునులేరా
కలలన్నీ పండునులేరా
పల్లె సీమ పచ్చగ ఉంటే ప్రపంచమే నిలుచునులేరా
ప్రగతి జగతి నిలుచునులేరా
పదుగురికి కలిమిని పంచి అందరిలో చెలిమిని పెంచి
తన గడ్డను తీర్చిదిద్దే మనిషే మనిషిరా
ఆ మనసే మనసురా ॥ఈ॥

అక్కినేని నాగేశ్వరరావు నాయకుడుగా నటించిన "రైతు కుటుంబం" సినిమా కోసం డాక్టర్ సి. నారాయణరెడ్డి ఈ పాట రాశారు. నేను విద్యార్థిగా ఉన్న రోజుల్లో ఆ పాటను విన్నప్పుడు గాని, ఆ పాట చిత్రీకరణను చూసినపుడు పులకించి పోయేవాడిని. పొంగిపోయేవాడిని. మాది వ్యవసాయ కుటుంబం కావడం వల్ల నా చదువు పూర్తయ్యేదాకా వ్యవసాయంతో నాకు పూర్తి సంబంధం వల్ల ఈ తాదాత్మ్యం కలిగేది. కవి వ్యవసాయ జీవితంలోంచి వచ్చినందువల్ల, వ్యవసాయ సంస్కృతిని బాగా జీర్ణించు కున్నందువల్ల ఈ పాటను ఇంత సాధికారికంగా రాయగలిగారు. బురదలో పొర్లాడకుండా, బురదను నెత్తిమీద చల్లుకోకుండా ఈ పాట రాయడం సాధ్యం కాదు. వ్యవసాయ ప్రక్రియ పట్ల పూర్తి అవగాహన కలిగినప్పుడే ఈ పాట రచన సాధ్యమవుతుంది. ఈ పాటలోని మాటలు ఉల్లిపువ్వుల్లాగా ఉన్నా, వాటికి ఉలికి వున్నంత పదును ఉంది. ఈ పాట రైతేతిహాసం... భారతదేశ వెన్నెముకగా కీర్తింపబడే రైతును, అతని శ్రమను అద్భుతంగా కీర్తించిన పాట ఇది. తిరిగి గింజల సృష్టికర్తకు అందమైన నగిషీ ఈ పాట. కవి తన నేపథ్యాన్నే వస్తువుగా తీసుకుంటే ఎంత తీక్షణమైన కవిత రాయగలడో ఈ పాట రుజువు చేస్తున్నది. ఈ పాటలోని ప్రతి పాదమూ రైతు అందజెక్కిన గెనిమిలాగా ఉంది. ప్రతిపాదమూ ఆచారి బాడిసతో చెక్కిన నొగలాగా ఉంది. కొలిమిలో కాల్చి సమ్మెటతో కొట్టి సాపు చేసిన కఱ్ఱులాగా ఉంది.

ఈ పాటను రేడియోలో ఎప్పుడు విన్నా ఈ అనుభూతితో పరవశించి పోయేవాడిని. అయితే ఇటీవల ఈ పాట వింటుంటే ఏడుపు వస్తున్నది. కన్నీళ్ళు కారుతున్నాయి. కవి స్వప్నం భగ్నమైంది! అనిపిస్తుంది. వాస్తవం అవాస్తవం అయ్యిందా అనిపిస్తుంది. ఇటీవల రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ఈ పాటలోని సత్యం అసత్యంగానూ మారిపోయిందా అని అనిపిస్తుంది.

"రాజ్యాలే తలక్రిందయినా రైతే మిగులురా" అనే పాదాన్ని ఇప్పుడెలా అర్థం చేసుకోవాలి. రైతులు తలక్రిందై రాజ్యం మాత్రం మిగిలిపోతున్న పరిణామాన్ని చూస్తున్నాం. "పల్లె సీమ పచ్చగా ఉంటే ప్రపంచమే నిలుచును లేరా" ప్రపంచీకరణ పచ్చగా ఉంది, పల్లె సీమ అదృశ్యమవుతున్నది. పల్లెలు పగల కుంపట్లవుతున్నాయి. రాజకీయాలు పల్లెల్ని ముఠాల గుడారాలుగా మారుస్తున్నాయి. వ్యవసాయం జూదంగా మారిపోయింది. ఎంత చెమట ధారపోసినా పంటలు పండటం లేదు. ఎంత నెత్తురావిరైనా ఫలితం చేతికందటం లేదు. రాజకీయాలు, వ్యాపారాలు గౌరవనీయ వృత్తులై వ్యవసాయం వెర్రి బాగులోళ్ళ చేతగాని పనిగా గుర్తింపు పొందింది. పశువులు కబేళాల్లో కంకాళాలుగా మారిపోతున్నాయి. మేడి, కాడి పుచ్చి పోయాయి. కోడెగిత్తలు అరుదుగానే మిగిలి ఉన్నాయి. గట్టు మీద కూర్చున్నవాడు మొనగాడవుతున్నాడు. మట్టిలోకి దిగినవాడు మట్టై పోతున్నాడు. పదుగురికి కలిమిని పంచడం, చెలిమిని పంచడం గురజాడ నాటి చాదస్తంగా మిగిలిపోయి అతి తక్కువ కాలంలో కోట్లకు పడగలెత్తడం గొప్ప నాయక లక్షణంగా చెలామణి అవుతున్నది. తన గడ్డను తీర్చిదిద్దటం పోయింది. అమెరికా గడ్డకు గోచి ఎగబెట్టడం గొప్ప సామాజిక గౌరవంగా భావింపబడుతున్నది.

తెలుగు సినిమా కూడా వ్యవసాయాన్ని, రైతాంగాన్ని తెర వెనక్కి తరిమేసి, పరిశ్రమల్ని కార్మికుల్ని పాతాళంలోకి తొక్కేసి కంపెనీలు పెట్టుబడులను ఆలింగనం చేసుకుంటున్నది. రౌడీలను, దొంగలను నాయకులుగా కీర్తిస్తున్నది. ఆయనకిద్దరూ ఈయనకు ముగ్గురంటూ స్త్రీని కించ పరుస్తూంది. నాయికను ఒక మాంసపు ముద్దగా, ఒక అంగడి సరుకుగా ప్రదర్శిస్తు న్నది. బూతుల్నే నీతులుగా పలికిస్తున్నది. హాస్యం కోసం సకల మానవీయ విలువలనూ ధ్వంసం చేస్తున్నది. ఇక "ఈ మట్టిలోనే పుట్టాము" అనే మాటకు రెలవెన్స్ ఎక్కడుంటుంది? మట్టి కబ్జా సరుకు మారిన నేపథ్యంలో ఇలాంటి పాటలు దుఃఖాన్నే మిగిలిస్తాయి. పంట పొలాలు వ్యాపారాల భావనలకు కేంద్రాలయిపోతున్నప్పుడు మనిషికి మనిషికి మధ్య తల్లిదండ్రులకు పిల్లలకు మధ్య, భార్యకు భర్తకు మధ్య డబ్బు నిర్ణాయక పాత్ర నిర్వహిస్తున్నప్పుడు "డబ్బును మించిన దైవం లేదు" అన్నది ప్రజల సెంటిమెంటుగా మారిపోతున్నప్పుడు "మట్టిని మించిన దైవం లేదు" అనుకోవడం ఎలా సాధ్యం?

తెలుగు సినిమా అభ్యుదయ వాదాన్ని ఊతంగా చేసుకున్న సమయంలో వచ్చిన రైతు కుటుంబంలోని ఈ పాట మాజీ వ్యవసాయదారుల తీపి గురుతుగా మిగిలిపోవలసిందేనా? రచయిత రాజ్యం మీద విజయం సాధించే కల కలగానే మిగిలి పోరాదు. మిగలదని ఆశిద్దాం.

## అనువాద కవిత

# రాముడి విచారం



తమిళ మూలం : వైరముత్తు

అనువాదం : ఆర్. శాంతసుందరి

గంగనీ కావేరినీ
కలపాలి
కరసేవకులారా వస్తారా?

అడవుల్నీ
కొండల్నీ
సరిదిద్దాలి
కరసేవకులారా వస్తారా?

దారిద్ర్యరేఖని
చెరిపెయ్యాలి
కరసేవకులారా వస్తారా?

రారు సేవకులారా
మీరు రారు

మనం
నాశనం చెయ్యటానికనే
పుట్టిన వాళ్ళం
సృష్టించడానికి కాదు

గింజల్ని తినే పక్షులు
వాటిని నాటవు

ఇది అధోగతి
సిగ్గు చేటు

స్వతంత్ర భారతం ఉన్నది
యాభై ఏళ్ళ ఎత్తులో
బానిస భారతీయుడున్నది
ఐదు వందల ఏళ్ళ పల్లంలో

ఓ పార్లమెంటూ
దారిద్ర్య రేఖ కింద వున్నది
నలభై కోట్ల మంది అన్నావు

బుద్ధి రేఖ కింద
అరవై కోట్లున్నారు
అది మట్టుకు ఎందుకు
చెప్పవు?

మతం ఒక భ్రమ
మతం ఒక నీడ
నీడతో పోరాడతావేమిటి
ఆయుధాలు పుచ్చుకుని?
మతం అనేది ఒక జీవన
విధానం
సరే
మరి హింసా ఉగ్రవాదం ఏ
రకమైన విధానం?

ఆ భవనంపై
ఎప్పుడు గడ్డపార పడిందో
అప్పట్నించీ
సరయూ నది
ఉప్పుని తనలో
కరిగించుకుంటూనే
పారుతోంది

సీతాపహరణం తరువాత
ఇప్పుడే
రాముడు
రెండోసారి శోకిస్తున్నాడు

గౌరవనీయులైన
మతవాదులారా
కొన్ని ప్రశ్నలు అడుగుతాను
చెవి ఒగ్గి వింటారా?
అయోధ్య రాముడు
అవతారమా? మానవుడా?

అయోధ్య రాముడు
అవతారమే అయితే
అతనికి
పుట్టుక అనేది ఉండదు
మరణం కూడా ఉండదు
పుట్టని వాడి కోసమా
పుట్టిన చోటు ఏదని
వెతుకుతున్నారు?

అయోధ్య రాముడు
మానవుడే అయితే
గర్భంలోంచి వచ్చినవాడు
దేవుడు కాలేదు
మానవుడి గుడి కోసమా
మసీదుని పడగొట్టారు?

చాలు
ఈ దేశంలో
యుగయుగాలుగా
రక్తం చిందుతూనే ఉంది

ఇక మీదట
చిందవలసింది
చెమట మాత్రమే

మన ఆకాశాన్ని
ఎంతో కాలంగా
గ్రద్దలు ఆక్రమించేశాయి

ఫరవాలేదు
ఇప్పటికైనా
పావురాలని ఎగరనిద్దాం

**(6-12-92న బాబ్రీ మసీదు పడగొట్టినపుడు మనసు గాయపడి రాసిన కవిత)**

# కదిలే మేఘమే - నడుం



డా॥ ఎ. విజయభాస్కర్‌రెడ్డి

నడుం - నదిలాంటిదే కాదు
కదిలేటి మేఘమే
మెరిసేటి చెమటతో అది
ఆడైనా మగైనా
వయసేదైనా కాని
నడుం వంచితేనే పని
నడుమ నడుమ సేద దీరుతే చాలు
పరుగులు తీసే సెలయేరే అది
కాయకష్టం చేసుకునే వారికి
నడుం నొప్పి వస్తే సాగదు పని

పస్తులుండాలి - పని లేక
నడుం సాగితేనే నడక సాగుతుంది
లేదంటే పని ఆగుతుంది
నడుం మనిషికే కాదు
పనికే ఆయువు పట్టు

నడుం వాలిస్తే నిదుర వస్తుంది
నడుం వంచితే పని చేస్తాము
నడుం సాగితే నడక సాగుతుంది
నడుంకు కావాలి విశ్రాంతి
పరుగులు తీసే పనుల నడుమ
నడుం నది లాంటిదే కాదు
కదిలేటి మేఘమే మరి
ఆడైనా మగైనా
శ్రమైక జీవులకు
వయసేదైనా కాని
నడుం వంచితేనే పని

# వాసిరెడ్డి సీతాదేవి జీవితం - సాహిత్యం



కె.పి. ఆశోక్ కుమార్

నేను మార్క్సిస్టును, రచయితకు మార్క్సిస్టు దృక్పథం లేకపోతే ఆ రచన అసంపూర్ణమూ, అపరిమితం అవుతుంది. సాహిత్యమూ, రాజకీయమూ నా దృష్టిలో వేరు వేరు కాదు. అందుచేతనే ఈ దేశంలో రచయితలు విధిగా రాజకీయాల్లో పాల్గొని తీరాలి "అని చెప్పిన వాసిరెడ్డి సీతాదేవి మాటల ఆధారం గానే వారి జీవితాన్ని, జీవన దృక్పథాన్ని, సాహిత్య సృష్టిని విశ్లేషించు కోవాల్సిన అవసరముంది.

ఆమె పుట్టింది ప్యూడల్ వ్యవస్థలో, పెరిగింది సంప్రదాయవలయంలో, సాధారణ రైతు కుటుంబంలో ఆమె చేబ్రోలులో గడిపిన బాల్యం విధులు– నిషేధాల మధ్య గడిచింది. చిన్నప్పటినుండి తన చుట్టూ, తన ఉళ్ళో స్త్రీలపట్ల కొనసాగే వివక్షను – అణచివేతను, కుటుంబ హింసను ప్రత్యక్షంగా చూసిన సీతాదేవిగారు వాటిని ప్రశ్నించడంతోనే ఆమెలో చైతన్యం అంకురించిందనే చెప్పాలి. సమాజంలో సర్వసామాన్యమైపోయిన, స్త్రీలే ఆమోదించిన వివక్షత పట్ల– ఆధిక్యతా ధోరణులు, హింసతో కూడిన కుటుంబజీవనం పట్ల ఆమెకు అసహ్యం పెరిగింది. స్త్రీలకు స్వంత వ్యక్తిత్వం లేకుండా చేసేసి వారిని పనిమనుషులుగా, భోగవస్తువులుగా మార్చేసే వివాహ వ్యవస్థను ఈసడించుకుంది. ఈ భావాలతోనే ఆమె వివాహానికి దూరంగా తన జీవితాన్ని తనకు నచ్చిన తీరులో మలచుకొని బ్రతికింది. అలా బ్రతకవచ్చని ఆమె నిరూపించింది. ఆమె జీవనపోరాటం గురించి ఆమె మాటల్లోనే చెప్పాలంటే.... రచనలు చేయడమంటే ఒక కాల్పనిక ప్రపంచాన్ని పాఠకుడి కళ్ళముందు ఆవిష్కరించడం కాదు. సీతాదేవి తన అనుభవాల నుండి, తన చుట్టూ పనులు జరిగే సంఘటనల నుండి ప్రేరణ పొంది, వాటిని తనదైనా కోణంలో విశ్లేషించే క్రమంలో రచనలు చేయడం మొదలుపెట్టారు. 1950లో మొదలుపెట్టిన కథా రచన 1955 వరకు నిర్విఘ్నంగా కొనసాగింది. ఎనిమిదేళ్ళ గ్యాప్ తర్వాత 1963లో 'అడవిమల్లె' నవలకు శ్రీకారం చుట్టారు. ఆంధ్రప్రదేశ్ మాసపత్రికలో సీరియల్‌గా వస్తూ అశేష ప్రజాదరణ పొందిన "అడవి మల్లె" నవల, ఆ రోజుల్లో వచ్చే సినిమాలను – నవలలను జ్ఞాపకం తెస్తుంది, చంద్రం, హేమ, గౌరిల ముక్కోణపు ప్రేమకథ ఇది. ఆప్యాయతలు, అనురాగాలు, ప్రేమలు, అపోహాలు, అపార్థాలు అన్నీ కలగలసి ఒక నవలలా విస్తరించాయి.

### మాగ్నం ఓపస్... మట్టిమనిషి

వాసిరెడ్డి సీతాదేవి నవలల్లో 'మాగ్నం ఓపస్'గా అభివర్ణింపబడిన నవల "మట్టిమనిషి", ఇది మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగి, మట్టిని నమ్ముకొని, మట్టిని బంగారంగా మార్చుకొని, చివరకు సర్వస్వాన్ని కోల్పోయి అ మట్టిలోనే కలిసిపోయిన 'మట్టి మనిషి' సాంబయ్య కథను చెబుతుంది. ఇది సాంబయ్య, వరూధిని, రవి అనే వ్యక్తులకు సంబంధించిన మూడుతరాల కథ. ఇందులో కండలు కరిగించి, చెమటోడ్చి మట్టికొాక వైభవాన్ని సంతరించిన శ్రమజీవి సాంబయ్య. విశృంఖల ప్రవర్తనతో వికారపు ప్రలోభాలతో ఆ మట్టి వైభవాన్ని కాలరాచి, జీవితంలో భంగపడిన హతభాగ్యురాలు వరూధిని. తనను తాను వెంకటపతి కుమారుడిగా గానో, వరూధిని కొడుకు గానో క్లెయిమ్ చేసుకోలేని స్థితిలో సగర్వంగా సాంబయ్య మనవడినని చెప్పుకోగలిగిన పదేళ్ళ పసివాడు రవి. రైతుకు భూమితో గల అనుబంధాన్ని ఈ నవల అద్భుతంగా చిత్రీకరించింది.

పొట్ట చేతబట్టుకుని ఉత్తరాదినుంచి వలసవచ్చి వీరభద్రయ్యగారింట్లో పాలేరుగా చేరి పొలం కౌలుకు చేస్తూ, మిగుల్చుకున్న డబ్బుతో చిన్నరైతుగా పరిణమించిన వెంకయ్య కుమారుడు సాంబయ్య, నిరుపేదగా ఆ ఊరు వచ్చిన సాంబయ్య కేవలం తన మొండి పట్టుదలతో, నిరంతరశ్రమతో లక్షాధికారి అయ్యాడు. భూములు సంపాదించాలన్న అతని లక్ష్యానికి ఎదురొచ్చిన దేన్నీ లెక్కచెయ్యలేదు. పెళ్ళాం, బంధువులు, చివరకు కొడుకును కూడా ఆ లక్ష్యానికే బలిచేశాడు. సాంబయ్యలోని ఈ భూముల మీద వెర్రి అపేక్షను చూస్తే అతడో కర్కోటకుడనిపిస్తాడు. తాను యేళ్ళుగా శ్రమించి తాను తినకుండా ఇతరులకు పెట్టకుండా ఎంతో జాగ్రత్తగా ఎన్నో కట్టుదిట్టాలతో సంపాదించిన అతని ఆస్థినంతా వరూధిని వచ్చి కన్నుమూసి తెరచేంతలో మాయం చేసేయడం– ఏ చిత్త చాంచల్యం లేని సాంబయ్య ఒక చిన్న చాపల్యానికి లోనై ఇంతటి ఘోరపరాజయాన్ని ఎదుర్కొన్నాడు. తనను చెడి బతికినవాడుగా చూపి అవమానించిన, బతికి చెడ్డ బలరామయ్య కూతురు వరూధినిని తన కొడుకు వెంకటపతికి చేసుకుని బలరామయ్య అహంమీద దెబ్బ తియ్యాలన్న ప్రతికారవాంఛ సాంబయ్యలో ప్రవేశించింది. అదే సాంబయ్య కొంపదీసింది. అయితే సర్వస్వాన్ని కోల్పోయినా సాంబయ్య లోని చేవ ఆఖరుక్షణం వరకు చావలేదు. అంత కష్టపడి సంపాదించిన ఆస్తి పోయినప్పుడు ఇంకెవరైనా గుండెపగిలి చావాల్సిందే. కాని సాంబయ్య శ్రమను నమ్ముకున్న వ్యక్తి, తన శ్రమతో మళ్ళీ అంత ఆస్తిని సంపాదించగలనన్న ఆత్మవిశ్వాసం అతన్ని ఆఖరు క్షణం వరకు వదలలేదు. చివరి క్షణం వరకూ అతడు జీవితంతో పోరాడుతునే

## అయిదో తరగతి నుంచి ... అక్షర శిల్పాల వరకు ...



అయిదవ తరగతి చదివి, నాలుగు హిందీ మాటలు నేర్చి, మరొక మహాపట్నం చేరాను. ఒక చిన్న పాఠశాలలో నెలకు ముప్పైఅయిదు రూపాయలతో జీవితయాత్రను ప్రారంభించిన నేను, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డైరక్టర్‌గా రిటైర్ అయ్యాను. ముందూ వెనుకా ఎటువంటి రక్షణలు ఏర్పాటు చేసుకోకుండానే ఒంటరిగా ఇంతదూరం పయనించాను. మరి ఈనాడు తల్లి దండ్రులు చదివిస్తూంటే హాయిగా కాలేజి చదువులు చదివి, ఉద్యోగాలు చేస్తూ, భర్త బాధ పెడుతున్నడంటూ ఆత్మహత్యకు పాల్పడుతున్న స్త్రీలను గురించి ఏమనుకోవాలి? అలా ఎందుకు చేస్తున్నారు?... వ్యష్టిగా, సమిష్టిగా స్త్రీలు పోరాటాలు చేస్తున్న ఈ రోజుల్లో కూడా 'తాళి' అనే బ్రహ్మ పదార్థం చుట్టూ, ఈ వ్యవస్థ అల్లిన భావజాలం నుంచి బాగా చదువుకున్న స్త్రీలు కూడా బయటపడలేకపోవడం చూస్తుంటే అంతులేని కోపం వస్తుంది. చదువుని ఉద్యోగం చేసే స్త్రీ కూడా మగవాని అండలేకపోతే ఈ సమాజం తనను బతకనివ్వదని నమ్ముతూ, భర్త పెట్టే బాధలకు కుమిలిపోతూ చచ్చుదద్దమ్మలాగా బతకడం చూస్తుంటే ఆ చెంపా ఈ చెంపా వాయించి ధైర్యం చెప్పాలని పిస్తుంది.... అంత అమాయకంగా, చిన్న వయస్సులో ఒంటరిగా, స్వతంత్రంగా జీవితం ప్రారంభించిన నన్ను ఈ సమాజం ఏమి చేయలేకపోయింది, ఈ పురుషాధిక్య సమాజంలో ఏ మగవాడు ఎప్పుడూ నన్ను అవమానించలేదు. అందుకు కారణం మగవాడి దౌర్జన్యం కాదు. నాలోని ఆత్మవిశ్వాసాన్ని, ధృఢంగా నిలబడిన వ్యక్తిత్వాన్ని చూస్తూ ఏ మగవాడిలో నన్ను అవమానించే సాహసం లేకపోయింది. ఆత్మవిశ్వాసంతో ధైర్యంతో, ఒక లక్ష్యంతో ముందుకు సాగిపోయే స్త్రీని ఈ సమాజం కానీ, ఈ పురుషాధిక్యం కాని ఏమిచేయదనీ, చేయలేదనీ చెప్పడం కోసమే ఈ ఉపోద్ఘాతం

అంటారు. నా సాహితీ యాత్రా, జీవిత యాత్రా వేరు వేరు కావు. ప్రశ్ననుంచే నా జీవితం ప్రారంభమయింది. ప్రశ్న నుంచే నా సాహితీ జీవితం కూడా ప్రారంభ మైంది.... నా చుట్టూ వున్న ప్రకృతిని, జీవితాన్ని చూసి కుతూహలంతో ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి, చదువు సంధ్యలు లేని మా అమ్మను విసిగించి తిట్లు తిన్నప్పుడు రాశాను. ఆరుబయట మంచం మీద పడుకుని ఆకాశంకేసి చూస్తున్నప్పుడు నా చిన్న బుర్రలో తలెత్తిన ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి అవుతూ రాశాను. ఆడపిల్లలతో అమ్మలాటలు, బొమ్మలాటలూ, ఆడవలసిన నేను మగపిల్లలతో గోళీలు, బచ్చాలు ఆడి దెబ్బలు తిన్నందుకు కాక నీవు ఆడముండవు, బొమ్మల పెళ్ళిళ్ళు చెయ్యి, అమ్మానాన్నలు ఆటలు ఆడుకో, మగపిల్లలతో ఆటలేమిటి? అని నన్ను శాసించినప్పుడు అంతరాంతరాల్లో ఏదో తిరగబడుతున్నట్లె ఏడుస్తూ రాశాను. మొగుడు కొట్టినందుకు కాక, అల్లుడు చూశాడనే అవమానం భరించలేక కోనేట్లో పడి చచ్చిన ఆదెమ్మ శవాన్ని చూసినప్పుడు రాశాను. వీధి బడిలో అయిదవ తరగతి పాసవగానే చదువు మానిపించి ఇంట్లో కూర్చోబెట్టినందుకు కుమిలిపోతూ రాశాను. పదేళ్ళు కూడా నిండని నన్ను రోడ్డుకు అవతలిపక్కనున్న మిడిల్ స్కూల్‌కు వెళ్ళకూడదని అంక్షలు విధించినప్పుడు ప్రతిఘటిస్తూ రాశాను. కోనేట్లో ఎప్పుడూ ఆడవాళ్ళు శవాలే ఎందుకు తేల్తాయి. మగవాళ్ళ శవాలు ఎందుకు తేలవు. అనే ప్రశ్నలు వేధించినప్పుడు రాశాను. ఎప్పుడూ మగవాడే ఆడదాని జట్టుపట్టుకొని రోడ్డుమీదకు ఎందుకు ఈడుస్తారు అన్న ప్రశ్నకు జవాబు దొరకనప్పుడు మధనపడి రాశాను. నా చుట్టూ వున్న జీవితం గురించిన ప్రశ్నలు – తెలిసీ తెలియని సమాధానాలు నా మస్తిష్కమే కాగితంగా, నా ఆలోచనలే కలంగా రాశాను.

వున్నాడు. తాను పూర్తిగా చితికిపోయినప్పటికీ అతడు ఆ వూళ్ళో ఎవర్నీ దేహీ అని అడగలేదు. కనకయ్యలాంటి దళారుల ఎదుట సాంబయ్య తలవంచలేదు. ఆనాటి నుండి ఈనాటి వరకూ ఈ దేశంలో మట్టిని నమ్ముకుని రాత్రింబవళ్ళు శ్రమించి పంటలు పండించే అసంఖ్యాకులైన వ్యవసాయదారులలో ఈ నవలలోని సాంబయ్య గొప్ప ప్రతినిధిగా నిలుస్తాడు.

నవలలో సాంబయ్యకు ప్రత్యర్థి వరూధిని. భిన్న ధృవాలు. సాంబయ్య భూమినే నమ్ముకుంటే, వరూధిని డబ్బును నమ్ముకుంటుంది. సాంబయ్యకు పల్లెటూరు ఆశ్రయమైతే, వరూధినికి పట్టణమే ఆశ్రయం. తన జీవిత లక్ష్యాన్ని సాధించడానికి సాంబయ్య తన శ్రమను నమ్ముకుంటే, వరూధిని తన అందాన్ని నమ్ముకుంటుంది. సాంబయ్య భూస్వామ్య విధానాన్ని, తద్వారా వ్యవసాయాన్ని నమ్ముకుంటే, వరూధిని పెట్టుబడిదారీ విధానాన్ని, తద్వారా సులభంగా డబ్బు తెచ్చిపెట్టే వ్యాపారాన్ని నమ్ముకుంటుంది.

ఒకప్పుడు బాగా బ్రతికిన తమ కుటుంబం ఆర్థికంగా చితికిపోవడం వల్లనే తను సాంబయ్యలాంటి అనాగరికుడికి కోడలుగా వెంకటపతిలాంటి మొద్దుకు భార్యగా ఆ ఇంటికి రావలసి వచ్చిందన్న కసి, ఆ ఇంటిమీద – ఆ ఇంట్లోని మనుష్యులమీద పగ తీర్చుకోవాలన్న ప్రతికార వాంఛ వరూధినిలో ప్రవేశిస్తాయి. చిన్న నాటినుండి కొడుకు వెంకటపతిని తనలో బానిసగా పెంచాడు సాంబయ్య. తన కొడుకు పట్ల సాంబయ్యకు పెద్ద ఆశలు లేవు. తన లాగే భూమిని దున్నుకుని, భూమిని నమ్ముకుని బతికితే చాలనుకున్నాడు. చదువుకుంటే వెంకటపతి నాగరికుడులా ఆలోచించి ఉన్న భూములను అమ్ముకుని పట్నానికి వెళ్ళిపోతాడని సాంబయ్య భయం. అందుకే సాంబయ్య వెంకటపతిని చదివించలేదు. వెంకటపతిని తాను గీసిన గీటును దాటకుండా ఉండేట్టుగా పెంచాడు సాంబయ్య. అలాంటి వెంకటపతి వరూధినిని పెళ్ళి చేసుకోగానే పెళ్ళానికి బానిసైపోయి తండ్రి మీద తిరగబడతాడు. పల్లెటూర్లో తను కోరుకునే విలాసజీవితం లభించదని తెలుసుకున్న వరూధిని త్వరలోనే నగరానికి భర్తతో సహా ప్రయాణం సాగుతుంది. భర్తను సాంబయ్య మీదకు ఉసిగొల్పి అతని దగ్గర మూలుగుతున్న

డబ్బుంతా తన చేతుల్లోకి తీసు కుంటుంది. వరూధినికి పట్టణ జీవితం లోని సుఖాలన్నీ కావాలి. విలాసవంత మైన జీవితం కావాలి. రామనాథబాబు పైకి ఎంతో నాగరికుడిగా కనిపించే పెట్టుబడి దారుడి సాహచర్యం కావాలి. భర్త వెంకటపతి మీద ప్రయోగించిన అస్త్రాన్నే వరూధిని రామనాథబాబు మీద కూడా ప్రయోగిస్తుంది. తన అందానికి, తానిచ్చే సుఖానికి రామనాథ బాబు లొంగిపోతాడని, తనకోసం ఏమైనా చేస్తాడని వరూధిని అనుకుంటుంది. కాని రామనాథ బాబు వెంకట పతిలాగా ఏ గాడిలో పడిపోతే ఆ గాడిలోనే గుడ్డిగా వెళ్ళే రకం కాదు. రామనాథబాబు చాలా తెలివైనవాడు. తేనెపూసిన కత్తి. వంచన అతని ఆయుధం. వరూధిని అందాన్ని, ఆస్తిని కొల్లగొట్టి ఆమెను సర్వనాశనం చేసి వదులు తాడు రామనాథ బాబు. వరూధిని సాంబయ్యను మోసం చేస్తే, రామనాథబాబు వరూధినిని నాశనం చేస్తాడు. తన అందంతో ఈ ప్రపంచాన్ని గెలవగల ననుకున్న వరూధిని ఘోరంగా వోన పోవడాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసు కుంటుంది. సాంబయ్యకు వరూధినికి మధ్య సంఘర్షణ అనివార్యం. ఈ సంఘర్షణలు తాత్కాలికంగా వరూధిని గెలుస్తుంది. సాంబయ్య ఆరిపోతాడు. అయితే వరూధిని గెలుపు చివరకు ఆమె పతనానికి దారితీస్తుంది. సాంబయ్య ఓడినా నైతికంగా అంతిమ విజయం అతనిదే.

కష్టార్జితం తరలిపోయినా సాంబయ్య ఓటమిని అంగీకరించక ఊళ్ళో కూరగాయలు పండిస్తూ బతుకు వెళ్ళ దీస్తుంటాడు. తల్లిదండ్రులకు దూరమైన సాంబయ్య మనవడు రవి తాత దగ్గరకు చేరి తాను ఒక మట్టి మనిషిగా మారుతాడు. రవి, సాంబయ్య కలసి సాగుచేసిన బంజరులో పండించుకున్న పంటను దోచుకుపోవడానికి కనకయ్య ఒక రాజకీయ బాధితుడ్ని, పోలీసుల్ని వెంట తీసుకుని వస్తాడు. ఆ బంజరులో పండిన పంటంతా తనదికాదన్న మాట వినగానే నేలకూలిపోతాడు సాంబయ్య. తన తాతాగారి మరణానికి కారకులైన కనకయ్య, రామానందం మీద దౌర్జన్యం చేసాడన్న సాకుతో, తాతగారి శవానికి దహన సంస్కారాలు కూడా చెయ్యనివ్వకుండా రవిని పోలీసులు అరెస్టు చేసి తీసికెళ్తారు. వెళ్తూ వెళ్తూ రవి కనకయ్యతో "వస్త్రానా వస్తా- తెస్తా నీకోసం తుపాకి" అని రవితో అనిపించడంలో రచయిత్రి ఉద్దేశమేమిటో తెలుస్తూనే వుంది. సమాజంలోని ఉత్పత్తి పద్ధతులనూ, వర్గ సంబంధాలనూ, వివిధ మానసిక ప్రవృత్తు లనూ, వాటికి గల ఆర్థిక కారణాలు విశ్లేషిస్తూ, మూడుతరాల జీవితాలు చోటు చేసుకున్న వివిధ వారి రూపాలను రచయిత్రి అద్భుతంగా చిత్రీకరించారు.

### సమాజ దర్పణం : సమత

'మట్టిమనిషి' లోని వరూధినికి 'సమత'లోని అరుంధతికి చాలా పోలిక లున్నాయి. అసాధారణమైన అందచందాలు, తెలివితేటలు కలిగి ఉన్న దానితో సంతృప్తి పడలేక, తమతో ఏవిధంగానూ సరితూగలేని తమ చుట్టూ వున్న మనుషుల్ని భరించలేక, ఏదో సాధించాలన్న తపనతో రగిలిపోతూ, నిరంతరం దేనికోసమో అన్వేషిస్తూ, ముందు వెనకా చేసుకోలేక పరిస్థితుల వత్తిడికి తట్టుకోలేక, సమాజపు తాకిడికి నాశనమైపోయే ఆధునికయుగపు స్త్రీ మూర్తులకు వారు ప్రతినిధులుగా నిలిచిపోతారు.

పుట్టినప్పటి నుండి ఆడది ఏమి చెయ్యకూడదో, ఎలా నడచుకోవాలో బోధించే అలవాటు వుంది కాని – ఆడదాని హక్కుల గురించి గాని, అధికారం గురించి గాని ఆలోచించే అవసరం మొదటి నుంచి మనకు లేకుండా పోయింది. స్త్రీ ఎన్ని కష్టాలు భరిస్తే అంత పేరు సంపా దించుకోగలదు. ఆమె వల్ల ఇటు పుట్టి నింటికి, అటు మెట్టినింటికి సంబంధించిన రెండు వంశాల గౌరవం ఇనుమడించాలి. కాని అరుంధతి తన కోసం, తరతరాలుగా నిర్దేశింపబడిన స్థానం – ఆ నాలుగు గోడల మధ్య స్థానం – దాన్ని వదిలేస్తుంది. తనకూ ఓ వ్యక్తిత్వం వుందని గుర్తిస్తుంది. అదే ఆమె చేసిన మొదటి తప్పు. సంఘం దాన్ని సహించలేకపోతుంది. వ్యక్తిత్వం పేరిట సుఖంగా సాగిపోయే తన జీవితాన్ని తాను నాశనం చేసుకోవడమే కాకుండా తన అనాలోచిత నిర్ణయాల వల్ల భర్త, కూతురి జీవితాలను కూడా నాశనం చేసిన అరుంధతి ప్రవర్తన పాఠకుడి సానుభూతిని పొందలేక పోవచ్చు. మొండి పట్టుదల, తాను అనుకున్నదే కావాలనే మనస్తత్వం వల్ల అరుంధతి రాబోయే పరిణామాల్ని పసిగట్ట లేకపోతుంది. వివాహ వ్యవస్థ లోని కట్టు బాట్లు, నియమాలను ఉల్లంఘిస్తే వారి జీవితాలు ఎంత విషాదకరంగా ముగుస్తాయో తెలిపే అరుంధతి జీవిత చరిత్రే "సమత" నవల.

1967–68 ప్రాంతంలో వెలువడిన 'సమత' నవలలో వివాహబంధంలో ఇమిడలేక అందు లోంచి బయటపడ్డ ఒక స్త్రీ జీవితాన్ని చిత్రీకరి స్తూనే, అప్పటో ఆంధ్రదేశపు రాజ కీయ, సామాజిక వాతావరణ చిత్రాలకు కూడా ప్రాధాన్యత నివ్వడం ఇందులో కనిపిస్తాయి. పరి స్థితుల ప్రభావం వల్ల ఈ నవలలో అరుంధతి వివాహ బంధం లోంచి బయటపడి అనాడు అత్యంత ప్రముఖమైన రాజకీయనాయకుడిగా చలామణి అవుతున్న రాజారావుకు ప్రేయసిగా మారుతుంది. రాజారావు చేత పనిచేయించుకోవాలంటే అరుంధతిని ఆశ్రయించాలి. సమాజంలో ఎంత ఉన్నత స్థాయిలో వున్న వాళ్ళందరిని అరుంధతి కసిగా తన చుట్టూ తిప్పుకుంటూ తనను దెబ్బ తీసిన ఈ పురుషాధిక్య సమాజంలో ప్రతీకారం తీర్చుకుంటున్నట్లుగా సంతోషిస్తుంది. చివరి కావె జీవితం విషాదాంతంగానే ముగుస్తుంది ఈ నవల చదువుతుంటే ఫ్రెంచి రచయిత ఫ్లాబేర్ రచించిన "మేడమ్ బోవరి", టాల్‌స్టాయి రాసిన "అనాకెలినినా", రవీంద్రనాద్ ఠాగూర్ రాసిన "చారులత" జ్ఞాపకం వస్తాయి. ఈ మూడు నవలల్లోనూ వివాహబంధంలోంచి బయటపడాలని తపించిన స్త్రీల జీవితాలు విషాదంగానే ముగుస్తాయి.



మాతృమూర్తితో సీతాదేవి



సోదరుడు నారాయణరావుతో సీతాదేవి

### మరీచిక

ఈ కాలపు ఉత్తమ నవలల్లో ఒకటి మరీచిక 1978లో ఆంధ్రభూమి వారపత్రికలో

సీరియల్‌గా వచ్చి 1979లో పుస్తకరూపంలో వెలువడింది, వెలువడిన మూడేండ్లకు అ పుస్తకాన్ని ప్రభుత్వం నిషేధించి సంచలనం సృష్టించింది. ఏముంది ఇందులో? రెండు సంపన్న నాగరిక కుటుంబాలకు చెందిన ఇద్దరు స్నేహితులైన విద్యార్థినులు శబరి–జ్యోతి. ఒకరు హిప్పీ సంస్కృతి సాలెగూడులో చిక్కుకుని ఆహుతికాగా, మరొకరు విప్లవాత్మక భావాలకులోనై నక్సలైట్ ఉద్యమం చేత ప్రేరణ చెంది తన గమ్యాన్ని ఆవైపుకు నిర్ణయించు కుంటుంది. ఇద్దరూ తాము చేసిన పొరపాటును గ్రహిస్తారు. జ్యోతికి తన గమ్యాన్ని మార్చుకోగలిగిన అవకాశం లభిస్తుంది. హిప్పీ సంస్కృతి విష వలయంలో చిక్కుకున్న శబరి మాత్రం బయటపడలేకపోతుంది. వారిద్దరూ రెండు మార్గాలకు ప్రతినిధులు. ఈ రెండు కూడా తీవ్రవాదాలే అని చెప్పడమే రచయిత్రి ఉద్దేశం. ఇందులో యువత పెడత్రోవ పట్టడానికి గల కారణాలను విశ్లేషించడమే కాకుండా, నక్సలైట్ ఉద్యమం పట్ల ఒక శాస్త్రీయమైన అవగాహన కల్పించారు.

ఇందులో ఉద్యమం గురించి “చెట్ల మధ్య నుంచీ, గుట్టల మధ్య నుంచి చైతన్య స్వరూపులైన మనుష్యుల వద్దకు వెళ్ళి వాళ్ళలో ఒకరిగా తిరుగుతూ, వాళ్ళమధ్య బ్రతుకుతూ, పీడిత ప్రజల్లో చైతాన్యాన్ని రగుల్కొల్పు. అందునుంచే వర్గపోరాటం ఉద్భవిస్తుంది. ఆ వర్గపోరాటమే సాయుధ పోరాటానికి మార్గాన్ని మలుస్తుంది’’ అని రచయిత్రి తెలియజేస్తుంది. నక్సలైట్ల కార్యకలాపాల్ని, వారి రహస్య జీవితంలోని జీవన విధానాన్ని, కోడ్ భాషను, క్రమశిక్షణను వివరంగా, అతి సమర్ధవంతంగా తెలియజేశారు.

ఈ నవల తెలియజేసిన మరో ప్రపంచం హిప్పీల ప్రపంచం. ఈ సమాజం లోని రొటిన్ జీవితం నుంచి, హిపోక్రసీ నుంచి పలాయనవాదం పఠించి ప్రమాదకరమైన మత్తుమందులకు బానిసలై, స్వప్నజగత్తులోనే ఎల్లవేళలా విహరించాలి అని కోరుకోవడమే హిప్పీల జీవితం. వాళ్ళు తమ జీవితం గొప్పదని సమర్ధించుకోవడానికి పురాతన సంస్కృతిని ఎత్తి చూపుతారు. రాతియుగం మనుష్యుల్లా స్వేచ్ఛగా బ్రతకాలనే ఆశయంతో కొత్త అనుభవాల కోసం డ్రగ్స్‌ను అశ్రయిస్తారు. అందుకే రచయిత్రి వారిని “ఈ ఇరవయ్యవ శతాబ్దపు నాగరికతకు పుట్టిన వికృత శిశువులు” అంటారు. ఈ హిప్పీల జీవన విధానాన్ని, వాళ్ళ అనుభవాలను, వాళ్ళు వాడు మత్తుమందుల వివరాలను చిత్రీకరించడంలో రచయిత్రి గొప్ప నేర్పును చూపారు. ఈ హిప్పీ విశ్వవిద్యాలయంలో చిక్కుకున్న అభాగ్యురాలు శబరి. శబరి యొక్క అవ్యవస్థకు ఆమె కుటుంబ వాతావరణమే కారణభూతమన్న అంశాన్ని రచయిత్రి స్పష్టంగా తెలిపారు. ఏదో అసంతృప్తి ఆ రొటీన్ జీవితం పట్ల ఏహ్యాభావంతో, కుటుంబ జీవితం నుంచి బయటపడాలన్న తాపత్రయంతో శబరి హిప్పీల్లో కలసిపోతుంది. ఇక జ్యోతి ఆదర్శవంతుడైన తండ్రి పెంపకంలో ప్రత్యేక వ్యక్తిత్వాన్ని, చైతన్యాన్ని సంతరించుకుంటుంది. సామాజిక అవసరాలకు అనుగుణంగా తన నడవడిని రూపొందించుకుంటుంది. జ్యోతి పాత్ర ద్వారా రచయిత్రి యువతరంలో ఆదర్శానికి – ఆచరణకు మధ్య జరిగే సంఘర్షణలు బలంగా


వాసిరెడ్డి సీతాదేవి

చిత్రీకరించారు. జీవిత సమస్యల్ని నైతిక బలంతో, ఒక శాస్త్రీయ అవగాహనతో ఎదుర్కొని పరిష్కరించు కోవడానికి ప్రయత్నించాలి జీవితమే ఒక ‘మరీచిక’లా మారుతుందని ఈ నవల తెలియజేస్తుంది.

### రాబందులు - రామచిలుకలు

పంచాయితీ రాజ్ వ్యవస్థలోని అరాచకత్వాన్ని, అవినీతిని, వాళ్ళ రాజకీయాలను తేటతెల్లం చేసిన నవల “రాబందులు – రామచిలుకలు” స్వాతంత్ర్యం కోసం ఆస్తినంతా ధారబోసి లాఠీదెబ్బలు తిని జైళ్ళకు వెళ్ళిన గాంధేయవాది ధర్మయ్య ఆదర్శవాది, త్యాగమూర్తిగా మిగిలిపోయారు. పొగడ్తలకు లొంగక, నిరాడంబర జీవితంతో, ఇతరుల మంచి కోసం నిస్వార్ధంగా పాటుపడే ధర్మయ్య నిన్నటి తరానికి ప్రతినిధి. స్వాతంత్ర సమరయోధుడిగా అవార్డులు, భూములు తీసుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించి, అది తన కర్తవ్యంగా భావించిన నిస్వార్ధ జీవి. పదవుల కోసం రాజకీయాలు నడిపి దాని కోసం రక్తసంబంధీకులైన అడ్డు తొలగించు కోవాలనుకునే పరమేశం, సమితి ప్రెసిడెంట్‌గా అవినీతిపరుడైన నరహరి నాసిరకం కాంట్రాక్టులతో ప్రజాధనం కొల్లగొట్టే లూ అనే కాంట్రాక్టరూ, సోషల్ వర్కర్ ముసుగులో రాజకీయాలు నడిపే మిసెస్ వైకుంఠం, అధికార వర్గాలకు పెంపుడు కుక్కలా పనిచేసే పుణ్యశ్రీ అనే పత్రికా సంపాదకుడు – వాళ్ళంతా ఈ వ్యవస్థను తొలిచేసే చీడపురుగులు. ధర్మయ్య ఆశయాలకు అనుగుణంగా పెరిగిన సునంద సంఘసేవికగా మారి ప్రజలకు నిస్వార్ధంగా సేవ చేయాలనుకుంటే ఎక్కడికక్కడ అడ్డంకులు. గ్రామీణ వ్యవస్థలో గూడుకట్టుకొని వున్న అవినీతిని ఎదిరించబోయి ఆమె ఎన్నో అవమానాలకు గురవుతుంది. చివరకు తన వ్యక్తిగత జీవితాన్ని ప్రజాసేవకే వినియోగించడానికి ఆమె చేసిన ప్రయత్నంలో తన వైవాహిక జీవితమే విచ్ఛిన్నమైనా వెనుదీయక తాను నమ్మిన ఆశయాలకే కట్టుబడి వుంటుంది. వారేకాక ఆడంబరాలకు, అతిశయాలకు పోయి విలాస జీవితాన్ని గడిపే పరమేశం కూతురు రాణి, విలాసవంతమైన జీవితాన్ని కోరుకొని తప్పటడుగులు వేసిన లలిత – ఇలా రకరకాల మనస్తత్వాలు కలిగిన వ్యక్తులు మనకు ఇందులో తారసపడతారు. మంచికి, చెడుకు మధ్య జరిగిన పోరాటంలో చివరకు ధర్మమే గెలిచి కథ సుఖాంతమవుతుంది.

### దారిద్ర్యం

దారిద్ర్యం ఎంత భయంకరమైనదో, అది కుటుంబ సభ్యుల మధ్య వుండే అనుబంధాలను కూడా ఎలా నాశనం చేస్తుందో విచారించే నవల ‘మృగతృష్ణ’. దారిద్ర్యాన్ని భరించలేక తల్లి ఆత్మహత్య చేసుకోవడం, అన్నయ్య జైలుపాలు కావడం, తమ్ముడ్ని దత్తత చేసుకోవడం, తండ్రి బైరాగుల్లో కలిసిపోతే, చెల్లిని పనిమనిషిగా ఆమె తన ఇంటికి తీసుకునిపోతే, ఏకాకిగా మిగిలిన సునందను రమణమ్మ అనే ముసలావిడ చేరదీస్తుంది. సునంద గ్రాడ్యుయేషన్ పూర్తి చేసేలోపు రమణమ్మ చనిపోవడం, దాయాదులు సునందను వెళ్ళగొట్టడంతో ఆమె ఏకాకిగా మిగిలిపోతుంది. ప్రేమించిన క్లాస్‌మేట్ రవీంద్ర అండగా నిలవడంతో చివరకు ఆమెకు ఉద్యోగం దొరుకుతుంది. అక్కడ ఆమె పట్ల ఆకర్షితుడైన ఆమె బాస్ కృష్ణ ప్రసాద్ తనను పెళ్ళిచేసుకోమని అడిగితే ఒప్పుకుంటుంది. అక్కడ రవీంద్రకు ఉద్యోగం ఇప్పిస్తుంది. జీవితాంతం అనుభవించిన దారిద్ర్యానికి దూరంగా సెక్యూరిటీ కోసం ఆమె ఈ పెళ్ళి చేసుకోవాలనుకుంటుంది. తనకంటే వయసులో పెద్ద, భార్యా వియోగి, ఇద్దరు పిల్లల తండ్రిని పెళ్ళిచేసుకోవడానికి ఒప్పుకున్నా, పాత

జ్ఞాపకాలతో ఆమె మానసిక సంఘర్షణను తట్టుకోలేకపోతుంది. అది గమనించిన కృష్ణప్రసాద్ ఆమెను రవీంద్ర దగ్గరకు చేర్చేలోపల రవీంద్ర సునంద ఫ్రెండ్ సుజాతను పెళ్ళిచేసుకొని రావడం గమనించి మూర్ఛపడిపోతుండగా కృష్ణప్రసాద్ ఆమెను పొదివి పట్టుకోవడంతో నవల ముగుస్తుంది. ఈ నవలను పాఠకుడు ఆశ్చర్యపోయే విధంగా కొసమెరుపుతో ముగించడం విశేషం. సునంద నిర్ణయం తీసుకున్న మూడు రోజులకే ఆమెను అంతగా ప్రేమించిన రవీంద్ర అంత అర్జంటుగా సుజాతను పెళ్ళిచేసుకోవడం నమ్మశక్యంగా లేకపోయినా – కథ నడిపించిన తీరు, ఆవేశం, ఆ ముగింపు షాకులా తగులుతోంది పాఠకులకు. పడిపోతున్న సునందను కృష్ణప్రసాద్ పట్టుకున్నాడని ముగించడంతో ఇక జీవితాంతం ఆమెకు అతను ఆసరాగా నిలవబోతున్నాడని మనం తెలుసుకుంటాం. ఫ్లాష్‌బ్యాక్‌లతో ఈ నవల ఒక సినిమాలా చకచకా సాగిపోతుంది.

## సావేరి

తళుకు బెళుకులతో కళ్ళు మిరమిట్లు గొలిపే సినీ ప్రపంచం ఒక నరకకూపం లాంటిది. ఆ మాయా ప్రపంచం పట్ల ఆకర్షితుడై ఆ ఊబిలో చిక్కుకుపోయేవారు కొందరు కాగా, ఆ ఊబిలోంచి బయట పడటానికి ప్రయత్నించి అందులోనే అణగారిపోయేవాళ్ళు ఎందరో. సినీ మాయా ప్రపంచాన్ని చిత్రీకరించిన "సావేరి" నవలలో రేఖ అనే నేపథ్య గాయని ప్రేమించి పెళ్ళి చేసుకున్న దత్తు అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి నుండి ప్రముఖ దర్శకుడిగా ఎదుగుతాడు. రేఖ అనుమానంతో ఎప్పటికప్పుడు అతడ్ని వేధిస్తూ, విసిగిస్తూ మనశ్శాంతి లేకుండా చేస్తుంది. తన సినిమాలో కొత్తగా పరిచయం చేసిన రజియా అనే నటి ఆకర్షణలో పడిన దత్తు, రేఖకు విడాకులు ఇవ్వలేక రజియాను పెళ్ళి చేసుకోలేక ఇద్దరి తిరస్కారానికి గురై ఆత్మహత్య చేసుకుంటాడు. తాగుడుకు అలవాటు పడిన రేఖ సర్వనాశనమైపోగా, పిల్లలు అనాథలుగా మిగిలిపోతారు. ఆ పిల్లలను తన పిల్లలుగా పెంచుకోవ డానికి రజియా సిద్ధమవడంతో నవల ముగుస్తుంది. అగ్రతారల అంగీకారాలు, దర్శకుల స్వీయ వ్యక్తిత్వం, నిర్మాతల వ్యాపార ధోరణి, రచయిత వీరంగాలు, ఎగస్ట్రా నటీ నటుల జీవితాలు, సినీ పత్రికల గాసిప్స్ – ఇలా ఒకటేమిటి సినీ పరిశ్రమలోని అన్ని కోణాలను ఈ నవల అద్భుతంగా చిత్రీకరించ గలిగింది. అయితే ఈ నవల చదువుతుంటే దత్తు స్థానంలో హిందీ నటుడు – దర్శకుడు గురుదత్, రజియా స్థానంలో వహీదా రెహమాన్ తప్పకుండా జ్ఞాపకం వస్తారు. ఇంకా కొంతమంది పాత నటీనటుల ఆనవాళ్ళు కూడా కొన్ని పాత్రల్లో కన్పిస్తాయి. సినిమా ప్రపంచం మీద వచ్చిన అతి కొద్ది నవలలో ఈ నవలకు ప్రత్యేక స్థానమున్నది.

## వైతరణి

"వైతరణి" నవలలో నాగమ్మను అపురూపంగా చూసుకునే తల్లిదండ్రులు,



**డాక్టర్ పి. భానుమతి రామకృష్ణతో వాసిరెడ్డి సీతాదేవి**

అన్నలను చూసి ఈర్ష్య పెంచుకున్న వదినలు తమకు రాబోయే ఆస్తిని కొల్లగొడుతున్నారనే ఉద్దేశ్యంతో మొదటి నుండీ నాగమ్మ మీద ద్వేషాన్ని పెంచుకుంటారు. భర్త చనిపోయి ఏ దారి లేక వారి పంచన చేరిన నాగమ్మ అన్నా, వారి బిడ్డలను మించిన అందంతో వున్న ఆమె కూతురు పార్వతి అన్నా కూడా వారికి గిట్టదు. వాళ్ళద్దర్ని ఎన్నో బాధలు పెట్టి చివరకు పార్వతిని ఒక శాడిస్టు ముసలివాడికిచ్చి పెళ్ళి చేస్తారు. ఒకప్పుడు అమిత ప్రేమ కురిపించిన అన్నలు డబ్బు యావలో నాగమ్మను పట్టించుకోకపోవడం కాల వైపరీత్యమే. తనను చదువుకోనీకుండా, తనకు సరియైన సంబంధం చూడకుండా, తన జీవితాన్ని నాశనం చేసిన మేనమామలు, ముసలి మొగుడు వంశ ప్రతిష్టలు అంటూ పాకులాడతారు కాబట్టి తాను లేచిపోయి వాళ్ళను అప్రతిష్ట పాలు చేసి తన కసి తీర్చుకోవాలని పార్వతి సూర్య నారాయణతో లేచిపోతుంది. లేచిపోయినదాని తల్లిగా తనకెక్కడా స్థానం లేదని గ్రహించిన నాగమ్మ ఆత్మహత్య చేసుకుంటుంది.

## అర్చన

"అర్చన" నవలలో ఆడపిల్ల ఎంత చదువుకున్నా తల్లిదండ్రులు ఆమెను తమ గుండెల మీద కుంపటిగానే భావిస్తారు. డబ్బుంటే పిల్ల సుఖపడు తుందనుకుంటారే గాని, ఆ మగవాడి ప్రవర్తన గురించి ఆలోచించ వలసిన అవసరం లేదనుకుంటారు. ఆడదాని శీలం గురించి మాత్రమే ఆలోచిస్తారు. ఎందుకని 'అర్చన' ప్రశ్నిస్తే మన దగ్గర జవాబు దొరకదు. చిన్నప్పటి నుండీ అర్చనతో గల ఆత్మీయత వల్ల తరుణ్‌కు స్త్రీ జాతి పట్ల అభిమానం పెరుగుతుంది. తర్వాత ఆమె శీలాన్ని అపార్థం చేసుకుని స్త్రీ జాతిని ద్వేషించిన తరుణ్ నిజాన్ని తెలుసుకుని ఆమె పట్ల గౌరవంతో స్త్రీలను, స్త్రీల సమస్యలను సానుభూతితో అర్థం చేసుకుని వారికి సహాయపడటానికి ప్రయత్నిస్తాడు.

## తిరస్కృతి

"తిరస్కృతి" నవల అచ్చం ఇప్పుడు టీవీల్లో వచ్చే సుదీర్ఘ తెలుగు సీరియల్‌ను తలపింపచేస్తుంది. ఈ నవలలో అక్కడక్కడ ముక్కోణపు ప్రేమకథలు కనిపిస్తాయి. మొదటి భాగంలో సూర్యం, సత్యం – వాళ్ళ మేనమరదలు సరళ ముక్కోణపు ప్రేమకథ. తర్వాత సత్యం – మాధవరావు – విమలల ముక్కోణపు ప్రేమకథ. సరళ – సత్యంను పెళ్ళి చేసుకోబోతూ సూర్యం వైపు మొగ్గడం, సత్యం వాళ్ళిద్దరి కోసం త్యాగమూర్తిగా వెళ్ళిపోవడం, చివరకు సూర్యం ఒక డబ్బున్న మరో అమ్మాయిని పెళ్ళి చేసుకోగా సరళ ఒంటరిదైపోయి నర్సుగా కొత్త జీవితాన్ని ప్రారంభిస్తుంది. సత్యం తన చిన్ననాటి స్నేహితురాలు విమల ప్రేమను గుర్తించకపోగా, విమలను మాధవరావు ప్రేమిస్తున్నాడు గనుక తాను వాళ్ళ మధ్య అడ్డంకిగా మారకుండా మళ్ళీ త్యాగమూర్తిగా సత్యం వెళ్ళిపోతాడు. అప్పటిలో సరళ సేవలకు ముగ్ధురాలయిన మాధవరావు తల్లి ఆమెను మాధవరావుకిచ్చి పెళ్ళి చేయబోయేంతలో అక్కడకు సత్యం రప్పించబడతాడు. మళ్ళీ ఇక్కడ సత్యం, మాధవరావు, సరళ అదనంగా విమల. దాంతో నవలను ఎలా ముగించాలో తెలియని రచయిత్రి పాఠకులకే వదిలేశారు.

ఈ నాలుగు నవలలు గ్రామీణ నేపథ్యం నుండి వెలువడినవే. ఈ నవలలలోని నాయికలు పట్టణ జీవితాల మీద మోజును

పెంచుకుని తమ జీవితాలను నాశనం చేసుకుంటారు. తల్లిదండ్రులు లేక, అయినవాళ్ళ అనాదరణకు గురైన స్త్రీలు తమ మంచి చెడ్డలను నిర్ణయించుకోలేక తాత్కాలిక ఉద్రేకంతో తొందరపడి తమ జీవితాలు నాశనం చేసుకోగా, దారిద్ర్యం – పేదరికంతో కొందరు, ప్రతీకారేచ్ఛతో కొందరు లేచిపోయి తమ జీవితాలను విషాదాంతం చేసుకుంటారు. వంచింపబడ్డ స్త్రీలు ఆత్మహత్యలు చేసుకోవడం సీతాదేవి నవలల్లో కనిపించే సాధారణ లక్షణం. ఇందులో స్త్రీల పరాధీనత గురించి, స్త్రీల వ్యక్తిత్వం గురించి, పురుషాహంకారపు ధోరణులను నిరసించే ఆసక్తికరమైన చర్చలు మనల్ని ఆలోచింపచేస్తాయి.

### తొణికిన స్వప్నం

"తొణికిన స్వప్నం" స్ప్లిట్ పర్సనాలిటీ అనే ఒక క్లిష్టమైన సైకాలజీ అంశానికి ఇది నవలా రూపం. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్‌ను అణచిపెట్టుకునే ప్రయత్నంలో తెచ్చిపెట్టుకున్న సుపీరియారిటీ కాంప్లెక్స్‌తో మనుషులు ఎలా ప్రవర్తిస్తారో తెలియజేయడానికి నిదర్శనం. రాధ తండ్రి చనిపోగా పసిగుడ్డుగా వున్నప్పుడే మేనమామ పంచన చేరి వాళ్ళ నిరాదరణకు గురై ఎన్నో అవమానాలు పడుతుంది. రాధ తన పరిస్థితుల మీద కలిగిన కసితో అందరూ వద్దంటున్నా పట్టుదలగా చదివి ఉద్యోగస్థురాలవుతుంది. చిన్నప్పటి నుండి ఆడవాళ్ళ మీద కొనసాగే ఆంక్షలు, చిన్నప్పటి సంఘటనలు, 'ఆడది ఆడది' అంటూ ఆడదాన్ని కించపరిచే ఆచారాలు, స్త్రీలను సెక్స్ ఆబ్జెక్టుగా చూసే పంతులు, ఆమెతో ఆడుకున్న చిన్ననాటి మగపిల్లలు, రంగారావు ప్రవర్తన ఆమె పసిమనసును గాయపరుస్తాయి. ఇంటా – బయటా జరిగే అవమానాలు, ఆంక్షలతో ఆమెలో ఒక విధమైన ఆత్మన్యూనతా భావం ఏర్పడుతుంది. ప్రేమ – పెళ్ళి పేరుతో మగాడి స్వార్థం, అవకాశవాదాన్ని గుర్తించిన రాధ ప్రేమ అంటేనే మండిపడే స్థితికి వస్తుంది. అలా క్రమంగా ఇన్ఫీరియారిటీ స్థితి నుండి సుపీరియారిటీ కాంప్లెక్స్‌కు చేరుకుంటుంది. రాధ సైకాలజీని డాక్టర్ రాహుల్ అర్థం చేసుకుంటాడు. ఆమె పట్ల రాహుల్ కనబరిచిన ఆదరణతో బాధలో వున్న రాధ తన మనస్సును అతనికి తెలియజేయాలనుకుంటుంది. అందుకు కూడా వెనుకాడి మానసిక ఘర్షణతో ఆసుపత్రి పాలవుతుంది. తన ఒంటరి జీవితాన్ని తలచుకొని, తాను జీవితంలో ఏం కోల్పోయిందో తెలుసుకుని పశ్చాత్తాప పడుతుంది. డాక్టర్ రాహుల్ స్వీకారంతో మొత్తానికి రాధ జీవితం సుఖాంతమవుతుంది.

### మరో మూడు నవలలు

కుటుంబ సంబంధాలన్నీ డబ్బు చుట్టే తిరుగుతాయని రచయిత్రి "మళ్ళీ తెల్లవారింది, బొమ్మరిల్లు'' నవలల్లో నిరూపించిన విధానం బాగుంది. తమ పిల్లలు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని తల్లిదండ్రులు కష్టపడి వాళ్ళను ప్రయోజకులుగా చేస్తే రెక్కలొచ్చిన పిల్లలు ఎగిరిపోగా



డాక్టర్ ఆరుద్రతో వాసిరెడ్డి సీతాదేవి

వాళ్ళ నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురియైన ముసలి తల్లిదండ్రులకు 'ఓల్డ్ ఏజ్ హోం'లే దిక్కు కావడం ఎంత విషాదకరం. అందరూ వుండి అనాథగా మారిన సుందరమ్మ ఆత్మక్షోభను అద్భుతంగా వివరించిన నవల "మళ్ళీ తెల్లవారింది", "బొమ్మరిల్లు" నవలలో తండ్రి చనిపోగా డాక్టర్ పూర్తి చేసిన రేణుక తన ప్రేమ వివాహాన్ని వాయిదా వేసుకుని ఇంటి బాధ్యతలను స్వీకరిస్తుంది. తమ్ముళ్ళను చదివించి ప్రయోజకులను చేసి, చెల్లెళ్ళను పెంచి పెళ్ళిళ్ళు చేస్తుంది. అయినా అందరూ ఆమె గురించి కాక, ఆమె డబ్బుకోసం వెంపర్లాడి పోవడం రేణుకకు బాధను కలిగిస్తుంది. విఫలమైన వివాహం ఆమెలో విర్తకిని పెంచుతుంది. అందరూ వుండి ఎవరూ లేని ఒంటరితనం – డబ్బు సంబంధాలే తప్ప రక్త సంబంధాలకు విలువలేదని తెలుసుకుంటుంది. చివరకు అన్నింటిమీద విరక్తితో ఓల్డ్‌ఏజ్‌హోం ప్రారంభించి వాళ్ళ సేవకై తన జీవితాన్ని అంకితం చేస్తుంది.

ఈ మూడు నవలలు కూడా ఏ ఆధారం లేని స్త్రీలు ఒంటరి జీవితాలు ఎలాగుంటాయో వివరిస్తాయి. ఈ మూడు నవలల్లోని స్త్రీలు తమ పరిస్థితులకు ఎదురీది తమ కర్తవ్యాన్ని ఎలా అంకిత భావంతో పూర్తి చేశారో తెలియజేస్తాయి. వాళ్ళ జీవితాలు ఎన్ని మలుపులు తిరిగినా, 'ఆడది అంటే అబల కాదు' అన్న విషయాన్ని ఇందులోని స్త్రీ పాత్రలు నిరూపించడం విశేషం.

పేదింటి అమ్మాయిలకు పెళ్ళి కావడం ఒక సమస్య. పెళ్ళి అయితే అత్తింటి వేధింపులతో సంసారం చక్కగా సాగుతుందా అనేది మరో సమస్య, నీచుడు, నికృష్టుడు అయిన భర్త దొరికితే వాడు పెట్టే బాధలనుండి తప్పించుకుని పుట్టింటికి వస్తే పరువు, ప్రతిష్టల సాకుతో మళ్ళీ ఆ నరకంలోకే పంపించే మధ్యతరగతి మనస్తత్వాలలో దిక్కుతోచని ఆడదాని పరిస్థితిని హృద్యంగా చిత్రీకరించిన నవల "ఉరిత్రాడు". భర్త పెట్టే బాధలకు కరుణ రెండుసార్లు పుట్టింటికి రావడం, ఆమెను ఆదరించే అన్నయ్య – భర్త మారతాడేమోనని మళ్ళీ ఇంటికి వెళ్ళి పుట్టింటికి తిరిగిరావడం, కరుణ ఆమె అన్నయ్యల మనస్తత్వాల చిత్రీకరణ – వీటన్నింటిని విఫలీకరిస్తే "జానకి విముక్తి"కి దారితీయవచ్చు.

"వెన్నెల మండుతోంది" నవల నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రతిభావంతంగా చిత్రీకరించగలిగింది. అష్టకష్టాలు పడి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చంద్రం ఉద్యోగం దొరకక, తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న కుటుంబాన్ని పోషించలేక అతను పడే మానసిక వేదన వర్ణనాతీతం. చంద్రం స్నేహితులైన గ్రాడ్యుయేట్ క్లాస్‌మేట్లు కూడా ఉద్యోగాలు దొరకక జేబు దొంగలుగా, సెల్ పుస్తకాలు అమ్మేవాడిలా, చిలకజోస్యం – దొంగ లాటరీలు నిర్వహించేవాడిలా, స్మగ్లర్సుగా తయారవుతారు. మనిషిని మనిషిగా బతకనివ్వని ఈ సామాజిక అసమానతలను పెంచి పోషించే బూర్జువా వ్యవస్థను నిర్మూలించి, సరికొత్త వ్యవస్థకై సాయుధ మార్గం చేపట్టడానికి చంద్రం నిర్ణయించుకోవడంతో నవల ముగుస్తుంది. 1976లో వచ్చిన ఈ నవలలోని పరిస్థితులు, ఇప్పటి నిరుద్యోగ సమస్య తీవ్రత ఒక్కటే. అప్పట్లో సాయుధ పోరాటమే అన్నింటికి పరిష్కారం అనుకున్నారు. సాయుధ పోరాటాలు కూడా విఫలమవుతున్న ఈ రోజుల్లో పరిష్కారాల కోసం ఇంకో మార్గం వెతకాలేమో?

### క్షుద్ర సాహిత్యంపై వేటు

డెబ్బయ్యవ దశకం నుండి తెలుగు సాహిత్యంలో చోటుచేసుకున్న క్షుద్ర రచయితలను, వారి రచనలను వ్యంగ్యంగా

విమర్శిస్తూ రాసిన నవల "మరో దెయ్యం కథ" ఈ నవలలో అరవైలలో చోటు చేసుకున్న ప్రణయ సాహిత్యం, డెబ్బయిలలో వచ్చిన క్షుద్ర సాహిత్యం, ఆ తర్వాత పరిశోధనాత్మక సాహిత్యం పేరుతో వచ్చినా నానా చెత్తను – అదే ప్రజా సాహిత్యంగా పాఠకులకు నల్లమందు మత్తులా అలవాటుచేయడానికి పత్రికలవాళ్ళు చేసిన ప్రయత్నాలను ఇందులో చక్కగా తెలియజేశాడు – అభ్యుదయ రచయిత శివప్రసాద్ తన కుటుంబాన్ని పోషించడానికి మనసు చంపుకొని ప్రేమకథలు రాసినా పట్టించుకొని ఎడిటర్ దెయ్యం కథ రాయమని డిమాండ్ చేస్తాడు. తప్పనిసరి పరిస్థితుల్లో అలాంటి కథ రాయగా ఊహించని విధంగా సక్సెస్ కావడం, పత్రికలు– పాఠకులు ఆ వెల్లువలో కొట్టుకుపోవడం, వారిని జాగృతం చేయాలనే రచయిత ప్రయత్నం బెడిసికొట్టడం ఇదంతా మరో దెయ్యం కథలో చూడవచ్చు. సామాజిక నిబద్ధత కలిగివుండాల్సిన రచయిత అవకాశవాదిగా తయారై పాఠకులను భ్రమల్లోకి, మూఢనమ్మకాల వైపుకు మరలించడం అన్యాయం, అనైతికం అని వాసిరెడ్డి సీతాదేవి గారు ఈ నవలలో తెలియజేస్తారు. మొత్తంగా క్షుద్ర సాహిత్య రచనలు– రచయితలపై సంబంధించిన వ్యంగ్యాస్త్రం, అలాగే పాఠకులను కూడా మంచి సాహిత్యంపై అభిరుచి కలిగేలా ప్రోత్స హించడం కూడా వారి రచనల్లో కనబడు తుంది. ఉదాహరణకు 'సమత' నవలలో అరుంధతి చదివే "శృంగారి" మొదలైన చెత్త పుస్తకాలు చూస్తాడు రాజారావు. అవన్నీ కుప్పపోసి తగలబెడతాడు. 'ఇలాంటివి మనిషిలో ప్రాథమిక ప్రవృత్తుల్ని రెచ్చ గొడతాయి' అని మందలించి మంచి సాహిత్యం తెప్పించి ఇస్తాడు. అవి ఎలా చదవాలో, ఎలా అవగాహన చేసుకోవాలో చాలా సున్నితంగా చెప్తాడు, న్యాయానికి ఈ మలుపు అరుంధతిలో ఆరోగ్యకరమైన మార్పును తీసుకురావల్సింది. కాని అది జరగదు, అది వేరే విషయం.

## ఊర్మిళ

రిజర్వేషన్లతో ఉన్నత స్థాయి కెదిగిన దళిత యువతీ యువకులును పెళ్ళి చేసుకోవడంలో అగ్రవర్గాల వారే ముందుండటంలో వారి అవకాశవాదం ఎలా వుంటుందో తెలపడానికి రచయిత్రి ఊర్మిళ – రామశాస్త్రి జంటను ఉదాహరణగా తీసుకొని "ఊర్మిళ" నవల రాశారు. రిజర్వేషన్లను ఖండించడంతో మొదలయిన ఈ నవల రిజర్వేషన్లకు మద్దతు పలకడంతో ముగుస్తుంది. రిజర్వేషన్లు కలిగివున్న డిప్యూటి కలెక్టర్‌లాంటి క్రిమిలేయర్లు, రామశాస్త్రి–గంగాధరశాస్త్రి లాంటి ప్రతిభ వున్న సీట్లు రాని అగ్రవర్ణ విద్యార్థులను కథా వస్తువుగా చేసుకున్న రచయిత్రి స్పష్టంగా రిజర్వేషన్ల మీద తన అభిప్రాయాన్ని చెప్పలేకపోయారు. ఇంతలో రచయిత్రి రిజర్వేషన్లను సమర్థించిందా? ఖండించిందా? అంటే చెప్పడం కష్టం. ఒక విధంగా చూస్తే



అబ్బూరి ఛాయాదేవితో వాసిరెడ్డి సీతాదేవి సీతాదేవి

క్రిమిలేయర్లకు రిజర్వేషన్ సౌకర్యాన్ని ఉపసంహరింపజేసి, ప్రతిభ వున్న బీద కుటుంబాలకు చెందిన అగ్రవర్ణాలకు కూడా అవకాశాలు కల్పించాలని పరోక్షంగా సూచిస్తారు. కాని ఇరువర్గాల వారిని సమానంగా కల్పించే విధానాన్ని సూచించడం చాలా కష్టం, కాబట్టే ఆ పరిష్కారాన్ని ఈ నవలలో వెతకలేం. విద్య ప్రైవేటీకరణ చెంది కార్పొరేట్ కాలేజీలుగా పెరిగిపోతున్న దశలో చదువు ఎవరికైనా అందని పండులా మిగిలి పోయినప్పుడు.... రిజర్వేషన్లు ఎంత వరకు అందుతుంటాయో అనుమానస్పదమే.

కథా రచయిత్రిగా ప్రారంభమై, నవలా రచయిత్రిగా స్థిరపడిన వాసిరెడ్డి సీతాదేవిగారు అప్పుడప్పుడు పలు చక్కటి కథలను కూడా రాశారు. వారి కథలు కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాల గురించే కాకుండా అభ్యుదయాంశాలతో కూడిన సామాజిక విశ్లేషణలో, వస్తు వైవిధ్యానికి పెట్టింది పేరు. సమాజంలో వివిధ వర్గాలకు సంబంధించిన స్త్రీ సమస్యలు చిత్రీకరించ డంలో రచయిత్రి చూపిన నేర్పు అద్వితీయం. ముఖ్యంగా అడవాళ్ళ జీవితాలకు సంబంధించి తరాల మధ్య అంతరాలను చిత్రికరించిన కథలలో సామాజిక మార్పులు మనల్ని ఆలోచింప చేస్తాయి. వాసిరెడ్డి సీతాదేవి. నవలల్లో, కథల్లో వారు చూపే పాత్రల మానసిక విశ్లేషణ అద్భుతంగా వుంటుంది. వారు మనస్తత్వ శాస్రాన్ని కూడా అధ్యయనం చేసి వుంటారని కొన్ని కథల వల్ల తెలుసుకోవచ్చు. ప్రత్యేకంగా వివిధ మనస్తత్వాలు కలిగిన వ్యక్తుల చర్యలను, ఆయా సందర్భాల్లో వాళ్ళ ప్రవర్తనను చిత్రీకరించి వారేమిటో వారి గురించి పాఠకులకు అన్యాపదేశంగా తెలియజేయడం బాగుంది.

రచయితలకు సామాజిక చైతన్యం వుండాలనే, వాళ్ళు పాఠకులకు మార్గదర్శకంగా వుండాలని సీతాదేవిగారి అభిప్రాయం. నమ్మిన సిద్ధాంతాలలో కట్టుబడి రచనలు చేసిన నిబద్ధ రచయిత్రివారు. అందుకే ఆశయాలకు ఆచరణకు మధ్య పొంతన చూపని రచయితలను, క్షుద్ర సాహిత్య రచయితలను నిరసిస్తారు. అధ్యయనం లేక కూపస్థ మండూకాల్లా తయారైన రచయిత్రులకు "ఇంటర్వ్యూ" క్లాసు తీసుకుంటారు. ఆడ అభిమానుల ముందు ఫోజు కొట్టడానికి ప్రయత్నించే రచయితల అవకాశవాదాన్ని, వారి డిజప్పాయింట్‌ను 'అతని కథ' లో చిత్రీకరించారు. ఆడపేర్లతో రాసి రచయితలకు, ఆడపేర్లతో రాసే అభిమానులు ఎదురయితే కలిగే ఇబ్బందికర పరిస్థితిని "మిస్టర్ ముకుందం" లో చూసి హాయిగా నవ్వుకోవచ్చు. కాని నిజానికి ఒక కథ రాయాలంటే దానికోసం వాళ్ళు పడే తపనను, ఇబ్బందులను, ఇల్యూషన్స్‌ను "అమ్మమ్మ చెప్పనికథ" "విభ్రమ" కథలో చక్కగా వివరించారు. ఇవి చదువుతుంటే రచయితగా తయారు కావాలంటే ఎంత కష్టమో, తెలుస్తుంది. మన కళ్ళముందు కనిపించే మనుషులు, వారి సమస్యలు అర్థం చేసుకుంటే వాటినే ఎన్నో విధాలుగా మార్చవచ్చని "నా కథ రాయవూ"లో నిరూపిస్తారు.

వాసిరెడ్డి సీతాదేవి రచనలను నేటి పరిస్థితులలో విశ్లేషించటంలో ఆమెను మార్క్సిస్టు రచయిత్రిగా స్త్రీవాద రచయిత్రిగానో ముద్ర వేయలేం. ఇవన్నీ వాదాలుగా స్థిరపడకముందే తమకున్న సామాజిక అవగాహనతో – చైతన్యంతో వారు తమ రచనలను ప్రారంభించారు. ప్రణయ సాహిత్యం ప్రబలంగా వస్తున్న రోజులలోనే, ఆ ధోరణికి భిన్నంగా తన అనుభవాలను ఆధారంగా చేసుకుని, తమ చుట్టూ జరుగుతున్న యథార్థ సంఘటనలనే నవలలుగా రాయడం మొదలుపెట్టారు. దీన్ని మనం ''సామాజిక వాస్తవికత''గా పేర్కొనవచ్చు. వాస్తవికత అంటే కేవలం ఉన్నది ఉన్నట్టుగా మాత్రమే రాయడం కాకుండా విశ్లేషణ ఆధారంగా, విమర్శ నాత్మకంగా చిత్రించడమనీ, ఈ సమాజం ఇలా ఎందుకుంది? ఈ సమాజాన్ని నడిపించే ఆర్థిక, సామాజిక, రాజకీయ శక్తులేమిటి? ఈ సమాజాన్ని అభ్యుదయ పథం వైపు నడిపించాలంటే మనమేం చెయ్యాలి? అన్న ప్రశ్నలకు రచయిత్రి తమ రచనల్లో సమాధానాలను సూచించాలన్న అవగాహన కూడా సీతాదేవికున్నది. మంచి నవల ఆహ్లాదంతో పాటు పాఠకుడ్ని ఆలోచించేటట్లు చేసి తనలోకి తాను చూసుకునేటట్టు తన చుట్టూ వున్న సమాజాన్ని చూసేట్లు చెయ్యాలనే, చదివించే గుణం నవలలో చాలా ముఖ్యమని సీతాదేవి గ్రహించారు. అందుకే ఆమె రాసిన నవలలన్నింటిలోనూ ఈ చదివించే గుణం పుష్కలంగా వుంటుంది.



**శ్రీమతి శారదా అశోకవర్ధన్, శ్రీమతి పి. ఆనందరామం, శ్రీమతి జానకీ బాలతో వాసిరెడ్డి సీతాదేవి**

**ఆధార గ్రంథాలు :**


1. **డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి సమగ్ర సాహిత్యం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్**
2. **"మనీషి" డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి సాహితీ స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక**
3. **"సాహిత్య వ్యాసాలు" నవీన్... ప్రత్యేక ప్రచురణలు, వరంగల్**


## వాసిరెడ్డి సీతాదేవి కన్నుమూత

ప్రఖ్యాత నవలా రచయిత్రి డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి (76) ఏప్రిల్ 13న హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె అస్తమా వ్యాధికి చికిత్స పొందుతూ మృతి చెందారు. సికింద్రాబాద్ బన్సీలాల్‌పేటలోని స్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. సీతాదేవి గుంటూరు జిల్లా చేబ్రోలులో జన్మించారు. ఆమె నాగపూర్ విశ్వ విద్యాలయంలో ఎంఎ పూర్తి చేశారు. 30 సంవత్సరాల కిందట నగరానికి వచ్చి స్థిరపడ్డారు. బాలభవన్ సంచాలకురాలిగా, యువజన సర్వీసుల శాఖ ఉపసంచాలకురాలిగా పనిచేశారు. నంది ఫిలిం అవార్డు, తెలుగు అడ్వైజరీ రిపోర్ట్, దూరదర్శన్ అడ్వైజరీ కమిటీ, ఆంధ్రప్రదేశ్ సాహితీ అకాడమీలో సభ్యులుగా సేవలందించారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, పద్మావతి విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు.

వివాహానికి దూరంగా ఉండి ఒంటరిగా జీవనాన్ని కొనసాగించారు. ఆమె కలం నుంచి 40 నవలలు, 10 కథా సంకలనాలు, 8 అనువాద పుస్తకాలు, 5 పిల్లల పుస్తకాలు వెలువడ్డాయి. ఆమె రాసిన 'మట్టిమనిషి' నవల 14 భాషలలోకి అనువాదం పొందింది. ఈ నవలను ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎంఏ రెండో సంవత్సరం తెలుగు సబ్జెక్టులో ప్రవేశపెట్టారు. 'రాబందులు – రామచిలుకలు' అనే నవల కాకతీయ విశ్వ విద్యాలయం డిగ్రీ కోర్సులో ప్రవేశ పెట్టింది. సీతాదేవి రచించిన నవలలు సినిమాలుగా కూడా వచ్చి ప్రేక్షకుల ఆదరణ పొందాయి. దూరదర్శన్‌లో ప్రసారమయ్యాయి. సీతాదేవి నవలలపై ఎంతో మంది విద్యార్థులు పరిశోధన చేశారు.

వాసిరెడ్డి సీతాదేవి భౌతికకాయాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి సంతాపాన్ని ప్రకటించారు. సాహిత్య ప్రస్థానం మేనేజర్ కె. లక్ష్మయ్య, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ ఎస్. శ్రీనివాసరావు అంత్యక్రియలకు హాజరై నివాళులర్పించారు.

## సాహితీ స్రవంతి నివాళి

ప్రముఖ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి మృతి పట్ల సాహితీ స్రవంతి ప్రగాఢ సంతాపం ప్రకటించింది. సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి తన సంతాప సందేశంలో ఇలా పేర్కొన్నారు:

అరవై దెబ్బయిలలో ఉధృతంగా సాగిన కాల్పనిక ఒరవడికి భిన్నమైన సామాజిక వాస్తవికతతో కూడిన రచనలందించిన ప్రముఖులలో ఆమె ఒకరు. వాసిరెడ్డి సీతాదేవి గారి మట్టి మనిషి, సమత, మరీచిక వంటి నవలలు సామాజిక, చారిత్రిక పరిణామ క్రమానికి అద్దం పట్టిన మంచి రచనలుగా నిల్చిపోయాయి. సమాజంలోని వైరుధ్యాలనూ, వాటి ప్రభావంతో ఏర్పడిన వివిధ వైకల్యాలను శక్తివంతంగా చిత్రించిన మరీచిక నవల నిషేధాలను కూడా ఎదుర్కోవలసి వచ్చింది. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగానూ నిశితంగానే చెప్పే వ్యక్తిగా ఆమె అందరి గౌరవం పొందారు. తన రచనలలోనూ జీవితంలోనూ మహిళా చైతన్యాన్ని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన వాసిరెడ్డి సీతాదేవి పలు అధికార బాధ్యతలు నిర్వహించి సేవలందించారు. అభ్యుదయ భావాలకు, ఉద్యమాలకు చివరి వరకూ మద్దతునిచ్చారు. ఆమె సోదరుడు వాసిరెడ్డి నారాయణరావు, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఉద్యమాలతోనూ, ఉత్తమ భావాలతోనూ పెనవేసుకున్నవారే. ఈ విచారకర సమయంలో సాహితీ స్రవంతి ఆమె కుటుంబ సభ్యులకూ, అభిమానులకు సానుభూతి తెలియజేస్తోంది. వాసిరెడ్డి సీతాదేవికి జోహారులర్పిస్తోంది.

## నివేదిక



ఖమ్మంజిల్లా 8వ వార్షికోత్సవ సభలో తెలకపల్లి రవి ప్రసంగం; వేదికపై టి.ఎస్. ప్రసాద్, ప్రొ॥ మేడిపల్లి రవికుమార్, డా॥ పట్టాభి రామారావు, డా॥ వాసిరెడ్డి రమేష్‌బాబు, డా॥ సూర్యదేవర రామమోహనరావు, మండవ సుబ్బారావు



మండవ సుబ్బారావు పరిశోధనా గ్రంథం 'త్వమేవాహం-కావ్యదర్శనం' ఆవిష్కరణ సందర్భంగా (కుడి నుండి) కె. ఆనందాచారి, మండవ సుబ్బారావు, తెలకపల్లి రవి, ప్రొ॥ మేడిపల్లి రవికుమార్, డా॥ పట్టాభి రామారావు, డా॥ సూర్యదేవర రామమోహనరావు, డా॥ వాసిరెడ్డి రమేష్‌బాబు, మాగంటి సూర్యం

# ఖమ్మంజిల్లా 8వ వార్షికోత్సవ సభలో సాహితీ స్రవంతి

**ఖ**మ్మం జిల్లా సాహితీ స్రవంతి 8వ, వార్షికోత్సవం ఏప్రిల్ 14న కొత్తగూడెం భారత్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరిగింది. ఈ వార్షికోత్సవానికి సాహితీ స్రవంతి రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లిరవి ముఖ్య అతిథిగా వచ్చారు. సాహితీ స్రవంతి నేటి సాహిత్యపు తీరు తెన్నులు వివరించారు. ముఖ్యంగా ''సాహితీ ప్రస్థానం'' చందాలను పెంచుకోవలసిన ఆవశ్యకతను వివరించారు.

ఈ వార్షికోత్సవ సభకు కొత్తగూడెంలోని ప్రముఖ వైద్యులు డా॥ పట్టాభి రామారావు అధ్యక్షతవహించారు. జాతశ్రీగారి 'కుట్ర' కథాసంకలనాన్ని, డా॥ వాసిరెడ్డి రమేష్‌బాబు ఆవిష్కరించారు. మండవ సుబ్బారావు "త్వమేవాహం కావ్యదర్శనం" ను, డా॥ సూర్యదేవర రాంమోహన్‌రావుగారు ఆవిష్కరించారు.

మేడిపల్లి రవికుమార్ గారు మాట్లాడుతూ జాతశ్రీ 'కుట్ర' కథాసంపుటికి, ముందు మాట రాసే భాగ్యం కల్గినందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదంల ముసుగుచించే ప్రయత్నం 'కుట్ర'లో జరిగిందని తెలిపారు. జాతశ్రీ కలానికి వర్గదృష్టి ఒక నిబద్ధత వుందన్నారు. "త్వమేవాహం-కావ్యదర్శనం" ఆరుద్ర గారి "త్వమేవాహం" కావ్యాన్ని అర్థం చేసుకోవడానికి ఒకగైడ్‌లా వుపయోగపడుతుందని చెప్పారు.

మధ్యాహ్నపు సభలో కె. ఆనందాచారి. కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. జిల్లాలోని కవులు, రచయితలు, ఎందరో సాహిత్యాభిమానులను, సాహితీస్రవంతి సంపాదించిందన్నారు. అభ్యుదయ వాదుల అభిమానాన్ని చూరగొన్నదన్నారు. ఖమ్మం జిల్లా కార్యక్రమాల నిర్వహణలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

రాబోయే కాలంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విస్తరించాలని, సాహితీస్రవంతి శాఖలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సాహిత్య ప్రస్థానం పత్రికను రాష్ట్రంలో కెల్లా పెద్ద సర్క్యులేషన్ కల్గిన జిల్లాగా తీసుకురావడానికి ప్రయత్నిస్తామన్నారు. కనీసం 2 నెలలకు ఒక కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జూన్, జులై నెలలలో 'సాహిత్యశాల' నిర్వహించడానికి ప్రయత్నిస్తామన్నారు. అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాలలో సాహిత్యసభలు నిర్వహించాలని, ఖమ్మం పట్టణంలోను, ఖమ్మం డివిజన్‌లోను కమిటీల నిర్మాణం చేయాలన్నారు. భవిష్యత్ కార్యక్రమాలు చేయడం కోసం ఒక ప్రణాళికను వివరించారు.

ఇటీవల కాలంలో కన్నుమూసిన డా॥హరిష్‌గారికి (ఖమ్మం) హీరాలాల్ మోరియా, వల్లంపాటి, మొదలగు కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులకు రచయితలకు వార్షికోత్సవ సభ జోహారు లర్పించింది.

రాష్ట్ర కన్వీనర్ తెలకపల్లి రవి ముగింపు ప్రసంగం తర్వాత శిరంశెట్టి కాంతారావు నూతన కమిటిని ప్రవేశపెట్టారు.

**నూతన కమిటీ వివరాలు**

సాహితీ స్రవంతి ఖమ్మంజిల్లా గౌరవ అధ్యక్షులుగా జాతశ్రీ (కొత్తగూడెం) గౌరవ సలహాదారులుగా పొట్లూరి వెంకటేశ్వరరావుగారు మండవ సుబ్బారావుగారు, రవిమారుతిగార్లను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**అధ్యక్షులు:** కె. ఆనందాచారి ; **ఉపాధ్యక్షులు:** మాల్యశ్రీ , ఎస్. కాంతారావు, ఈగా హనుమాన్ రూత్‌మేరి, బొమ్మరాత ఎల్లయ్య, సాదనాల షుకూర్, సత్యశ్రీ, కపిల రాంకుమార్, కట్టా శ్రీనివాస్, వెల్లంపల్లి శ్రీరాంరావు; **ప్రధాన కార్యదర్శి:** రౌతు రవి; **కార్యదర్శులు :** లెనిన్ శ్రీనివాస్, పోతగాని సత్యనారాయణ, యం. శేషగిరి, కె. రమేష్, సత్యానందం, దుర్గాచారి, కె. శ్రీవాణి, ఐనాలసైదులు, సి.హెచ్. ఆంజనేయులు, గుర్రం సీతారాములు, బాణాల కృష్ణమాచారి. **కోశాధికారిగా :** శ్రీమతి వి. సునంద

ఈగా హనుమాన్ వందన సమర్పణతో వారికోత్సవ సభ ముగిసింది.

## 'పేగుబంధం' ఆవిష్కరణ సభ

ఎన్నో సాహిత్య ఉద్యమాలకు, ప్రక్రియలకు నల్లగొండతో అవినాభావ సంబంధం ఉందని ప్రముఖ రచయిత అల్లం రాజయ్య అన్నారు. బోధనం నర్సిరెడ్డి రాసిన 'పేగుబంధం' కథల పుస్తకాన్ని మార్చి 10వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయలంలో ఆయన ఆవిష్కరించారు. గ్రామీణ మానవ సంబంధాల్లోని ఉన్నత విలువలను ఎటువంటి జిమ్మిక్కులు లేకుండా రచయిత ఈ కథల్లో ఎంతో హృద్యంగా చిత్రించాడని ఆయన ప్రశంసించారు.

గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గాదె వినోదరెడ్డి రచయిత బోధనం నర్సిరెడ్డిని శాలువాతో సత్కరించారు. ప్రముఖ సాహితీ విమర్శకులు ఎస్. రామకృష్ణ, అల్లం నారాయణ కథల సంపుటిని పరిచయం చేశారు. పొల్లుపోని నల్లగొండ మాండలికంలో వ్యవసాయ జీవితాలను రచయిత సమర్థవంతంగా చిత్రించారని వారన్నారు. ఆవిష్కరణ సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత కాసుల ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గతాన్ని వర్తమానంతో అనుసంధానం చేస్తున్న కథలుగా పేగుబంధం కథలను అభివర్ణించారు. తాను అనుభవించిన గ్రామీణ జీవితం తన కథలకు స్ఫూర్తి అని రచయిత పేర్కొన్నారు. తన పుస్తకం మొదటి కాపీని ఆవిష్కర్త చేతుల మీదుగా ఆయన కట్టా మల్లారెడ్డికి అందించారు.



**రచయిత బోధనం నర్సిరెడ్డి, గాదె వినోదరెడ్డి, కాసుల ప్రతాప్‌రెడ్డి, అల్లం రాజయ్య, ఎస్. రామకృష్ణ, అల్లం నారాయణ (ఎడమ నుంచి)**

కార్యక్రమంలో డాక్టర్ నోముల సత్యనారాయణ, డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, బైరెడ్డి కృష్ణారెడ్డి, మేరెడ్డి యాదగిరి రెడ్డి, అల్లుబెల్లి రామచంద్రారెడ్డి, దొడ్డి రామ్మూర్తి, కట్టా భగవంతరెడ్డి, పులిజాల మంజుల, నిమ్మల భీమార్జున్‌రెడ్డి, బెల్లి యాదయ్య, కొల్లోజు కనకాచారి తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాస్, నాగేశ్వరరావులు పల్లెపాటలను గానం చేశారు.



**మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎస్.ఎస్. రెడ్డి రచించిన 'కవితా రవళి' గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య నాయని కృష్ణకుమారి ఆవిషరిస్తున్న దృశ్యం**

## ఎస్.ఎస్. రెడ్డి 'కవితా రవళి' ఆవిష్కరణ

హైదరాబాద్ కోనసీమ ద్రావిడ సంఘం కళా వేదికలో ఏప్రిల్ 5వ తేదీన మానస ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎస్.ఎస్. రెడ్డి రచించిన 'కవితా రవళి' గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య నాయని కృష్ణకుమారి ఆవిష్కరించారు. సభకు హాస్య బ్రహ్మ శంకర నారాయణ అధ్యక్షత వహించారు. యువ భారతి అనంతాచారి పుస్తక పరిచయం చేశారు. ఇంకా సభలో పాత్రికేయులు కల్లూరి భాస్కరం, వి. మధుసూదనరావు, కోకా వీరప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రఘుశ్రీ, సైపా రాజేశ్వర్ గుప్త, వి. భాను సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. అతిథులు కవి ఎస్.ఎస్. రెడ్డిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

## 'గంటేడ గౌరునాయుడు'కు "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు"

ఆధునిక కవిత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారంగా భావించబడుతున్న ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు-2006 కోసం గంటేడ గౌరునాయుడుగారి 'నదిని దానం చేశాక...' కవితా సంపుటికి ప్రకటించినట్లు అవార్డు వ్యవస్థాపకులు ప్రముఖకవి రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఈ అవార్డు న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ కవులు నగ్నముని, కొప్పర్తి, డాక్టర్ బీరం సుందర్రావుగార్లు వ్యవహరించారు. కళింగాంధ్ర జీవితాన్నీ, భూనిర్వాసితుల కన్నీటి తడినీ ఆ ప్రాంత భౌగోళిక నేపథ్యంలోంచి ఈ కవి సమర్థవంతంగా చిత్రించాడని న్యాయ నిర్ణేతలు పేర్కొన్నారని రాధేయ వివరించారు.

ఈ అవార్డు పొందిన వారిలో గౌరునాయుడుగారు పంథొమ్మిదవవారు. వీరు విజయనగరం జిల్లా కురుపాం వాస్తవ్యులు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులు. మంచి నిబద్ధత గల కవిగా, కథా రచయితగా సాహిత్యలోకంలో వీరికి గుర్తింపు ఉంది.

ఈ అవార్డు పరిశీలన కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎనభై ఏడు కవితా సంపుటాలు అందాయి. ప్రవాసాంధ్రులు కూడా ఈ పోటీలో పాల్గొనడం విశేషం. ఈ అవార్డు ప్రధానోత్సవం జూన్ నెలలో అనంతపురంలో జరుగుతుందని రాధేయ తెలియజేశారు.

# "ఆయుధం కవిత్వం" ఆవిష్కరణ



'ఆయుధం కవిత్వం' కావ్యాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర హోంమంత్రి కె. జానారెడ్డి, చిత్రంలో రచయితతో పాటు ఆచార్య ఎన్.ఎస్. రాజు, డా॥ పి. మధుసూదనరావు, ఆచార్య సి. నారాయణరెడ్డి, కోలేటి దామోదర్ ఉన్నారు

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ రావికంటి వసునందన్ రచించిన "ఆయుధం కవిత్వం" దీర్ఘ కావ్యాన్ని రాష్ట్ర హోంశాఖ మంత్రి కుందూరి జానారెడ్డి ఇటీవల ఆవిష్కరించారు. సమాజాభివృద్ధికి దోహదం చేసే రచనలు చేస్తున్న రచయితలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా ప్రసంగిస్తూ అన్నారు. కృతిని అంకితం స్వీకరించిన జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత ఆచార్య సి. నారాయణరెడ్డి తన ప్రసంగంలో అంచెలంచెలుగా ఎదిగిన వసునందన్ అచ్చమైన కవి అని ప్రశంసించారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో నటకుల, సాహితీ మేఖల ఆధ్వర్యంలో జరిగిన సభకు దూరదర్శన్ సంచాలకులు డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు అధ్యక్షత వహించారు. ఆచార్య ఎన్.ఎస్. రాజు, కోలేటి దామోదర్, డాక్టర్ తిరునగరి శ్రీనివాస్, డాక్టర్ పున్నా అంజయ్య, దాసరి శివాజీరావు తదితరులు ప్రసంగించారు.

# తెలుగు సాహిత్యరత్నాలు ఆవిష్కరణ, 'ప్రస్థానం' పరిచయం.

నేటి ప్రపంచీకరణ సందర్భంలో తెలుగుభాషను కాపాడుకోవలసిన అవసరం వుందని, ఆబాధ్యత తెలుగు వారిదేనని ప్రముఖ కవి డా॥ అద్దేపల్లి రామమోహనరావు అన్నారు ఏప్రిల్ 14న కాకినాడ యుటి.ఎఫ్.హోమ్‌లో జరిగిన చిందాడ. చిన్నోడు (చిన్నా) రచించిన 'ప్రాచీన ఆధునిక తెలుగు సాహిత్యరత్నాలు' గ్రంథావిష్కరణ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసి పుస్తక సమీక్ష చేశారు అద్దేపల్లి. సామాన్యులకు కవుల గురించి పూర్తి అవగాహన కలిగించే విధంగా ఒక ప్రణాళికను రూపొందించుకుని తెలుగు కవుల పరిచయాన్ని చిన్నోడు ఈ గ్రంథంలో చేశారన్నారు. ఈ గ్రంథాన్ని ఆవిష్కరించిన విమర్శకులు. మాకినీడి సూర్యభాస్కర్ మాట్లాడుతూ 66 మంది కవుల జీవిత, సాహిత్య విషయాలను ఈ గ్రంథంలో పొందుపరిచారన్నారు. పోటి పరీక్షలకు తయారయ్యే విద్యార్థులకు, సాహితీ ప్రియులకు ఉపయుక్తంగా వుంటుందని మాకినీడి అన్నారు. మొజాయిక్ ఎడిటర్ రామతీర్థ, పండిత శిక్షణా 'కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ధూళిపాళ విశాల, తెలుగు పండితులు జి.వి.వి.యస్.ఎన్. మూర్తి, ఎం.ఎస్.యన్.



"ప్రాచీన ఆధునిక తెలుగు సాహిత్య రత్నాలు" పుస్తకావిష్కరణ సభలో (ఎడమ నుంచి కుడికి) రచయిత చిందాడ చిన్నోడు (చిన్నా), అద్దేపల్లి రామమోహనరావు, దత్తు, రామతీర్థ, మాకినీడి సూర్యభాస్కర్, జి.వి.వి.ఎస్.ఎన్. మూర్తి.

మూర్తి, గుంటుకు హేమకుమారి తమ అభిభాషణలో రచయిత కృషిని శ్లాఘించారు. పి. ఇమ్మానుయేలు వందన సమర్పణతో ముగిసింది.

తదనంతరం 'ప్రస్థానం' సాహిత్య మాసపత్రికను సత్యాజీ ఆవిష్కరించి పరిచయం చేశారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ నందూరి దత్తు అందులోని రచనలను విశ్లేషించారు.

డా॥ అద్దేపల్లి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది.



**సీనియర్ పాత్రికేయులు, కవి మల్లయ్య రచించిన 'కనుపాపలు' నానీలను కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్. గోపి ఆవిష్కరిస్తున్న దృశ్యం. ఈ చిత్రంలో అధికార భాషా సంఘం సభ్యులు కాలువ మల్లయ్య, 'కనుపాపలు' నానీల రచయిత మల్లయ్య, రచయిత జూకంటి జగన్నాథం, కరీంనగర్ సమైక్య సాహితీ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, అన్నవరం దేవేందర్‌లు ఉన్నారు.**

## "ధిక్కారం" పుస్తకావిష్కరణ సభ



ఏప్రిల్ 20న వరంగల్ హాలులో "ధిక్కారం" పుస్తకావిష్కరణ సభలో ఎన్. వేణుగోపాల్, నందిని సిధారెడ్డి, నల్లెల్ల రాజయ్య, వడ్డెబోయిన శ్రీనివాస్, ఎం.ఎ. బాసిత్

ఏప్రిల్ 20 వతేదీ హన్మకొండలోని జిల్లా పరిషత్ సాహిత్యాభిషుల సమక్షంలో "ధిక్కారం" పుస్తకావిష్కరణ సభ జరిగింది. వరంగల్ రచయితల సంఘం పక్షాన నల్లెల్ల రాజయ్య, వడ్డెబోయిన శ్రీనివాస్‌ల సంపాదకత్వం, ఎం.ఎ. బాసిత్ కృషితో ప్రకటించిన "ధిక్కారం" సామ్రాజ్యవాద వ్యతిరేక కవితా సంకలనాన్ని తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు నందిని సిధారెడ్డి ఆవిష్కరించగా, వీక్షణం వర్కింగ్ ఎడిటర్ ఎన్. వేణుగోపాల్ సమీక్షించారు. పిట్ట సాంబయ్య వందన సమర్పణతో ముగిసిన ఈ సభలో మానవహక్కుల వేదిక అధ్యక్షులు బుర్రా రాములు, డి.టి.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గంగాధర్, జిల్లా అధ్యక్షులు బి. నర్సయ్య, టి.లింగారెడ్డి, కె సుధీర్‌బాబు, బి. నారాయణరెడ్డి, ప్రజాసంఘాల బాధ్యులు ఎస్. అనిత, తనూజ, రమాదేవి, కట్టయ్య, ఫ్రాన్సిస్, సాహితీవేత్తలు రామాచంద్రామౌళి, వలిగొండ కాంతారావు, పొట్టపల్లి శ్రీనివాసరావు, వి.ఆర్.విద్యార్థి, పీ. వీరబ్రహ్మాచారి, గుండె బోయిన శ్రీనివాస్, తంగెళ్ళ సుదర్శన్, ఎం. రవీందర్, ఉదయ్ సింగ్, సయ్యద్ ఖుర్షీద్, టి.వెంకట్రాం, నర్సయ్య మరియు సాహిత్యాభిలాషులు అనేకమంది పాల్గొన్నారు.

## రఘువీర్ ప్రతాప్‌కు అవార్డు



ఎన్.వి రఘువీర్ ప్రతాప్‌కు చెలిమి సాహిత్య, సాంస్కృతిక సంస్థ రాష్ట్ర స్థాయి అంబేద్కర్ సాహిత్య అవార్డును ప్రదానం చేసింది. ఈ నెల 15న విజయవాడ బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్‌లో జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు పద్మశ్రీ డాక్టర్ తుర్లపాటి కుటుంబరావు, విజయవాడ ఎంఎల్ఎ శ్రీ షేక్ నాసర్ వలీల చేతుల మీదుగా రఘువీర్ ప్రతాప్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. రఘువీర్ ప్రతాప్ బాల కార్మిక వ్యవస్థపై రాసిన "వెలుగు చూడని వైనమ్" అనే కవిత రాష్ట్ర స్థాయి అవార్డును గెలుచుకుంది. ఈ కార్యక్రమంలో విజయవాడ దూరదర్శన్ కేంద్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఐ.వి. రమణయ్య, సంస్థ వ్యవస్థాపకులు పి.ఎం. సుందరరావు వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కవులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో 'మానస ఆర్ట్ థియేటర్స్' – 'శృతి' సంస్థల ఆధ్వర్యంలో జరిగిన సభలో రాయల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ (లండన్) వారి గౌరవ డాక్టరేట్ పొందిన కృష్ణారావు కేశవ్‌ను సన్మానిస్తున్న జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి. చిత్రంలో రావూరి భరద్వాజ, కె.వి. భాస్కరరావు, రఘుశ్రీ, వేణుగోపాల్, సైపా రాజేశ్వర్ ఉన్నారు.



హైదరాబాద్ సుందరయ్య కళా నిలయంలో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రొ॥ ననుమాస స్వామిని సత్కరిస్తున్న తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డాక్టర్ ఆవుల మంజులత, చిత్రంలో కుసుమారెడ్డి, రఘుశ్రీ, ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులున్నారు

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

గుడిసెజాగ అడిగితే గుండెలపై కొడతారు !    నిరుపేదలు కదిలొస్తే కర్కశాలు చేస్తారు !!



అమ్మా ఇది  రాక్షసాల లాఠీ గోలీ సర్కార్ !    వెనుదీయక పోరాటం  సాగించుడు జరూర్ !!










**Training:** A vibrant team of highly skilled professionals having vast experience in the fields of 2D/3D Character Animation, Original content development, documentary film making, Visual FX & Film Editing. They possess expertise skill set in animation film productions, planning & execution and training operations. They also have worked on various Animation projects of the American, Canadian & French based production companies.

**Industry**: The **NASSCOM** report 2006 states that the size of global Animation industry is around **US$ 55 Billion** and is expected to grow to the tune of **US $ 95 billion** by 2009,it also states that the present size of the Indian animation industry is at about **US$ 550million** & it is set to grow @ **35%** CAGR per annum to reach a whopping figure of **US$ 950 Million** & will create around 100,000 jobs in the field of Animations & content development.

**Specialised Courses In**

- Extreme 3D 12 Months
- Complete 2D 12 Months
- Advanced Editing (FCP) 3 Months
- Extreme compositing (SHAKE) 3 Months
- Complete Animation Film Making 18 Months

**Placements: RACE** offers you the best placement services for you to work with the major production studios in INDIA & Abroad.



# RACE
THE ANIMATION COLLEGE

5th floor, Vista Grand Towers, Rajbhavan road, Somajiguda, Hyderabad-82.

**Ph:+91- 40 - 2332 5533 / 34 / 36**

**www.race-india.com**




## Animate Your Dreams
# Join India's No.1 Animation College

**RACE** - *The next generation Animation Training College is Powered with cutting edge technology based Lab infrastructure facilities,* **RACE** *is all set to bring a revolution in the Animation industry by its training & production capabilities driven by best of creative talents in the Animation industry.*

**RACE** *promoted by the parent company* **RVML** *(production facility) is all set to produce skilled specialised Artists, ready to work on highly paid international & domestic projects.*

**RACE *Advantage:***

- Powerful XEON workstation with 19" TFT monitor
- NVIDIA Extreme graphic cards
- Apple G5 Quad systems with 23" Cinema Display
- 24 / 7 Lab Facility
- Library facility with special DVDs from ALIAS
- Professional Faculties with international project experience and training exposure
- Production based intensive training
- Guest lectures
- Special advisory panel comprising Industry experts
- Placement support from placement partners
- Centralized air-conditioned classrooms and labs

Ramakrishna ch

24/7 Lab Facility